మార్చి 2021
రూ. 20/-

# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక



## మహిళా దినోత్సవ శుభాకాంక్షలు


హోలీ శుభాకాంక్షలు


టెక్సాస్ రాష్ట్రంలో మంచు తూఫాన్ భీభత్సం




చైతన్యం
సంకల్ప బలం

వ్యవస్థాపక సంపాదకురాలు
తీగవరపు శాంతి

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -10 మార్చి 2021 సంచిక - 6


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| వైద్యో నారాయణో హరి: | 6 |
| హగ్ బాస్ హంగామా | 7 |
| దశమ గ్రహం కాదు | 11 |
| వేదులాన్వయు పలుకు | 15 |
| పూరీ జగన్నాధస్వామి వైభవం | 16 |
| సప్త మోక్ష నగరాలు | 19 |
| స్త్రీ గొప్పతనం | 23 |
| 116 కందాల్లో సుందరకాండ | 26 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 29 |
| ప్రేమంటే ఇంతే | 33 |
| సనాతన(హైందవ) ధర్మంలో మహిళ | 39 |
| నవవిధ భక్తులు | 41 |
| మా ఊరి నందుల కథ | 43 |
| భాగవతులతో అనుబంధం | 45 |
| గడి - నుడి | 46 |
| ఎవరెస్టుని అధిరోహించి పూర్ణ మాలావత్ | 47 |
| ఆడవాళ్లు ఆనందంగా ఉంటే అద్భుతాలే | 49 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక
యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## మహిళా శక్తి

మహిళ మానసికంగా, బుద్ధి పరంగా చాలా శక్తి వంతురాలు. అంటే శక్తి వంతురాలైనప్పుడు మహిళా దినోత్సవం అంటూ ఉత్సవాలు, మహిళల హక్కులు అంటూ పోరాటాలు ఎందుకు? నిజంగా పురుషాహంకారానికి స్త్రీ బలైపోతోందా? తన హక్కులను కాల రాస్తున్నాడా? పురుషుడు, అంటే ప్రతీ స్త్రీ తనకి హక్కులు లేకుండా చేస్తుంటే బానిసత్వపు బ్రతుకు బతుకుతోందా? అని తనకి తాను ప్రశ్నించుకోవలసిన అవసరం ఉంది. అంతేకాని రోడ్లెక్కి, పోరాటాలు చేస్తే ఏమైనా ఉపయోగం ఉందా? కలిసికట్టుగా పరిష్కార మార్గం వెతుక్కోవాలా? అందులోను ప్రస్తుతం మీడియా అందరికీ అందుబాటులో ఉంది. అది ఒక గొప్ప మార్గదర్శకం అవుతుంది అందరికీ. స్త్రీ తమ హక్కులను ఆ విధంగా పొందొచ్చా? ఆలోచించండి. ప్రతీ స్త్రీ విద్యావంతురాలైతేనే కుటుంబాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దకలదు. పూర్వకాలంలో అయితే తల్లి పాత్ర చాలా ప్రభావం చూపించేది పిల్లల మీద. కానీ ప్రస్తు పరిస్థితుల దృష్ట్యా భార్యా భర్తలు ఇద్దరు ఉద్యోగం చేస్తేనే కానీ కుటుంబాన్ని చక్కగా తీర్చి దిద్దుకోలేని పరిస్థితి. అటువంటి పరిస్థితులలో భార్యా భర్తలిద్దరూ కలిసి మెలిసి, ఆడ పని మగ పని అనే తేడా లేకుండా ఆడుతూ పాడుతూ ఆనందంగా పిల్లలని పెంచుతూ, తమ కుటుంబానికే కాక ప్రపంచంలో కూడా సంస్కారవంతులైన, గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందే వారుగా పిల్లల్ని తీర్చిదిద్దవలసిన బాధ్యత ప్రతీ తల్లితండ్రులమీద ఉంది. అంతే కానీ భార్యా భర్తలిద్దరూ ఎప్పుడూ వాదులాడుకుంటూ ఉంటే, ఆ కుటుంబమే కాదు అలాంటి వారివల్ల సమాజం కూడా పాడై పోతుంది.

మహిళా శక్తిని అనవసర పనులకు వ్యర్థం చేయకండి. ఎంతో మంది స్త్రీలు ఉన్నత పదవులలో ఉన్నా, ఉన్నత ఆశయాలు ఉండీ, వారి జీవితాలను దుర్వినియోగం చేసుకునే వారు కూడా లేక పోలేదు. కొందరు ప్రోత్సాహం లేదంటూ వెనుకంజ వేసే వారు అయితే భర్తలతో పోరాడి సాధించేవారు మరి కొందరు. ఆలా కాకుండా ... స్వతహాగా ఉన్న మానశిక ధైర్యాన్ని ప్రదర్శిస్తూ , తన తెలివితేటలతో కుటుంబంలో ఎటువంటి కలహాలు తెచ్చుకోకుండా సామాజిక విలువలను కాపాడుతూ స్త్రీ అత్యున్నతస్థానాలను అధిరోహించాలి. ప్రతీ కుటుంబాన్ని సంస్కారవంతంగా ఉన్నతంగా ఉంచుకోవాలి. అందుకు ఒక్క స్త్రీయే కాదు స్త్రీ తో సమానంగా పురుషుడు కూడా కష్టపడాలి. ఎందుకంటే స్త్రీకూడా పురుషుడితో సమానంగా కష్టపడుతోంది. అలా అని ఎంత ఉన్నత చదువులు చదువుకున్నా, స్త్రీలను కొందరు పురుషులు కుటుంబ అవసరాలు స్త్రీలను ఇంటికీ పరిమితం చేస్తున్నారు. అది చాలా తప్పు. అన్ని బాధ్యతలను ఇద్దరూ సమానంగా పంచుకుని, కుటుంబాన్ని దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్ళండి.

మీడియాను అభ్యంతరకరమైన, అసహ్యకరమైన వాటికి వినియోగించకుండా, స్త్రీని గౌరవపథంలో నిలబెట్టదానికి మాత్రమే వినియోగించండి. ప్రజల మనస్సులలో మీడియా పాత్ర చాలా ప్రధానమైనది. స్త్రీని హాస్యానికి, వ్యంగానికి వినియోగించకండి. ఒక స్త్రీగా నా అభర్ధన.

కార్యేషు దాసీ, కరణేషు మంత్రి భో జ్యేషు మాతా అని చెప్పే ధైర్యం భర్తలకు లేదు. ఒక వేళ చెప్పినా ఈ రోజుల్లో స్త్రీలు వినను కూడా వినరు. వినేంత సమయం కూడా వారికి ఉండడం లేదు. ప్రస్తుతం స్త్రీ మీద జరుగుతున్న అరాచకాలు, మాన భంగాలు ఇప్పటికైనా మానేసి స్త్రీలను గౌరవంగా చూడడం నేర్చుకోండి. వారికి చేదోడు వాదోడుగా నిలబడండి. ఉన్నత పదవులు చేపట్టిన స్త్రీలు ఎందరో ఉన్నారు. అలాంటివారినందరినీ ఆదర్శంగా తీసుకుందాం .

'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' మనుశృతి లో చెప్పినట్లు స్త్రీలు ఎక్కడ పూజింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారు అని మన మను ధర్మం చెపుతోంది.

ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవలసిన బాధ్యత మన స్త్రీల మీద కూడా ఉంది కదూ!

తీగవరపు శాంతి

# అభిప్రాయవేదిక

శ్రీమతి శాంతిగారికి నమస్కారములు. జనవరి పత్రికలో వీడియో చూసాను. నా అభిప్రాయము వ్రాస్తున్నాను.
"అనుభవజ్ఞులు డా. కల్పలత గారితో ఇంటర్వ్యూ బాగా నడిచింది. డాక్టర్లకే దిగ్భ్రాంతి కలిగించిందంటే ఈ కోవిడ్-19 వైరస్ ఎంత వింత మహమ్మారో అర్థంచేసికోవచ్చు. డా. కల్పలత గారు వైద్యరంగంతో పరిచయంలేని వారిని ఉక్కిరి బిక్కిరి చెయ్యకుండా సరళంగా కరోనాను గురించి చక్కగా అర్థమయ్యేలా చెప్పారు. ఈ వ్యాధికి ఉండే ప్రత్యేక లక్షణాలు, కనివిని ఎరుగని విధానాలతో ప్రపంచాన్ని కలవర పరుస్తూన్న పరిణామాలు వివరించారు. ముఖ్యంగా ఈ వాక్సిన్ ల గురించి సామాన్యులకున్న అపోహలు తొలగిస్తూ చక్కని సలహాలిచ్చారు. మన దేశక్షేమము దృష్టిలో పెట్టుకొని చేస్తున్నసేవలకు వారు మిక్కిలి అభినందనీయులు. ఇంత చక్కని ఇంటర్వ్యూ చేసిన డా. స్రవంతి గారికి, నిర్వహించిన శ్రీమతి శాంతిగారికి ధన్యవాదములు."

**- వేదుల సుబ్రహ్మణ్యం - బెంగళూరు**

మీకు ముందుగా హృదయ పూర్వక అభినందనలు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని,వారందరికి మేలు చేకూరే విధంగా. దేశ దేశాలను ఒణికింపచేస్తూ, చాలా చోట్ల ఇంకా పట్టి పీడిస్తున్న "మహమ్మారి కరోనా వ్యాధి కి" సంబంధించే కాకుండా,మరి ఇతరమైన ఎన్నో వాటికి కూడా. ప్రముఖ అమెరికా వైద్యుల సలహాలు,సూచనలు అందించే విధంగా,ఇటువంటి మంచి ఆలోచనకు శ్రీకారం చుట్టిన..మీకు ఆల్ ది బెస్టు తెలియచేస్తున్నాను.
మీరు, "చైతన్యం మాస పత్రిక" సంపాదకురాలు-,స్నేహ పాత్రులు అయిన శ్రీమతి తీగవరపు శాంతి గారి కుమార్తె కావడం,మాకు మరింత సంతోషదాయకము.

**- నండూరి సరోజా దేవి**

సంఘసేవిక బూబమ్మ పాత్ర ద్వారా జీవన్మరణాల రహస్యం చక్కగా చెప్పించారు ప్రభాకరశాస్త్రి గారు. అన్నం, నీళ్లు, గాలి ఇలా మనిషికి రేషన్ లా ఇచ్చి దేవుడు భూమి మీదకు పంపిస్తాడనటం చాలా గొప్పగా ఉంది. రచయితకు ధన్యవాదాలు.

**ప్రసాద్, విజయవాడ.**

తుంపిలి దెయ్యం కథ చాలా సరదాగా ఉంది. భువనచంద్ర గారు బాగా వ్రాసారు. అలాగే ఎలెక్ట్రాన్ గారి పరిహారం పబ్లిక్ సెక్టర్ లో సైట్ లలో జరిగే వ్యవహారాలకు అద్దం పెట్టినట్టుగా ఉంది. రచయితకు నమస్కారాలు.

**రాజ్యలక్ష్మి, విజయశేఖర్ - హైదరాబాద్**

డా.భమిడిపాటి మూర్తి గారితో డా.స్రవంతి గారు నిర్వహించిన ముఖాముఖి మీ పత్రికకు హైలైట్. చాలా గొప్ప సేవ చేస్తున్నారు మీరు ఇలాంటి వైద్య సంబంధమయిన ముఖాముఖీ ప్రచురించటం ద్వారా. నాకు తెలిసిన కిడ్నీ పేషేంట్లు చాలామంది మీ శీర్షిక చదివి ఎన్నో విషయాలు తెలుసుకున్నారు. వారి తరపున కూడా మీకు ధన్యవాదాలు.

**శశాంక బాబు, సావిత్రి, సుబ్రహ్మణ్యం, లక్ష్మి-హైదరాబాదు.**

పోడూరి శ్రీనివాసరావుగారు వెన్నెలకంటిపై వ్రాసిన వ్యాసం చాలా బావుంది. వెన్నెలకంటి లాంటి గొప్ప రచయితను కోల్పోవడం తెలుగు ప్రేక్షకులకు పెద్ద లోటు.

**సుబ్బా రావు, దమయంతి - గుంటూరు**

రామానందం గారు సప్తమోక్ష నగరాలు శీర్షికలో హరిద్వార్ గురించి ఎన్నో తెలియని విశేషాలు మాకు అందజేస్తున్నారు. అలాగే ఆయన యూనియన్ బడ్జెట్ గురించి చక్కని వివరం ఇచ్చారు. రచయితకు ధన్యవాదాలు.

**పురుషోత్తమరావు - కరీంనగర్**

భారతిగారు ఎప్పటిలాగానే పాఠకులను ఊహాలోకంలోకి తీసుకెళ్లారు. రచయిత్రికి ధన్యవాదాలు.

**కమల, పద్మ, రజని - నెల్లూరు.**

బుచ్చిరాజు గారి సుందరకాండ అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టుగా ఉంది. బాగా వ్రాస్తున్నారు. వేమూరి వారు గ్రీస్ పురాణగాథల గురించి మంచిగా వివరిస్తున్నారు. ఆయనకు మా థేంక్స్.

**అహల్య, సూర్యనారాయణ - తిరుపతి**

భారతంలో కర్ణుడి పాత్ర గురించి బాగా విశ్లేషించారు హరగోపాల్ గారు. ఇంద్రగంటి వారి ప్రేమంటే ఇంతే చక్కగా పాత బ్లాక్ అండ్ వైట్ సినిమా చూస్తున్నట్టుగా ఉంది. గుడ్!

**మురళీధరరావు, కృష్ణారెడ్డి - బందరు**

# వైద్యో నారాయణో హరి:

## 3 వ భాగం

'వైద్యో నారాయణో హరి:' శీర్షిక క్రింద గత నెల కోవిడ్ వ్యాధిపై డా, భమిడిపాటి మూర్తి గారితో డా. స్రవంతి నిర్వహించిన ముఖాముఖిని ప్రచురించాం. ఈ నెల 'మల్టిపుల్ మైలోమా' పై డా. శర్వారి యెల్లాప్రగడ గారితో డా.స్రవంతి జరిపిన ముఖాముఖిని ప్రచురిస్తున్నాం. పక్క నున్న వీడియో ఐకాన్ పై క్లిక్ చేసి ముఖాముఖిని చూడవచ్చును. - ఎడిటర్




'Cancer' మన కణాలను వణుకెత్తించే ఒక పదం!

మన శరీరం లో ఎన్నో వేల కోట్ల cells/కణాలు నిండి ఉంటాయి. ఈ కణాలు నిరంతరం ఎదుగుతూ విభజిస్తూ క్షీణిస్తూ ఉంటాయి. ఈ కణాలలో mutations పేరుకున్నప్పుడు ఈ cell cycle క్రమశిక్షణ తప్పి ఈ సెల్స్ తప్పు దారి పట్టి కాన్సర్ సెల్స్ గా మారుతాయి. ఇలాంటి ప్రమాదకరమైన కణాలను మన శరీరం లో ఉండే ఇమ్యూన్ సిస్టం programmed cell death అనే process ద్వారా నాశనం చెయ్యబడతాయి కానీ కాన్సర్ సెల్స్ కొన్ని కారణాలు వల్ల ఈ programmed cell డెత్ అనే processని తప్పించుకుని విచ్చలవిడగా ఎదిగి శరీరమంతా పాకుతాయి.

ఈ మధ్య Cancer చాలా పెరిగిపోయింది, ఎక్కడ చుసినా, ఎవ్వరికి విన్నా Cancer అని అందరు అనడం మనము వింటున్నాము. నిజానికి ఈ cancer వ్యాధి కొత్తది కాదు, ఎన్నో యుగాల నుంచి ఉంది కానీ ఇప్పుడు పెరిగిన awaresness వల్ల diagnostic testing వల్ల దీని incidence పెరిగింది. అలంటి ఒక Cancer Multiple Myeloma. ఇది బోన్ marrow నుండి వచ్చే Cancer. ఈ Cancer ఎన్నో శతాబ్దాల నుంచి ఉన్న దీనిని మొట్టమొదటి సారిగా 18th century లో గుర్తించారు.



ఈ సందర్భంగా మనతో మాట్లాడడానికి మనముందుకు వచ్చారు, Dr. Sarvari Yellapragada. ఆవిడ Madras Medical కాలేజీ లో మెడికల్ డిగ్రీ పూర్తిచేసుకున్న తర్వాత, న్యూ యార్క్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి Baylor కాలేజీ అఫ్ Medicine లో fellowship చేసి అక్కడ Hematology-Oncology లో Associate Professor గా పని చేస్తున్నారు. Multiple Myeloma లో పరిశోధన చేసి ఎన్నో Research Papers పబ్లిష్ చేశారు మరియు గ్రాంట్స్ అందుకున్నారు. దీనితోపాటు అనేక సార్లు Outstanding Teacher గా కూడా గుర్తింపు తెచ్చుకున్నారు

# హగ్ బాస్ హంగామా



భువనచంద్ర

"బుద్ధి లేకపోతే సరి!", అరిచాడు త్రివిక్రమరావు.

"అది లేకేగా మిమ్మల్ని పెళ్లిచేసుకున్నదీ!", కూల్ గా అన్నది మంగతాయారు.

"హూ... నీకు తెలివి ఎక్కువని అనుకుంటున్నావా?", గుడ్లురిమాడు త్రివిక్రమ్.

"అబ్బే ... ఆ వస్తువే మా ఇంటా వంటా లేదు. ఒక్కొక్కకూతురికీ పెళ్లి చేసి, అల్లుళ్ళ కాళ్లతో పాటు తెలివిని కూడా కడిగేసుకున్నాడు మా నాన్న. అందరికంటే చివరి దాన్ని కదా, అడుగూ బొడుగూ తెలితేటలేమన్నా మిగిలుంటే అది మీ కాళ్ళ కిందకి చేరివుంటాయి", ఇంకా కూల్ గా అన్నది తాయారు.

"అంటే? నా మెదడూ తెలితేటలూ నా అరికాళ్లల్లో ఉన్నాయనా?", భీకరంగా అరిచాడు త్రివిక్రమ్. మామూలుగా అతనిది లేత భైరవ స్వరం. అరిస్తే ముదురు గార్ధబాన్ని వెక్కిరిస్తున్నట్టు వుంటుంది.

"మీ వస్తువులు ఏవి ఎక్కడున్నయ్యో మీకు తెలియాలి గానీ, నాకేం తెలుస్తుందీ?" దీర్ఘం తీస్తూ వంటింట్లోకి పోబోయింది మంగతాయారు.

"నిన్నూ,,, నిన్నూ..." పళ్ళు పటపటా కొరికాడు త్రివిక్రమ్.

భళ్ళున కిటికీ గ్లాసు బద్దలయింది. అందులోంచి ఓ వైట్ పాంట్, వైట్ షర్ట్ పిల్ల ఇంట్లోకి దూకి, చేతిలో ఉన్న మైక్ ని త్రివిక్రమ్ నోటి దగ్గర పెట్టి, "పళ్ళు పటపట లాడుతున్నాయంటే అవి మహా వీక్ గా ఉన్నాయని అర్థం. ఇంతకీ మీ టూత్ పేస్ట్ లో ఆముదమూ వెన్నపూసా వున్నాయా?" అనడిగింది. షర్ట్ మీద టోల్ గేట్ బేడ్జి.

"నిన్ను తగలెయ్యా... బంగారం లాంటి అద్దాన్ని పగలగొట్టి మీ టూత్ పేస్ట్ లో ఆముదమూ వెన్నపూసా ఉన్నాయా అని అడుగుతావుటే? నిన్నూ నీ టోల్ గేట్ కంపెనీకి శ్రాద్ధం పెట్టా... అయినా రోజుకి ఎన్నిసార్లు వస్తావే ముదనష్టపుదానా" స్వరాభిషేకం మొదలెట్టింది మంగతాయారు. క్షణంలో టోల్ గేట్ పిల్ల మాయం.

త్రివిక్రమ్ విక్రమం మంగతాయారు నోరు తెరవనంతవరకే. ఆవిడ నోరు తెరచిన మరుక్షణం అతను వీధిలోకి నిష్క్రమిస్తాడు. ఈ చర్య గత పదిహేనేళ్ళగా జరుగుతున్నదే. మంగతాయారు మల్టీ టాలెంటెడ్ విమన్.

అరవకుండా 'అరిచి'నంత ఎఫెక్టూ, తిట్టకుండా తిట్టినంత ఎఫెక్టూ, చెయ్యి ఎత్తకుండా చెప్పు తెగినంత ఎఫెక్టూ, ఇవ్వడంలో మంగతాయారుని మించినవాళ్లు లేరు. ఆ విషయం పెళ్లయిన మూడోరోజుకే త్రివిక్రంకి అర్థమయింది.

వెళ్లడం వెళ్లడం సరాసరి నయాగరా శాస్త్రి ఇంటికి వెళ్ళాడు త్రివిక్రమ్. "ఆ... ఏవిటోయ్ త్రివిక్రమా... మీ ఆవిడ ఏమన్నా కోపం చేసిందా?" త్రివిక్రమ్ ని చూడంగానే భళ్ళున నవ్వి అన్నాడు శాస్త్రి.

ఏదో చిన్న మాటా మాటా అంతే. గురూగారూ ఇంతకీ యీ మధ్య మీరేదో వూళ్ళు తిరిగొచ్చారని విన్నాను", వినయంగా అన్నాడు త్రివిక్రమ్.

"అవునోయ్... విదేశీ అభిమానులంతా ప్రాణం తీసేశారనుకో.. ! వారి అభిమానానికి తడిసి ముద్దయిపోయాననుకో! ఆనందంగా శాస్త్రి అంటుండగానే కిటికీ భళ్ళున పగిలింది. కిటికీ

పక్కనే వున్న మామిడి చెట్టు కొమ్మ మీంచి తాడు పట్టుకుని ఒకతి ఇంట్లో దూకుతూనే, "హలో... వర్షంలో తడిసి ముద్దయ్యారా? వేప, ముష్టి, రక్కీస, కలబంద రసాలు జోడించిన మా 'బ్రిక్స్ 500' ఒక్కటి వేసుకోండి. క్షణాల్లో మీ శ్వాస జలుబు బంద్ అయిపోతాయి", ఓ డబ్బీ ఇస్తూ అన్నది.

"శ్వాస బంద్ చేస్తావటే దిక్కుమాలినదానా?" ఒక్క ఉదుటున వంటింట్లోంచి హాల్లోకి దూకింది శాస్త్రి గారి భార్య సీతారత్నకుమారి. బ్రిక్స్ 500 పిల్ల రకాల్న మాయమైపోయింది.

"ఏవోయ్... నీకంటే ఆ బ్రిక్స్ బూచే నయం. రోజుకి పదిసార్లైనా కిటికీలోంచి తగలడుతుంది. పెళ్లి కాకముందు గురూగారు గురూగారు అంటూ ఇంటి చుట్టూ తిరిగి కూరగాయలైనా కొనుక్కొచ్చేవాడివి. ఇప్పుడసలు నెలకోసారైనా వస్తే ఒట్టు. హూ... ఏంచేస్తాం...". అంతే స్పీడుగా లోపలికి పోయింది సీతారత్నకుమారి.

"ఈ గోల మామూలేగానీ, ఆ టి వి ఆన్ చెయ్యవోయ్", రిలాక్సుడుగా అన్నాడు శాస్త్రిగారు. టివి చూసే మూడ్ త్రివిక్రమ్ కి లేకపోయినా, గురువుగారి మాట కాదనలేక టివి ఆన్ చేశాడు.

ఏదో యాడ్, మెడికల్ యాడ్ వస్తోంది.

"డాక్టర్ సబితా... నా పేరు సుషుప్తి. ప్రస్తుతం నేను ప్రెగ్నెంటుని. బరువులు ఎత్తొచ్చా?", అడిగింది సుషుప్తి. మీడియం సైజు గోధుమ బస్తాలా వుంది ఆ పిల్ల.

"ఏ బరువులు ఎత్తుతున్నారూ?" స్టెతస్కోపుని సవరించుకుంటూ అన్నది డాక్టర్ సబిత.

"మా అత్తగారేమో ఫ్రూట్సూ బిస్కట్ పేకెట్లూ ఖచ్చితంగా తినాలంటారు గానీ, చక్కగా కోసి, తీసిపెట్టరు. నెలకి పదిరోజులు మా ఆయన డ్యూటీకి పోతారు. ఆ రోజుల్లో ఫ్రూట్సునీ బిస్కట్సునీ నేనే లిఫ్ట్ చెయ్యాల్సివస్తోంది", నయగారాలు పోతూ అన్నది సుషుప్తి. వింటూనే స్టెత్ ని చెవిలో పెట్టుకుని, ఒక్షణం ఆగాక తీసేసి, "మిస్ సుషుప్తీ, అరటిపళ్ళూ, ఆపిల్ పళ్ళూ లాంటి బరువైన ఫ్రూట్సుని లిఫ్ట్ చెయ్యొద్దు. దానిమ్మ గింజలూ, ద్రాక్ష పళ్ళు లాంటివి లిఫ్ట్ చెయ్యచ్చు. సరేనా? హేపీ డెలివరీ!", అన్నది డాక్టర్ సబిత.

"దీని బొంద, పెళ్లయినదాన్ని మిస్ అంటుందేవిటీ?" అయినా ఆ ముండా స్టెతస్కోపు చెవిలో ఎందుకు పెట్టుకున్నట్టూ?", ఎప్పుడొచ్చిందో గానీ, ఆరాతీసింది సీతారత్నకుమారి.

"వాళ్ళు డాక్టర్లూ కాదూ, అడిగినవాళ్లు పేషెంట్లూ కాదు. అదో యాడ్, అంతే!", భళ్ళున నవ్వారు శాస్త్రిగారు.

కిటికీలోంచి లోపలి దూకబోయిన బ్రిక్స్ 500 పిల్ల సీతారత్నకుమారిని చూసి రివర్స్ జంప్ చేసింది.

"గురూగారూ", ఏదో చెప్పబోయాడు త్రివిక్రమరావు.

"నో టాకింగ్. అదిగో 'హగ్ బాస్' స్టార్ట్ అయింది", గట్టిగా అరిచింది సీతారత్నం. ఓ పెద్ద బేంగ్ తరవాత యాంకరొచ్చాడు. "వెల్ కమ్ వ్యూయర్స్! దిసీజ్ హగ్ బాస్ స్పాన్సర్డ్ బై మిల్లీ చిల్లీ సాస్ అండ్ ఇనయతుల్లా అబ్దుల్లా బటర్. కమాన్ లెట్స్ గో టూ 'తూ' 'జా' టివి" అనగానే కెమెరా హగ్ బాస్ ఇంట్లోకి ఫోకస్ అయింది.

మిగతావాళ్ల సంగతేమోగానీ, త్రివిక్రమ్ కి మాత్రం హగ్ బాస్ చూడటం అదే మొదటిసారి. ఇద్దరు ముగ్గురు ఆడవాళ్లు కొప్పు నడినెత్తికి వచ్చేట్టు పెట్టుకుని అటూ ఇటూ యమా హడావిడిగా తిరిగేస్తున్నారు. మొగాళ్ళు ఐదారుగురు రకరకాల డ్రెస్సుల్లో విడివిడిగా, కలివిడిగా మళ్ళీ వి-

డివిడిగా మాట్లాడుకుంటున్నారు. ఆడా మగా అందరికీ 'జంధ్యాల్లాగా' కండక్టర్ బేగులు తగిలించివున్నాయి.

"అందరికీ బేగులున్నాయ్.... ఆ బేగుల్లో ఏముంటుందీ?", కుతూహలంగా అన్నాడు త్రివిక్రమ్.

"ఎంత చిన్నగా మాట్లాడినా పట్టేసే టేపు రికార్డర్లు ఉంటై. ఎవరు ఎవరితోటి మాట్లాడినా వెంఠనే హగ్ బాస్ కి తెలిసిపోతుందన్నమాట" చిరునవ్వుతో వివరించింది సీతారత్నకుమారి.

"మరి బాత్రూమ్ కి పొతే?" ముక్కు మూసుకుని అన్నాడు త్రివిక్రమ్.

"ఛీ.. ఛీ.. అప్పుడు మాత్రం తియ్యొచ్చు", మొహం వికారంగా పెట్టి అన్నది సీ.ర. కు.

త్రివిక్రమ్ చూస్తూ వుండగానే ఇద్దరి మధ్య యుద్ధం. "నేను చేసే ప్రతి పనిలోనూ కల్పించుకుంటున్నావ్. ఐ కాంట్ టాలరేట్", అరిచింది అందులోని ముప్ఫయ్ ఏళ్ల ముదిత. చూడ్డానికి బంగాళాదుంపలా వుంది.

"అసలు నువ్వు పనిచేసిందెపుడూ?", కాలుదువ్వాడు మరో ముదురు బెండకాయ.

"ప్లీజ్ స్టాప్... ఎవరు గట్టిగా అరిచినా నాకు ఏడుపొస్తుంది', చిన్న పిల్లలా మొహం పెట్టి అన్నది మరో లేత వంకాయలా కనిపించే వయా మీడియమ్ పొట్టి కాకరకాయ.

"ఓ... బేబీ...!", గుమ్మటంలా వుండేవాడొకడు వరండాలోంచి పరిగెత్తుకొచ్చి పొట్టి కాకరకాయను కావలించుకున్నాడు. అంతే కాదు, "నువ్వేడిస్తే నేను చూడలేన్రా!" అనీ అన్నాడు. పొట్టికాకరకాయ హాయిగా కౌగిట్లో ఒదిగిపోయి కళ్ళు మూసుకుంది.

"హగ్ బాస్.. చూడండి... నేను పనులే చెయ్యట్లేదు అంటున్నాడీ బెండకాయ. ఐ కాంట్ .. ఐ కాంట్ బేర్ ఇట్ హగ్ బాస్", భోరుమంది బంగాళాదుంప.

వెంటనే బిలబిలా అందరూ వచ్చి బంగాళాదుంపని సామూహికంగా కౌగిలించుకుని ఓదార్చేస్తున్నారు. "నువ్వు ఏడవకూడదక్కా.. అది బహుశా హగ్ బాస్ ఇచ్చిన 'టాస్క్' అయివుంటుంది", గుసగుసగా అందరికీ వినిపించేట్టు అన్నది మరో బుడంకాయ్.

"యా...!", ఓ క్షణం కౌగిలి సడలించి, మళ్ళీ పొట్టి కాకర కాయని కౌగిట్లో బిగించాడు గుమ్మటం.

మళ్ళీ ఒకవైపు నుంచి ఒకామె, "హగ్ బాస్.. మీ టాస్క్ పూర్తి చేశా" అన్నది.

"ఏమిటేమిటీ?", అందరూ ఉత్సాహంగా ఆ పిల్ల వైపు పరిగెత్తారు.

"అదే సస్పెన్స్!"పళ్ళు బయట పెట్టిందాపిల్ల.

"కూరలు తరగటానికి సరిపోతాయా పళ్ళు... వేరే చాకులూ కత్తిపీటలూ ఎందుకూ?", గొణిగాడు త్రివిక్రమ్.

"ముయ్యవోయ్... మూడుసార్లు మూడు బ్యూటీ కంటెస్టులో ఫస్టొచ్చిందీ!", కోపంగా అన్నది సీతారత్నకుమారి.

"అందర్నీ హాల్లోకి రమ్మనమని హగ్ బాస్ ఆజ్ఞాపిస్తున్నారు!", ఓ బొంగురు గొంతు వినిపించగానే బిలబిల్లాడుతూ హాల్లోకి పరిగెత్తారు అందరూ. మళ్ళీ అదే గొంతు. "మీ ఎదురుగా వున్న టేబుల్ మీద ఓ కవర్ వుంది. ఆ కవర్ ని శంపాలత చదువుతారు. ఆల్ ది బెస్ట్!", అన్నది.

బంగాళాదుంపలా ఉన్న శంపాలత గభాల్న లేచి కవర్ అందుకుని, "హౌస్ మేట్స్, మీ నడవా పక్కన రెండు బురద గుంటలు ఉంటాయి. ఒక గుంటలో మగవాళ్ళు, మరో గుంటలో లేడీస్ వుంటారు. టాస్క్ ఏమంటే, లేడీస్ తమ గుంట లోంచి బయటకి వచ్చి జంట్స్ గుంటలోకి చేరాలి. అలా గుంట మార్పిడి జరిగేటప్పుడు ఒకరినొకరు అడ్డుకోవాలి. గెలిచిన టీమ్ కి అయిదు కిలోల వడపప్పు, అయిదు లీటర్ల పానకం, మూడున్నర కేజీల కొబ్బరి అరటి

ముక్కల మిశ్రమం ఇవ్వబడతాయి. ఆల్ ది బెస్ట్. హగ్ బాస్ మీకు శుభాకాంక్షలు చెబుతున్నారు", అని చదివింది.

మహోత్సాహంగా చూస్తున్నాడు త్రివిక్రమ్. మామూలుగా అంత అట్రాక్టివ్ గా లేకపోయినా, బురదలోకి దిగింతరవాత మాత్రం శంపాలతా, పొట్టి కాకరకాయ, బుడంకాయలు అద్భుతంగా అనిపించారతనికి.

తోపులాట మొదలైంది. వాళ్ళని వీళ్లూ, వీళ్ళని వాళ్ళూ తోసేస్తూ, మహోత్సాహపరుస్తూ ఆట సాగిస్తున్నారు. "భలే వుంది కదూ" త్రివిక్రమ్ ఏదో అనబోయేలోగానే కరెంట్ కట్ అయ్యింది.

ఈ బొంద కరెంటుని తగలెయ్యాని. మాంచి ఎక్సయిటింగ్ వున్న టైంలో కరెంట్ కట్ చేశారు. అయ్యో ఈ వారం ఎలిమినేషన్ వుంది కూడానూ!", నిట్టూర్చి లేచింది సీతారత్నకుమారి.

"ఇదోయ్ ఈనాటి నాగరికతానున్నూ, సంస్కృతీనున్నూ!", నిట్టూర్చాడు శాస్త్రిగారు. లోపల్లోపల కరెంట్ కట్ అయినందుకు విచారిస్తూ.

"అంతే గురూగారూ, అసలు ఆడా మగా అన్న తేడా లేకుండాపోతోంది!", తానూ నిట్టూర్చాడు త్రివిక్రమ్. బుడంకాయ అతనికి తెగ నచ్చేసింది మరి.

"అవునూ, ఇంతకీ ఎందుకొచ్చినట్టూ?", అడిగాడు శాస్త్రి.

"బొత్తిగా తీసిపారేస్తోంది గురూగారూ. అసలు భర్త అనేవాడికి గౌరవమివ్వాలని ఇంగిత జ్ఞానం కూడా మంగతాయారుకి లేదు", బుడంకాయ వొంపు సొంపుల్ని మనసులోనే మంగతాయారుతో పోల్చుకుంటూ అన్నాడు త్రివిక్రమ్.

"హ.. హ.. అవన్నీ పట్టించుకోకూడదోయ్"ఎందుకంటే ఇవ్వాళా రేపూ ఆడా మగా పబ్లిక్ గా కావలించుకున్నా, ముద్దులు పెట్టుకున్నా అదంతా ఫ్యాషన్ కిందకే వస్తోంది గానీ, తప్పుగా జనాలు అనుకోవట్లేదుగా. అనుకుంటే యీ 'హగ్ బాసు'లూ, 'కిస్ బాసు' షోస్ ఇంత పాప్యులర్ కావుగా!"

"అదేంటి గురూగారూ... వీళ్ళందరూ ఆల్రెడీ సినిమావాళ్లు. వాళ్ళు సినిమాల్లోని వేషం లాగే యీ గేమ్ లోనూ యాక్ట్ చేస్తున్నారు. నిజంగా అయితే ఇలా హగ్ చేసుకుంటారా?" నిష్టూరంగా అన్నాడు త్రివిక్రమ్.

"అక్కడే పప్పులోనూ చారులోనూ కూడా కాలు వేశావు. ఇక్కడ యీ హౌస్ లో ఉన్న అందరూ సినిమావాళ్లు కాదు. అయినా త్రివిక్రముడూ, మనం ఆలోచించాల్సింది ఒకటి వుందోయ్. అటు నీ భార్యా ఇటు నీ భార్యా కాస్త గయ్యాళి వాళ్లే గానీ చెయ్యి చేసుకునే టైపు కాదుగా! సంతృప్తోయ్ సంతృప్తి. ఎక్కడికక్కడ సంతృప్తి పడకపోతే జీవితం నడవదు మరి!", జీవితసారం శిష్యుడికి వినిపించారు శాస్త్రిగారు.

మరో ఆరువారాల తరవాత సుదీర్ఘంగా నిట్టూర్చాడు త్రివిక్రమ్. హగ్ బాస్ సీజన్ అయిపోయింది. ఆనాడే గ్రాండ్ ఫినాలే. ఈసారి వెరైటీగా ప్రేక్షకుల ఓటింగ్స్ తో పాటు ప్రతీ కేండిడేటూ చేసిన 'ఇండివిడ్యువల్ హగ్స్' ని కూడా లెక్కలోకి తీసుకోవడంతో -

టోటల్ గా పద్దెనిమిదివేల పన్నెండు వందల పదహారు హగ్స్ తో గుమ్మటంగాడు ఫస్టొచ్చి ప్రయిజ్ తన్నుకుపోతే, పద్దెనిమిదివేల పన్నెండు వందల పద్నాలుగు హగ్స్ తో సెకండ్ గా స్థిరపడింది బుడంకాయ్.

'ఛీ.. మరో రెండు హగ్స్ ఇచ్చి ఉంటేనా!' మనసులోనే బుడంకాయని తల్చుకుని నిట్టూర్చాడు త్రివిక్రమ్.

"ఛీ... ఆఫ్ట్రాల్ త్రీ హగ్స్ ఇస్తే 'కోటి' గెల్చుకునేదిగా!" బయటినుంచి వస్తూ శాండిల్స్ ని విసిరికొట్టింది వినత - శ్రీ త్రివిక్రమ్ అండ్ శ్రీమతి మంగతాయార్ల ముద్దుల కూతురు. ఆ పిల్ల వయసు 13. నోరెళ్లబెట్టాడు శ్రీయుత త్రివిక్రమరావు.

# దశమగ్రహం కాదు

## ఎలెక్ట్రాన్



విశాఖవాసి అయిన కూర్మాపురం కుటుంబరావుకి, జ్యోతిశ్శాస్త్రం మీద, హస్తసాముద్రికం మీద, వాస్తుశాస్త్రం మీద శకునాలమీద, మీద విపరీతమైన నమ్మకం. అందుచేత ప్రతీ పెద్ద పని కొంత స్వయంగ్రహణ శాస్త్రపరిజ్ఞానంతోనూ, కొంత ఆయాశాస్త్రాలలో ప్రజ్ఞులైన వారి సలహాలతోనూ చేసేవాడు. కుటుంబరావు దంపతులకి కుచేల సంతానం. ఆరుగురు పుత్రికలు, ఆఖరుగా పుట్టిన ఏడో కుమారుడు వంశోద్ధారకుడు. వంశోద్ధారక నామధేయుడు. చెలామణిలో ఉన్న పేరు వంశీ. జ్యోతిష్యశిరోమణి రామశాస్త్రి కుటుంబరావుకి కొడుకు తప్పక పుడ్తాడని హామీ యివ్వడంతో, సంజయ్ గాంధీ నిర్దాక్షిణ్యంగా దేశవ్యాప్తంగా అమలుపరిచిన కుటుంబనియంత్రణ శస్త్రాస్త్రప్రయోగాలకి చిక్కకుండా తప్పించుకొన్నాడు.

కుచేల సంతానం అయితే అయ్యుండొచ్చుగాక, ఉత్తర దిశాధిపతి కుబేరుడి కరుణా కటాక్షాలవల్ల చేస్తూన్న బియ్యం, అపరాల టోకు వ్యాపారం లాభసాటిగానే జరిగిపోతుండడం వల్ల, ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా దర్జాగానే జీవితం కొనసాగి పోయింది. కన్నందుకు బాధ్యత నెత్తిమీద వేసుకొని, చదువులు చెప్పించి, ఆరుగురు ఆడపిల్లల వివాహాలు ఏడాదికి, లేక రెండేళ్ళకీ ఒకటి చొప్పున వైభవంగా జరిపించేశాడు. దాంతో సంపాదించిన ఆస్తులు ఒకటొకటిగా కరిగిపోయి, చేస్తున్న వ్యాపారం దినదిన గండంలా మారింది. కుటుంబరావు ఇంటికి ఈశాన్యంలో అయిమూలగా అవతల వీధిలో ఉన్నఖాళీ జాగా యజమాని పదవీ విరమణ చేసిన తర్వాత, ఆ జాగాలో రెండంతస్తుల మేడ కట్టేశాడు. ఇరుగుపొరుగులు ఆ యింటిని లంచాలగూడు అని గుసగుసలాడుకొనేవారు. ఆ ఈశాన్యం మూలాయన అలా మేడ కట్టడం వల్ల కుటుంబరావింటికి ఈశాన్యంలో బరువు పెరిగి పోయిందని దానివల్ల వ్యాపారం పడిపోయిందని, అందువల్ల కుటుంబరావు ఇంట్లో కొన్ని దోషాలు తలెత్తాయని కొన్ని పరిహార మార్గాలు చూపించాడు వాస్తుశాస్త్రజ్ఞుడు. కుటుంబరావు ఆ మార్పులు చేశాడు. ఏదో ఊగిసలాడుతూన్న వ్యాపారం కొద్దిగా పుంజుకోవడంతో కుటుంబరావు మనోస్థైర్యం పెరిగింది.

'ఇదేం వెర్రితనమయ్యా నీకు! చుట్టుపక్కల ఇళ్లు నీ యింటి మీద ఎలా వాస్తు ప్రభావం చూపిస్తాయయ్యా!' అని కొందరు హేళన చేస్తే, 'పక్కిళ్ల వాళ్లు, వెనకిళ్లవాళ్లు బ్రహ్మాచారులకు కొంపలు అద్దెలకిస్తే, మనింటి అమ్మాయిలకి డాబాలెక్కి హాయిగా గాలి పిల్చుకొనే అవకాశముండదు. ఇదీ అలాగే!' అని సమాధానమిచ్చాడు.

కొడుకు వంశీ విశ్వవిద్యాలయపు స్నాతకోత్తర పట్టా తీసుకొని మంచి ఉద్యోగంలోనే చేరాడు. వెంటనే కుటుంబరావు భార్య 'ఆరుగురు అల్లుళ్ళకి అత్తగా ఉండడం వేరు, కోడలుకు అత్తగా మారడం వేరు'



అనుకొంది. ఆ కోరిక బలీయంగా నాటుకు పోవడంతో, తన అత్తగారికి 'మనవడి పెళ్లి చేయించేయమని మీ అబ్బాయితో చెప్పండి,' అని కిర్రెక్కించి వదిలింది. కోడలు మాటవిని ముసలావిడ తన మరణానికీ, మనవడి పెళ్ళికీ లంకె పెట్టేసి కొడుకుని సతాయించేసింది. 'అలాగే నమ్మా, సంబంధాలు చూస్తూనే ఉన్నాను. ముని మనవడు పుట్టేదాకా మరణం సంగతి ఎత్తకు,' అని తల్లిని సముదాయించాడు.

"అసలైన అత్తవైపోదామని ఆశే కానీ, ఈ కాలపు కోడళ్ళు నీలాంటివారు కాదు. కుడి కాలుతో గడప దాటుతూ బియ్యం నింపిన చెంబుని తన్నేసి, ఇంట్లో ప్రవేశించి అత్తల తలలమీద శఠగోపాలు పెట్టేస్తున్నారు. అలాగని అందరిలాంటి అత్తా మా అమ్మ కాదు, అందరిలాంటి కోడలూ నువ్వు కాదు. నేనూ సంబంధాలు చూస్తున్నాను. అయినా ఘటన అనేది ఉండాలి కదా? మన రామశాస్త్రి తండ్రి కామశాస్త్రి భార్యమీద అలిగి, ఇల్లువదిలి కాశీలో పదేళ్లుండి, అక్కడ అపారమైన శాస్త్రం నేర్చుకొని, రేపో మాపో వస్తున్నాడు. ఆయన రాగానే కుర్రవాడి జాతకం చూపిస్తాను. కంగారు పడకు," అని భార్యకి చెప్పాడు.

భర్త తనకి కితాబే ఇస్తున్నాడో, వ్యంగ్యబాణమే విసురుతున్నాడో ఆమెకు అర్థం కాలేదు.

నాయనమ్మ "ఒరేయ్, తారకం! నీ అమ్మా నాన్నలు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. నువ్వూ ఓ ఇంటి అల్లుడివైపోతే ఈ యింటి హోదా పెరుగుతుంది. ఇప్పుడప్పుడే కాదని వెర్రిమొర్రి మాటలు మాటలాడక వెంటనే ఒప్పేసుకో!" అని నేపథ్యంలో మనవడికి చెప్పింది.

"అలాగే నాయనమ్మా! నువ్వూరికే కంగారు పడబోకు. పెద్దక్కా, రెండో అక్కా, బావగార్లూ వాళ్లమ్మాయిల్ని నాకు ఇవ్వడానికి అమ్మ మీద ఒత్తిడి తీసుకువస్తున్నారు. అది నా కిష్టం లేదు. ఈ విషయంలో అటువంటి ప్రతిపాదనలు అక్కలనుంచి వస్తే మట్టుకు, నువ్వు నీ అత్తగారి అధికారం చూపించి, ససేమిరా కూడదు అని అమ్మని కట్టడిలో ఉంచు. నాయనమ్మ చనువుతో అక్కల వీపులు నిమురుతూ నచ్చచెప్పు. ఈ మాత్రం చెయ్యి చాలు, మిగతా పెళ్లి సంగతీ, మునిమనవడి సంగతీ నాకు వదిలేయ్!" అన్నాడు తారక రామారావు.

రామశాస్త్రి తండ్రి కామశాస్త్రి ఆ శనివారం వచ్చాడు. తెలిసున్న ఊరిపెద్దలు పోయి ఆయన దర్శనం ఫలపుష్పాదులతో చేసుకొన్నారు. కాశీశాస్త్రి గారని కొత్తపేరు పెట్టేశారు. భార్యమీద అలిగి ఇల్లు వదలి వెళ్ళడం తప్పైనా, వేదమాత ఇష్టానుసారమే అలా జరిగి ఉంటుందని నలుగురి ముందూ ఓ సమర్థన చేసుకొని, అన్యాపదేశంగా కాశీశాస్త్రి క్షమాపణలు చెప్పుకొన్నాడు.

కాశీశాస్త్రి కాస్త తెరిపిన బడ్డ తర్వాత కుటుంబరావు తీరుబడిగా వెళ్ళి దర్శనం చేసుకొన్నాడు. కుర్రవాడి వివాహయోగం గురించి అడిగాడు. రామశాస్త్రి తన ఖాతాదారుల చిట్టాలో ఉన్న వంశీ జాతకం తీసి తండ్రికిచ్చాడు. ఆయన జాతకం చూసి, కళ్లుమూసుకొని అయిదు నిముషాలు ధ్యాన నిమగ్నుడై, ఆతర్వాత కుటుంబరావుతో అన్నాడు.

"నీ కుమారుడికి వివాహ యోగం దగ్గరలోనే ఉంది. అయితే నీలాగే నీ కుమారుడికి ఆరుగురు ఆడపిల్లలు పుట్టిన తర్వాతనే, మీ యింట, రాబోయే తరం వంశోద్ధారకుడు జన్మిస్తాడు!"

"యిదేమిటి స్వామీ? నాలాగే వాడికీ మాటిమాటికి అలిగి చంపే అల్లుళ్లను సముదాయించే పరిస్థితా? ఇది దారుణం స్వామీ.!" అన్నాడు కుటుంబరావు.

"నీ ముత్తాతకి ఆరుగురు కొడుకులు. వియ్యాలవారిని పీడించి ఎన్నో కట్నకానుకలు సంపాదించాడు. ఆ కర్మఫలం పెద్ద ముని మనవడైన నిన్ను వెంటాడుతోంది. నీ తరం నుంచీ మొదలై నాలుగు తరాల వరకూ ముందుగా ఆడపిల్లలు పుట్టి, ఆ తర్వాతనే మొగపిల్లవాడు కలుగుతాడు. అయినా నీ కుమారుడికి శుభసూచికమే ఉంది. కంగారు పడకు," అని హామీ యిచ్చి పంపాడు. తన తండ్రి ఊరి మంచికోసం మహారుద్రయాగం తలపెట్టాడని రామశాస్త్రి చెప్పడంతో, కుటుంబరావు వెయ్యిరూపాయలు భక్తితో సమర్పించాడు.

ఆ మర్నాటినుంచే వంశీకి సంబంధాలు రావడం మొదలెట్టాయి. కుటుంబరావు లోని వ్యాపారవేత్త తలెత్తాడు. తన ముత్తాత చేసిన దారుణాలకి తానూ, తన కొదుకూ, మనవడూ, వాడికి పుట్టబోయే ముని మనవడూ ఎందుకు భరించాలి?

మొదటగా మందు మాధవరావు అనే ఆయన తన రెండో కూతురూ, నాలుగో సంతానమూ అయిన సుమల్లిక ఫోటో జేబులో పెట్టుకొని,

ఆయన కుటుంబ పురోహితుడిని వెంటబెట్టుకొని వచ్చాడు. కుటుంబరావుకి పిల్ల ఫోటోలో బాగానే ఉందనిపించింది. "స్వయంగా చూసుకోడానికి రండి. కుర్రాడూ, కుర్రదీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవచ్చు! ఈ కాలపు పద్ధతే కదా?" అన్నాడు మాధవ రావు.

"అవుననుకోండి. చూసిన తర్వాత మా కోరికలు వినిపించడం సవ్యం కాదు మరి," అన్నాడు కుటుంబరావు.

"అది మంచిదే. ఆడపిల్ల మనసు నొప్పించడం భావ్యం కాదు కదా? చెప్పండి. చెబ్తేనే కదా తెలిసేది," అన్నాడు మాధవరావు.

"మాకు కట్నం అఖ్ఖర్లేదు. పెళ్లి అతిసామాన్యంగా మీ యింట్లో చేసినా పర్వాలేదు. పూర్వకాలపు వివాహాలన్నీ అలాగే జరిగేవి కదా?"

"అవును నిజమే! ఇరుగు పొరుగు వారి ఇళ్ల అరుగులు విడిదులయ్యేవి."

"మీరూ ఈ ఊరిలోనే మహారాణీ పేటలో ఉంటారు కాబట్టి ఆ అవసరం మీకు ఉండదు. నా చుట్టాలందరూ చాలామంది ఈ ఊళ్లోనే ఉన్నారు. మావైపు వారి వసతి విడిదిల గురించి మీరు ప్రయాస పడనవసరం లేదు."

"మీరు చాలా ఉదార స్వభావంతో, ఆశయపూర్వకంగా మాట్లాడుతున్నారు. నేను మా పెద్ద పిల్లకు పెళ్ళి చేసినట్టుగానే ఈ వివాహమూ చేయగలను," అన్నాడు మాధవరావు ఒద్దికగా.

"సరే అసలు విషయమేమిటంటే నాకు ఆరుగురు కూతుళ్ళు. నా ఆశయాలు వారికీ, నా శ్రీమతికీ పూర్తిగా నచ్చవు. అందుకని వాళ్ళ లాంఛనాలు మీ స్థాయిని బట్టి ఇచ్చేయండి. ఇక అసలు సంగతేమిటంటే-దంపతులకు పుట్టబోయే సంతానంలోని ఆడపిల్లలందరికీ అంటే మీ దౌహిత్రిల అందరి వివాహాలూ మీరు చేయించాలి. ఈ విషయమై అయిదుగురు సాక్షులముందు ఒప్పందం చేసుకోవాలి. అనకూడదుకానీ, మీ కేమైనా అయిందనుకోండి, ఆ బాధ్యత మీ పుత్రరత్నాలు నెరవేర్చాలి!"

"ఏమండీ ఇలా వచ్చి కాఫీలు తీసుకు వెళ్ళండి," అన్న భార్య మాటలు వినబడి, కుటుంబ రావు లోపలికి వెళ్ళాడు. పళ్ళెంలో మూడు కప్పుల కాఫీ తీసుకువచ్చేసరికి, మాధవరావు కూడావచ్చిన మనిషితో సహా మాయమైపోయాడు.

ఇలా మొత్తం తొమ్మిది సంబంధాలు గుమ్మం తొక్కి వెనక్కి వెళ్లిపోయాయాయి. సరే కళ్యాణ ఘడియ వచ్చేసింది. కోనసీమలోని నలభై ఎకరాల కొబ్బరి తోటల యజమాని కోదండరాం వచ్చి, తన కూతురు ఫోటో చూపించి మంతనాలకు దిగాడు. కుటుంబరావు చెప్పిన షరతులు విని గట్టిగా నవ్వేశాడు. "దీనికింత మొహమాటపడ్తూ చెప్పాలా ఏమిటి సార్?నాకు ఇద్దరు కొడుకులు. తర్వాత ఈ అమ్మాయి. అయితే ఇక్కడొక ముఖ్య విషయం మీతో చెప్పాలి. మీ కుర్రాడు విద్యాధికుడు. నా కూతురు ఏడో తరగతితో చదువు అపుచేసి, ఇంటి పనులు, వంట పనుల్లో ఆరితేరింది. మీరు సరేనంటే సరి, లేకపోతే ఇంతటితో మన మాటలు సరి! ఏమంటారు?"

"సంసారపక్షంగా ఉన్న పిల్లంటే మాకు సమ్మతమే. అభిమతం కూడాను. చదువు ముఖ్యం కాదు1"

"అయితే ఇకనేం? ఆడా,మగా భేదం లేకుండా పుట్టిన పిల్లలందరి వేడుకలు-పురిటి ఖర్చులనుంచి వివాహాల వరకూ నేను బతికున్నంత కాలం నావే. ఆ తర్వాత నా అబ్బాయిలవే. వారికి చెల్లెలు మదాలస అంటే చాలా అభిమానం. ఏవీ, అగ్రిమెంట్ కాయితాలు ఇలా ఇవ్వండి. నా కుర్రాళ్ల చేతకూడా సంతకాలు పెట్టించి యిస్తాను," అన్నాడు.

"సరేలెండి కాని, పిల్లవాడూ, పిల్లా ఒకరినొకరు చూసుకోవాలి కదా? ఆ సంప్రదాయం పాటించాలి. మంచిరోజు చూసుకొని వస్తాం," అన్నాడు కుటుంబరావు.

అటుపైన కుటుంబరావు కోనసీమలో ఉన్న తన బంధువుల ద్వారా ఆరాలు తీశాడు. కోదండరాం చెప్పింది నిజమే. నలభై ఎకరాల కొబ్బరితోటల యజమానే. ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల. మగపిల్లలిద్దరూ స్కూలు ఫైనల్ తో చదువాపి కొబ్బరితోటల సేద్యం చేస్తున్నారు. ఆ నిర్ధారణ కాగానే, అనుకొన్నట్టుగానే కుటుంబరావు భార్యా,సుపుత్రులతో పెళ్లి చూపులకోసం వెళ్ళాడు. కోదండరాం కూతురి పేరు మదాలస. మంచి రూపసి. వంశీ మదాలసతో ఓ అయిదునిముషాలు మాత్రమే బయటి కొబ్బరితోటలో మాట్లాడాడు. వివశుడై తల్లిదండ్రుల్ని పక్కకు తీసుకుపోయి పిల్ల నచ్చిందని చెప్పాడు. చూపుల తతంగం పూర్తయింది. కోదండరాం అగ్రిమెంట్

మీద అయిదుగురి సమక్షంలో తానూ, కుర్రాళ్ళు సంతకం చేసి కుటుంబరావుకి ఇచ్చారు. కుటుంబరావు కొంచెం చిన్నబోయినా, అనుకొన్న మాటే కదా అని సరిపెట్టేసుకొని తీసుకొన్నాడు.

యింటికి తిరిగి వచ్చిన వంశీ ప్రతిరాత్రీ మదాలస ఫోటో ఓ అతిమెత్తటి తలగడ మీద పెట్టుకొని, దాన్ని కౌగలించుకొని పడుకొని, పెళ్లి ఎప్పుడా అని ఎదురు చూడసాగాడు.

కోనసీమ గోదావరి తీరాన కొబ్బరితోటలలో పెళ్లి వైభవంగా జరిగింది. మదాలస అత్తింట్లో అడుగు పెట్టి, అత్తమామాల పట్ల, భర్త నాయనమ్మ పట్ల ఎంతో ఒద్దికగా ప్రవర్తించింది. ఉదయమే లేచి స్నానం చేసి, ఓ అరగంట దేవుడి మందిరం ముందు కూర్చుని పూజ చేసి, హారతి ఇచ్చేది. అందరికీ కాఫీ కలిపి యిచ్చేది. వరసకి తనకి అమ్మమ్మ గారైన వంశీ నాయనమ్మకి ప్రతిరోజూ అరికాళ్లలో కొబ్బరినూనె రాసి మర్దనా చేసేది. కుటుంబరావు భార్యకు కూడా మనసు కలిగినా, అయినింటి ఆడపడుచు చేత కాళ్ళు పట్టించుకోవడం మంచిది కాదనిపించింది. తనకూ వయసు మీద పడ్తే అప్పుడు చూసుకోవచ్చు. ఎప్పుడైనా కాస్త తలనొప్పిగా ఉందంటే, మదాలస అమృతాంజనం తీసుకొచ్చి, నుదుటికి రాస్తూ కబుర్లు చెప్పేది. అత్తగారు ఇంటి బాధ్యత తనదే అనుకోవడం వల్ల, మదాలస ఇంటి పెత్తనంలో ఏ విధంగానూ చెయ్యి కలగచేసుకోలేదు. పల్లెటూరి పిల్ల అయినా మదాలస వంశీకి పడగ్గదిలో రంభే అయ్యేది. మదాలస ఉదయమే లేవడం వల్ల వంశీకి కొంత బాధగా



ఉన్నా, ఇంట్లో అందరికీ ఒక క్రమశిక్షణ ఏర్పడిపోయింది.

సరిగా ఏడాది మీద ఆర్నెల్లకి మదాలసకి పండంటి ఆడపిల్ల కలిగింది. అ తర్వాతా ఒకటి, రెండు, మూడు, నాలుగు , అయిదు... పదిహేను సంవత్సరాలైనా మదాలస గర్భం దాల్చ లేదు. మనవడు కలగనందుకు, ఆఖరికి మరో కూతురు కూడా కలగనందుకు కుటుంబరావు కుదేలైపోయాడు. అయితే మదాలస ఇంట అడుగు బెట్టిన దగ్గర్నుంచీ వ్యాపారం ఉధృతంగా పెరిగింది. మహాలక్ష్మి ఇంట్లో అడుగు పెట్టిందని అందరూ సంతోషించారు.

కాశీశాస్త్రి చెప్పిన భవిష్యత్ జరగలేదు. అసలు జరిగిందేమిటంటే ...


ఏడో నెల అత్తింట సీమంతం జరిగిన తర్వాత మదాలస పుట్టింటికి పురిటికోసం వెళ్లింది. అప్పుడు వంశీ మామ కోదండరాంతో అన్నాడు. “మావయ్యగారూ! మా నాన్నకి మీరు అగ్రిమెంట్ పత్రం రాసిచ్చినప్పుడు నేను చాలా సిగ్గుతో కుంచించుకుపోయాను. కాదంటే ఎక్కడ మదాలసను పోగొట్టుకుంటానేమోనని మౌనంగా ఉండిపోయాను. అసలు, సంబంధాలు వస్తున్న మొదట్లోనే నాన్న తీరుని ఎదిరిస్తే, నా వివాహం జరగదేమోనని భయపడ్డ మాట కూడా వాస్తవం. నేను డాక్టరమ్మకి మా నాన్న మనస్తత్వం చెప్పుకొని, ఆవిడకి నచ్చచెప్పి లింగ నిర్ధారణకోసం స్కానింగ్ చేయించాను. కడుపులో ఉన్నది ఆడపిల్ల. కాశీశాస్త్రిగారి జోస్యం నిజమేనని అనిపిస్తోంది. అందుకని పురిటి సమయంలో మదాలసకి ట్యూబెక్టమీ చేయించేస్తే బావుంటుంది. ఆ పద్ధతి చాలా సులువు కూడాను.”

“వంశీ! కాగల కార్యం గంధర్వులే తీర్చినట్లయిపోయింది. నీ విద్యాధికతనూ, మదాలసకి తీసిపోని అందమూ, నీ ఉద్యోగమూ చూసి, ముఖ్యంగా నీ నడవడిక గురించి కొంత సమాచారం సేకరించి నువ్వు చాలా బుద్ధిమంతుడవని

(24 వ పేజీ చూడండి)

తె లు -

# వేదులాన్వయు పలుకు -3



వేదుల సుబ్రహ్మణ్యం

బడుగు విద్యార్థు లొక్కింత బిడియ పడుచు
చదువు సాగించు టెట్లని సంశయింప
చేతి కందిన సాయము జేయుటొప్పు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 31

బడిని చేరిన పిల్లల నొడిని జేర్చి
పిట్ట కథలను చెప్పెడు పెద్దవారు
'లాపుటాపు'లు 'టాబ్లెట్ల' రూపులయిరి
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 32

యుక్త వయసున ప్రేమించి యుచిత మెంచి
పెద్ద లాశీస్సులను పొంది ప్రీతి వడసి
పెండ్లి యాడిన శోభల పెంపు గలుగు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 33

భావి తరములవారికి బంధములగు
చర్యలను నేడు చర్చించు సమయమందు
విజ్ఞులను సంప్రదించుట విహిత మగును
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 34

భద్రతా సంస్థలను దుయ్యబట్టు కంటె
ప్రజలు చైతన్యవంతులై వరలునట్లు
సంఘశక్తుల సమకూర్చి సాయమిమ్ము
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు35

శిష్య బృందము వందన సేయు నపుడు
తనను మించిన శిష్యులు దరిని నుండ
గురువు పొందడె మిన్నంత గౌరవంబు?
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 36

చెప్పినది చెప్పినట్టుల చేయు నొకడు
చెప్పినది గాక వేరొండు చేయు నొకడు
చెప్పనిది చేసి ముప్పున చేర్చు నొకడు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 37

లంచగొండుల రీతుల నెంచి చూడు
చెప్పినది చేసి మెప్పింప జేయునొకడు
చెప్పి త్రిప్పించి సుంతైన జేయడొకడు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 38

సిగ్గు విడనాడి లంచాల మొగ్గు వడసి
ఇయ్యకుండిన ప్రజలను దుయ్యబట్టు
వంచకుల బట్టి దండింప వలయు నెపుడు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 39

సొంత పనులకు వెన్నంటి వంత పలికి
వేరె వేళల మోమును వెనుక ద్రిప్పు
తెలివిమంతుల జిత్తులు తెలిసికొనుము
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 40

# పూరి జగన్నాధ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాధ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్త్యాన్ని యధామూలంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

రధయాత్ర జరిగే సమయంలో రధం పడిపోతే గ్రామాలలోని వారికి నాశనంకలుగుతుంది. బలిఇవ్వాలి, శాంతి హోమం చేయాలి. అన్నదానం చేయాలి. రధానికి ఈశాన్యభాగంలోఅగ్నినిఏర్పాటుచేయాలి.హోమంచేయాలి. రధంలో ఉన్న లోపాలు చూసి, ఆప్రదేశంలోహోమం చేయాలి. బ్రాహ్మణులతో శాంతి చేయించాలి. ఈవిధంగా చేస్తే విశేషమయిన శుభాలు కలుగుతాయ. బ్రాహ్మణులకు శుభము కలుగుగాక. రాజుకి శుభము కలుగు గాక. ఆవులకు, ప్రజలకు,శుభముకలుగుగాక. పశు పక్ష్యాదులకు శుభము కలుగుగాక,మానవులకు, దేవతలకు శాంతి లభించు గాక. దేవా!నీవేఈలోకాలను సృష్టించినవాడవు, రక్షించువాడవు."అనిజగన్నాధుని ప్రార్ధించాలి.దుష్టగ్రహాలనుశాంతింపచేయాలి.అనినారదుడు ఇంద్రద్యుమ్నునికి చెప్పాడు. (30- 74)

స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండంలోని, పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యంలోని జైమిని -ఋషి సంవాదం అను ఇరవై ఐదవ అధ్యాయం సమాప్తం

## 26 వ అధ్యాయం

## జైమిని ఋషి సంవాదం

## ( గాలవుని వృత్తాంతము)

విశ్వకర్మ అక్కడ ఒక కొలను నిర్మించాడు. హోమానికి కావలసిన వస్తువులన్ని ఏర్పాటు చేసాడు. ప్రతిష్ఠకు



కావలసిన వస్తువులు ఏర్పాటు చేసాడు.

ఆ సమయంలో గాలవుడు అను రాజు రాజ్యాన్ని పాలిస్తున్నాడు. ఇంద్రద్యుమ్నుడు చేస్తున్న ప్రతిష్ఠగూర్చి, చారులు రాజుకు చెప్పారు. గాలవుడు కోపంతో సైన్యాన్ని తీసుకొని ఇంద్రద్యుమ్నునిపైకి యుద్ధానికి బయలు దేరాడు. నీలాచల పర్వతంపైకి చేరుకొని అక్కడ జరుగుచున్న ప్రతిష్ఠ చూసి ఆశ్చర్య పోయాడు.బ్రహ్మలోకంనుండి వచ్చినఇంద్రద్యుమ్నుడు ఈ ప్రతిష్ఠ చేస్తున్నాడని తెలుసుకొన్నాడు. దేవతలు, నారదుడు,పద్మనిధిఇక్కడకువచ్చారనితెలుసుకున్నాడు. బ్రహ్మ ప్రతిష్టచేయడానికిసత్యలోకంనుండివస్తున్నా డని తెలుసు కున్నాడు. ఇంద్రద్యుమ్నుని సమీపించి " రాజా! నేను అజ్ఞానిని. ఇక్కడే ఉన్నస్వామిని గుర్తించ లేకపోయాను. ప్రతి సంవత్సరం స్వామికి ఉత్సవాలు నేను చేస్తాను. అనుమతించమని గాలవుడు వేడుకున్నాడు. "రాజా! నీవు సార్వభౌముడివి. మానవులు, మరుత్తులు రాజు అధీనంలో ఉంటారు. అష్ట దిక్పాలకుల అంశతో బ్రహ్మ రాజును సృష్టిస్తాడు. నీవు విష్ణుభక్తు డవు.విష్ణువుయొక్కఅర్చామూర్తులనునీవుప్రతిష్ఠించి, ముక్తినిపొందు. విష్ణులోకానికిచేరుకుంటావు. ఈ విగ్రహాలను బ్రహ్మ ప్రతిష్ఠిస్తాడు. వాటిని నీకు అప్పచెబుతాను. ఆ విగ్రహాలను నీవు శ్రద్ధగా అర్చించు. బ్రహ్మ చెప్పినట్లు యధావిధిగా పూజించాలి." అని ఇంద్రద్యుమ్నుడుగాలవునికిచెప్పాడుగాలవుడుఆనందంతోఅంగీకరించాడు.ఆకాశంలోదేవదుంధుభులు మ్రోగాయి.పుష్పవృష్టి కురుస్తోంది.ఏనుగుల ఘీంకారం వినిపిస్తోంది.ఆకాశంలోకాంతిపుంజంకనబడింది. ఆ కాంతివలన అందరి కళ్లు మూసుకుపోయాయి. ఆకాంతి నెమ్మదిగా భూమిపై వాలింది. విమానం ముందు భాగం కనబడింది. వంద హంసలు విమానాన్ని లాగుతున్నాయి. దిక్పాలకులు, ముఖ దేవతలు ముందు నడుస్తున్నారు. కొందరుగంగ యమున నదుల నీరు పట్టుకొని వస్తున్నారు. సూర్య, చంద్రులు గొడుగులు పట్టుకొన్నారు. గౌతముడు మొదలయిన మహర్షులు స్తోత్రాలు చదువుతున్నారు. వారి మధ్య బ్రహ్మఉన్నాడు.ఇంద్రద్యుమ్నుడుబ్రహ్మను స్తుతిస్తున్నాడు.దేవతలుజయజయధ్వానాలుచేస్తున్నారు.అప్సరసలునాట్యంచేస్తూండగాఆహాఊహూలుగానం చేస్తున్నారు. ( 1-52)

సిద్ధులు, కిన్నరులు వీణా నాదం చేస్తున్నాన్నారు. తాపసులు బ్రహ్మకునమస్కరిస్తున్నారు. సావిత్రి,శారదవిచిత్రమైన ప్రబంధాలు చదువుతున్నారు. కొందరు దేవతలుబెత్తాలుపట్టుకొనిబ్రహ్మకు దారిచూపిస్తున్నారు. బ్రహ్మ మండపానికి చేరుకోగానే దేవతలు లేచి నిలబడ్డారు. ఇంద్రద్యుమ్నుడు నమస్కరించి , లోపలికి ఆహ్వానించాడు. గాలవుడు,నారదుడు సాష్టాంగ నమస్కారం చేసారు. లేచి, నిలబడి తాముధన్యులయినట్లు భావించారు. ఇంద్రద్యుమ్నుడుచేతులుజోడించి,ఆనంద సాగరంలో

మునిగిపోయాడు.(53-62)

స్కాందపురాణంలోని వైష్ణవ ఖండంలోని,పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యంలోని జైమిని- ఋషి సంవాదముఅను ఇరవై ఆరవ అధ్యాయం సమాప్తం.

27 వ అధ్యాయం

జైమిని ఋషి సంవాదము.

( బ్రహ్మ విగ్రహ ప్రతిష్ట చేయుట)

బ్రహ్మ విమానంనుండి క్రిందకు దిగాడు. విశ్వకర్మ నిర్మించిన రత్నమయమైన బంగారు మెట్లపై నడుస్తున్నాడు. గంధర్వులు మార్గంచూపిస్తున్నారు. నారదుడు, దుర్వాసుడు చేయి అందివ్వగా మెట్లపైనుండి క్రిందకు దిగాడు. నమస్కరించి,స్తుతిస్తున్నవారినందరిని బ్రహ్మ చూపులతోఅనుగ్రహించాడు. పాదాలకునమస్కరిస్తున్న ఇంద్రద్యుమ్నుని ఆశీర్వదించాడు."రాజా! నీవు అదృష్ట వంతుడవు. అన్నిలోకాలు ఈనాడునీవశంఅయ్యాయి" అనిబ్రహ్మచిరునవ్వులుచిందిస్తూఅన్నాడు.జగన్నాధుని రథందగ్గరకు వెళ్లి, మూడుసార్లు ప్రదక్షణచేసి, నమస్కరించి, ఈవిధంగా స్తుతించాడు.

బ్రహ్మ జగన్నాధుని స్తుతించుట-------

" దేవా! నమస్కారం. నీవు నేను ఒకటే. ఈ చరాచర జగత్తు అంతా నీవే. మహత్తు మొదలయినవి నీ మాయవలననే కలుగుతున్నాయి. ఈ కనిపిస్తున్నదంతా ఆభాస అనే జ్ఞానం నీ వలన కలుగుతుంది. అద్వి తీయుడుగా లోకాలకి కనిపిస్తున్నావు. సహజానందానికి రూపం నీవే. జీవులన్ని నీవల్లే జీవిస్తున్నాయి. నిష్ప్రపంచ, నిర్వికార,నిరాశ్రయ, స్థూల, సూక్ష్మ, అణు, మహిమ రూపాలన్ని నీవే.గుణాతీతా, గుణాధారా, త్రిగుణాలు కలిగినవాడా నీకు నమస్కారం, నీ మాయా ప్రభావం వలన నేను సృష్టిని చేస్తున్నాను. అయినా నాకు ఆనందం లేదు. నీ నాభి కమలం నుండి నేను జన్మించాను. నీ ప్రతిరోమంనుండి అనేక వేల బ్రహ్మలు సృష్టించబడ్డారు. వారెవరు నీ తత్వాన్ని తెలుసుకోలేకపోయారు. నీ మహిమను ఊహించుటకు కూడా వీలులేదు. దివ్యాదివ్యరూపం కలవాడా! మృత్యువు లేనివాడా! మృత్యురూపా! అగ్నిరూపా! మృత్యువునకు మృత్యువైన వాడా! భక్తికి ఇష్టుడైనవాడా! తల్లి తండ్రి నీవే. దుఃఖాలను పోగొట్టువాడా! విశ్రమించనివాడాదయారూపుడా! పరాపరరూపా, పరహేతువయినవాడా! అపారసారభూతా! బ్రహ్మరూపా! పరహేతువు ఐనవాడా నీకు నమస్కారము. ఈ సృష్టి భారాన్ని తగ్గించమని నిన్ను ప్రార్ధించాను. నీవు ఈ భారాన్ని తగ్గించకపోతే నేను ఏమి చేయగలను?అజ్ఞానంనుండి బయటపడు మార్గం నేను తెలుసు కొనలేక పోతున్నాను. నీవే నన్ను రక్షించగలవు. జగదేకవంద్యా! సురాసురలచే మ్రొక్కు పాదాలు కలవాడా! తాపాలను హరించు చంద్రుడా! ఆనందాన్ని ఇచ్చువాడా! కల్పవృక్షము వంటి వాడా! దీనరక్షకా! ఆశ్రయరక్షా! అని బ్రహ్మ జగన్నాధుని స్తుతించాడు. 1-39

బ్రహ్మ బలరాముని రథం దగ్గరకు వెళ్లాడు.భక్తితో నమస్కరించి ఈ విధంగా స్తుతించాడు.

బ్రహ్మ బలరాముని స్తుతించుట------

"బలరామా! ఆకాశము నీ శిరస్సు. నీరు నీ శరీరము. పాదములు భూమి. అగ్ని నోరు.నీ ఉచ్ఛ్వాశ నిశ్వాసలు, వాయువు, మనస్సు చంద్రుడు. కన్నులు సూర్యుడు. చేతులు ఆకాశము. జ్ఞానమునకు అద్దమువంటి వాడవు అగు నీకు నమస్కారము. పదునాల్గు లోకాలకి నీవే మూలస్తంభం.

(ఇంకా వుంది)

# సప్త మోక్ష నగరాలు



కొత్త రామానందం

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మైనది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పరమావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయతమైన వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపుఋషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్థ  కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్థ  కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్రమాదరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైనప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహక క్తి రించాలని ఆశించడం సహజం. భగవంతుని అనుగ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం. భగవంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తా డు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుండి విముక్తి చేయడానికి ఎన్నెన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు.  వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూతనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్ష దాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప మోక్ష నగరాలు మోక్ష ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తు న్నాయి. అందువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్ధమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటినీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తోంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్య క్షేత్రాలు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

**అవి అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జయిని) మరియు ద్వారక.**

# మాయ (నేటి హరిద్వార్)



## 4. పావన ధామ్

హరి కి పైడి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ మందిరంలో అమర్చబడిన దేవీ దేవతల విగ్ర-హాలు వరుసగా దర్శించి ఆనం-దపరవశులవుతారు.

## 5. గీతా భవనం

ఇచ్చటి గీతాచార్యుడు - శ్రీ కృష్ణుని మహోన్నత శిల్పారాజాన్ని సందర్శకులు అందరూ చూసి తన్మయులవుతారు. గీతా ప్రబో-ధాలను మందిర గోడలపై చక్కగా చిత్రీకరించారు. ఇది తప్పక చూ-డదగిన యాత్రాస్థలం.

ఈ పుణ్యస్థలిలో ఇంకా అనేక దర్శనీయ స్థలాలయిన దక్ష ప్ర-జాపతి ఆలయం, సప్త సరోవర్ లోని మహేశ్వర మందిరం వంటి ఆలయాలు, పపట్టణ పొలిమేర-ల్లో ఉన్న మానవ కళ్యాణ ఆశ్రమం, అవధూత ఆశ్రమం, కాంతికుంజ్ ఆశ్రమం,, శ్రీరామ్ జీ ఆశ్రమం, రఘునాథ్ ఆశ్రమం, ఆనంద-మయ ఆశ్రమం, దూధ్ ధారీ ఆశ్రమం, పరమాత్మ ఆశ్రమం మొదలయినవి చూసి ఎందరెం-దరనో కలసి ప్రవచనాలని విని మన మనసును నిర్మలంగా ఉం-చుకోవచ్చును. ఆధ్యాత్మిక సం-స్కృతిని అలవర్చుకుని మనలను మనం తీర్చిదిద్దుకోవచ్చును.

## హరిద్వార్ లో కుంభమేళా

హరిద్వార్ లో ప్రతి 12 సంవత్స-రాలకు ఒకసారి నిర్వహించబడే ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తాయారు. ఈ కుంభ-మేళాలో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి యోగులు, సాధువులు, సాధకులు ఈ సమయంలో దర్శిస్తారు. అన్ని ఘాట్లలో లక్షల సంఖ్యలో గంగా స్నానాలు ఆచరిస్తారు. కొందరు తమ గురువులనుంచి మంత్రో-

పదేశాన్ని పొందుతారు. దానధర్మాలు చేస్తారు. విదేశీయులైన బౌద్ధులు, టిబెట్, చైనా, జపాన్ దేశాలనుంచి గంగా స్నానాలు చేయటానికి అధిక సంఖ్యలో వస్తారు. ఉత్తరాంచల్ ప్రభుత్వం వారు భక్తులకు వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు.

## హృషీకేశ్ దర్శనం

హరిద్వార్ నుంచి హృషీకేశ్ 24 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ పవిత్ర స్థానానికి రైలు, బస్సు సౌకర్యాలు ఉన్నాయి. చార్ ధామ్ గా వినుతికెక్కిన నాలుగు ప్రసిద్ధ ధామాలు - గంగోత్రి, యమునోత్రి, కేదార్ నాథ్, బదరీనాథ్ దర్శించే యాత్రికుల వాహనాలు విధిగా హృషీకేశ్ ను దాటి ఘాట్ రోడ్ పై పయనించాలి. కేవలం బదరీనాథ్ దర్శించగోరువారు హృషీకేశ్ నుంచి ఘాట్ రోడ్ పై 295 కిలోమీటర్లు ప్రయాణం చేసి అక్కడకు మర్నాడు చేరవలసిఉంటుంది.

రైభ్య మహర్షి చేసిన ఘోర తపస్సుకు మెచ్చిన నారాయణుడు హృషీకేశుని రూపంలో దర్శనమిచ్చిన ప్రదేశం కావున ఈ ప్రాంతాన్ని హృషీకేశ్ గా పిలుస్తారు. ఈ ప్రాంతమందే విష్ణుమూర్తి మధుకైటభులని సంహరించాడు. హృషీకేశ్ కి అన్ని వైపులా మహోన్నత పర్వత శిఖరాలు. పచ్చని ప్రకృతి, గంగామాత గలగలలు దర్శనమిస్తాయ. ఇక్కడ బహు ఆశ్రమాలు ఉన్నాయి. యోగ శిక్షణ కేంద్రాలు., ధ్యాన కేంద్రాలు



ఇక్కడ అనేకం ఉన్నాయి. ఇవి అన్నియూ గంగానది ఒడ్డునే ఉంటాయి. ఆధ్యాత్మిక చింతనపై తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి.

ఇచ్చట ఆశ్రమాలలో ఎక్కువమంది విదేశీయులు 'యోగ' నేర్చుకొనుటకు వస్తుంటారు. ఇచ్చటి యోగ శిక్షణ లోని పద్ధతులు ప్రపంచంలోనే అరుదైనవిగా పేరుగాంచాయి. గంగానది ఒడ్డునే ఉన్న శివానంద ఆశ్రమం ఒక పెద్ద ఆశ్రమం. 1936 వ సంవత్సరం నుంచి ఈ ఆశ్రమంలో యోగశిక్షణ, మరియు రోగులకు



చికిత్స, సమాజ సేవలు మొదలగునవి నిర్వహిస్తూ భారతదేశంలో పేరు మోసిన ఆశ్రమంగా మారింది. వారి సేవలు, వారి ఆధ్యాత్మిక బోధనలు ఆంధ్రులందరికీ సుపరిచితం.

హృషీకేశ్ అనగానే ముఖ్యంగా మనకు జ్ఞాపకమొచ్చేది లక్ష్మణ్ ఝూలా మరియు రామ్ ఝూలా అనే రెండు వంతెనలు. స్తంభాలు లేకుండా కేవలం ఇనప తీగెల ఆధారంగా వేలాడే వంతెనలు ఈ రెండూను. ఎవరైనా మనిషి వంతెన మీద గట్టిగా ఎగిరి దూకితే మొత్తం వంతెన అంతా కదులుతుంది. ఈ రెండిటిలో లక్ష్మణ్ ఝూలా పురాతనమైనది. దీనిని 1030 సంవత్సరములో నిర్మించారు.

భారతమాత మందిరం

లక్ష్మణ్ ఝూలాకు ఆవలి ఒడ్డున భారతమాత మందిరం వుంది. ఈ మందిరంలోని 13 అంతస్థులలో దేవతామూర్తులను అలంకరించారు. ఈ మందిరానికి చేరువలో ఎత్తైన రుద్రాక్ష చెట్టు ఉంది.

రామ్ ఝూలా

ఇచ్చట ఉన్న ఆశ్రమంలో బదరీనారాయణుని పూజలు గావించి యాత్రికులు బదరీనాథ్ యాత్ర ప్రారంభిస్తారు. ఇక్కడ ఉన్న స్వర్గాశ్రమం, గీతాభవన్ లు యాత్రికులు భక్తి ప్రపత్తులతో దర్శించి తీర్థ ప్రసాదములు సవీకరిస్తారు. యాత్రికులు ఎక్కువ సంఖ్యలో త్రివేణి ఘాట్ లో గంగా నదీ స్నానం చేసి ఆనందిస్తూ వుంటారు. ఇక్కడ లోటు తక్కువగా ఉంటుంది. పూర్వకాలంలో ఇక్కడ గంగా యమునా సరస్వతి నదులు సంగమం అయ్యేవని చెబుతారు.

ఇచ్చటి స్వర్గాశ్రమం స్వామి ప్రకాశానంద కాళీ కమలీవాలె వంటి యోగులు యాత్రికుల కోసం కట్టించిన ఆశ్రమం. గీతా మందిర్ దగ్గరనే పరమార్థ నికేతన్ అనే ఆశ్రమాన్ని షాజహాన్ పూర్ మహారాజావారు కట్టించారు. ప్రతిరోజూ గంగానది తీరాన గంగా హారతి సాయంత్రం సుమారు 7 గంటలకు ఇస్తూ 'గంగామయ్యా' పాటలు పాడతారు.

2. కిలోమీటర్ల దూరంలో ఉన్న హృషీకేశ్ ఊళ్ళో ఆంధ్రా ఆశ్రమం ఉంది. ఈ ఆశ్రమంలో అధిక సంఖ్యలో బదరీనాథ్ యాత్రికులు బస చేస్తారు. ఈ ఆశ్రమాన్ని తిరుపతి తిరుమల దేవస్థానం వారు చక్కగా నిర్వహిస్తున్నారు. ఆశ్రమం వెనుక భాగాన ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం శ్రీ చంద్రమౌళీశ్వరాలయం దర్శించి పూజలు చేయించుకుని తిరుగు ప్రయాణం చేబడతారు. తపోభూమిని దర్శించి, గంగామాతను సేవించామన్న తృప్తితో అనుభూతులు నెమరువేసుకుంటారు.

(ఇంకా వుంది)



# స్త్రీ గొప్పతనం



పోడూరి శ్రీనివాసరావు

పవిత్ర భారతదేశంలో మహిళకున్న స్థానం మహోన్నతమైనది. సృష్టికి మూలాధారం ఆదిపరాశక్తి. స్త్రీ కున్న గొప్ప ఆస్తి సహనం, ఓర్పు, క్షమాగుణం, దయ, ప్రేమాభిమానాలను పంచడం-....ఆ గొప్ప లక్షణాల్ని దృష్టిలో ఉంచుకునే, ఆమెకు మహోన్నతస్థానం కల్పించడం జరిగింది. తల్లి, బిడ్డను నవమాసాలు గర్భంలో మోయడమే కాకుండా, ప్రాణాలకు తెగించి తన బిడ్డ భూమి మీద పడడానికి అవకాశం కల్పిస్తుంది.

మహోన్నతత్వంలో, సహనంలో, క్షమలో తల్లి పాత్ర ఎనలేనిది. ఆమెకు ఆ ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఉండబట్టే, గొప్ప గౌరవాన్ని ఆపాదిస్తూ, భూమాత, గోమాత అంటూ ఎంతో సహనం గల భూమిని, ఆవుని కీర్తిస్తూ ఉంటాము. 'క్షమయా ధరిత్రి' అని ఊరికే అనలేదుకదా.

పరిపూర్ణ స్త్రీ లో.....అందరూ ఉన్నారు, ఒక తల్లి, ఒక చెల్లి, ఒక ఉపాధ్యాయురాలు, ఒక బిజినెస్ ఉమెన్, ఒక వైద్యురాలు. ఒక స్నేహితురాలు ... ఇలా ఒకరేమిటి? ఎన్నో అవతారాలు ఆమెవే... నవమాసాలూమోసి బిడ్డను కనడంతోబాటు, చిన్నతనంలో వచ్చే ఎన్నో బాలారిష్టాలను తానే ఎదుర్కొంటుంది. పిల్లలకు కాస్త ఒళ్ళు చల్లబడితే వంటింటి వైద్యం తనే చేస్తుంది. పిల్లలకు చదువు తనే చెప్తుంది. రామాయణ, భారత, భాగవతాల్లో కథలు, లీలలు వారికి వంటబట్టేలా చెబుతుంది. భర్త తెచ్చిచ్చిన నెల జీతపురాళ్ళు జాగ్రత్తగా వాడుకుంటూ, ఎప్పుడూ ఇంట్లో లేదనేమాట లేకుండా, పొదుపుగా కాపురం చేస్తూ మేనేజ్ చేసే MBA ఆ మహాతల్లి. పిల్లల చదువు విషయమే కాదు, సమయానికి భర్తకు సలహాలనిచ్చే అడ్వైజర్ కూడా ఇంటి ఇల్లాలు.

పురాణాలు చూసుకున్నా, చరిత్రపుటలు తిరగేసినా.. మహిళ గొప్పతనం అవగతమౌతూనే వుంటుంది. వీర శివాజీకి దేశభక్తి నూరిపోసింది ఆయన మాతృమూర్తి కాదా... మహనీయుడు, భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాల్లో విస్తరింపచేసిన స్వామి వివేకానందునికి దిశానిర్దేశనం చేసింది ఆయన తల్లి కాదా... భరతమాత దాస్యశృంఖల విముక్తికై, ఆంగ్లేయుల నెదుర్కొని కదనరంగాన దుమికి అరివీరభయంకరిగా, శత్రువులను చీల్చి, చెండాడిన ఝాన్సి లక్ష్మిబాయి, రాణి రుద్రమదేవిల పరాక్రమం ఏ స్వాతంత్ర్యసమరయోధుల యుద్ధ కౌశలానికీ తీసిపోదు.

నేటి నవీనయుగంలో కూడా ఎందరో మహిళాశిరోమణిలు చారిత్రాత్మకవిజయాలు సృష్టిస్తూ చరిత్రపుటలకు ఎక్కుతున్నారు. మనభారతదేశంలోనే గణిత శాస్త్రవేత్త శకుంతలాదేవి, అంతరిక్షానికి అవలీలగా అంగలు వేసిన కల్పనా చావ్లా, ప్రధాని ఇందిరాగాంధీ, బయోటెక్నాలజీ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కిరణ్ ముజుందార్ షా, లేడీ ఐ పి ఎస్ కిరణ్ బేడి, అథ్లెటిక్ రంగంలో చరిత్ర సృష్టించిన పి.టి. ఉష, అశ్వనీ నాచప్ప, హిమాదాస్ లాంటి వాళ్ళు, మహిళా క్రికెటర్లు మిథాలిరాజ్ వగైరాలు ...... ఇలా ఒకళ్ళా, ఇద్దరా....అనేకమంది మహిళాశిరోమనులే కదా.. మరోవైపు అగ్రరాజ్యమైన అమెరికాలో సైతం, ఇటీవల జరిగిన ఎన్నికల్లో, భారతీయుల ప్రతిభ ప్రకటితమవ్వడం మనం కళ్ళారా చూసాం. శ్రీమతి కమలా హేరీస్ తదితర భారతీయ మహిళా సంతతికి చెందిన మహిళా సేనేటర్ల ప్రాభవం ప్రపంచానికంతా తెలిసింది. మహిళలు ఏ రంగంలోనైనా, పురుషులకు ఏ విధంగానూ తీసిపోరన్నది విదితమే. దేశ మహారాణుల్లా, రాజకీయాల్లో మంత్రులుగా, మేయర్ లుగా, దేశ ప్రధానులుగా, దేశాధ్యక్షులుగా, పార్టీ అధ్యక్షులుగా... విభిన్న హోదాలలో సమర్థవంతం గా పనిచేయడ-

మేకాకుండా, పేరు ప్రఖ్యాతులు గడించారు, రాణించారు.

గతంలో సమిష్టి కుటుంబాలు ఉండేవి. రోజువారీ వ్యవహారాల్లో కాదు, సెలవల్లోచ్చాయంటే కాదు.... ఇల్లు పదిమందితో కలకలలాడుతూ ఉండేది. పిల్లలకు ఆడుకోవడానికి బొమ్మలు తెచ్చారంటే, ఆ తెచ్చిన బొమ్మ తోటే, ఒకటవనీ, నాలుగవనీ, ఇంట్లోని పిల్లలంతా హాయిగా ఆడుకొనేవారు. తాటాకులతో పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు బొమ్మలుచేసి, వాటిని సింగారించి బొమ్మలపెళ్ళిళ్ళు చేసి వినోదించి, ఆనందించేవారు. అప్పుడు ఆ బొమ్మలు చేయడం, వాటిని అలంకరించడం, ఆ పెళ్ళిళ్ళు చేయడం అంతా అమ్మాయిలే చేసేవారు. ఆ తాటాకు పెళ్ళికూతురిని అందంగా చీరకట్టి అలంకరించడం, ఒద్దికగా భుజాన్నవేసికొని పాటలు పాడడం... అంతా చక్కగా ఉండేది. అంత చిన్నవయసులోనే, ఆ చిన్నపిల్ల పెద్ద ఆరిందాలా వ్యవహరించేది. ఆ ఆటలే వేరు ...

మరిప్పుడు, సమిష్టి కుటుంబాలన్నవే లేవు. కేవలం భార్యాభర్తలు కలిసున్నకుటుంబాలే ఉంటున్నాయి. కొన్నైతే, అవీ మృగ్యమే. ఒక సంతానం చాలు, తప్పితే రెండు. గతంలో ఒకటి రెండు బొమ్మలతో అందరూ ఆడుకోనేవాళ్ళయితే, ఇప్పుడు ఒక్కొక్కళ్ళకీ ఒక్కోబొమ్మ కావాలి. అదికూడా, ఇదివరకులా తాటాకు బొమ్మలూ, బొమ్మలపెళ్ళిళ్ళు కాదు. అబ్బాయికైతే, కార్లూ, బైకులు, గన్లు, ఎవెంజేర్ బొమ్మలు, అమ్మాయిలకైతే బార్బీ డాల్, మరింకోటేదో అలాంటిది. పిల్లల్లోకూడా హింసాత్మక ప్రవృత్తులు పెరిగిపోయాయి.

మనతరంలో అయితే, అయిదు సంవత్సరాలకు గాని అక్షరాభ్యాసం చేసేవారు కాదు. అంతవరకు అమ్మ ప్రేమ, ఆప్యాయతలతో కూడిన గోరుముద్దలు తినిపిస్తుంటే, “చందమామ రావే... జాబిల్లి రావే” అంటూ అమ్మ పాడుతుంటే, ఆ చక్కటి పాటలు వింటూ, అమ్మ పుస్తెలతో, స్తనాలతో ఆడుకుంటూ, ఆ మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ, పాలుత్రాగిన, గోరుముద్దలు తిన్న ఆనందం నేటి బాలలకు ఎక్కడుంది ?? ఇప్పుడైతే రెండున్నర సంవత్సరాలయితే చాలు, పిల్లవాడిని పెద్ద కార్పొరేట్ స్కూల్లో జాయిన్ చేసెయ్యాలి. వాడికో గిన్నెలో సెరెలాక్ కలిపేసి, వాడి మొఖానికో ఇంగ్లీష్ రైమ్స్ ఛానెల్ పెట్టేసి, ఓ సెల్లో, ఓ టివి నో ఆన్ చేసి వాడి తిండేదోవాడు తింటూంటే, మన పనులు మనం చేసుకోవడం. ..వాడు గబగబా చదివేసుకుని, అమెరికా వెళ్ళిపోయి డాలర్లు సంపాదించేయాలి. ఈ ఆలోచన తప్ప వాడికి ప్రేమానురాగాలు పంచాలి, అభిమానం, ఆత్మీయత, కుటుంబవిలువలంటే ఏమిటో తెలియచెప్పాలి అన్న ఆలోచన ఉన్న తల్లితండ్రులు ఎంతమంది ఉన్నారు? నేటి తరంలో. రెండున్నర సంవత్సరాల వయసు నుంచీ, ఎంతసేపూ ఆ శిశువుకి, నాలుగు గోడలూ, పుస్తకాలూ, మొబైల్, ఎదురుగా టీవీ, పోటీతత్వమూ తప్పితే...ప్రేమాభిమానాలూ, కుటుంబవిలువలూ, ఆప్యాయతలూ, అనురాగాలు ... ఇవన్నీ ఎలా తెలుస్తాయి ? ఇలాంటివాళ్ళు ప్రేమ విలువలు తెలియక పెద్దయ్యాక తల్లితండ్రులను వృద్ధాశ్రమంలోచేరుస్తున్నారేమో అనిపిస్తూ వుంటుంది. నేటితరం తల్లులు ఈదిశగా కూడా ఆలోచించాలి.

దేవతల విషయం తీసుకున్నా కూడా, స్త్రీ కి విశేషమైన ప్రాముఖ్యత ఇవ్వడం జరిగింది. బ్రహ్మ తన వాక్కులో సరస్వతీదేవినీ, విష్ణువు తన హృదయంలో లక్ష్మిదేవినీ, ఈశ్వరుడు తన తనువులో అర్ధభాగాన్ని పార్వతీదేవికి సమర్పించారు. అలాగే ఒక వ్యక్తి జీవితంలో కూడా, బాల్యం నుంచీ స్త్రీ ప్రభావం పడుతూనే వుంటుంది. స్త్రీ దేవతల అనుగ్రహం, అమ్మవార్ల దయ లేనిదే, ఏ వ్యక్తి పరిణితి చెందలేడు. చదువు బాగా రావాలంటే, చదువులతల్లి సరస్వతీదేవి అనుగ్రహం ఉండాలి. జీవితంలో స్థిరపడి కాస్త ఆస్తులు సంపాదించి సుఖసంతోషాలతో ఉండాలంటే, లక్ష్మీదేవి అనుగ్రహం ఉండాల్సిందే. నిత్యం సమస్యలతో ఎదుర్కుంటూ విజయాలను సాధించి, ఆనందమయజీవితాన్ని గడపా-

లంటే దుర్గామాత కరుణామయదృష్టి తప్పనిసరి.
ఎంత అభివృద్ధి చెందుతున్నప్పటికీ, నేటితరం మార్పులకనుగుణంగా పరిస్థితులు మారుతున్నప్పటికీ, మహిళామణులు కూడా తమ తమ ఆలోచనావిధానంలో మార్పులు చేసుకుంటూ, కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇస్తూ, పిల్లల పెంపకంలో జాగ్రత్తలు పాటిస్తూ, భర్తకు సహాయ సహకారాలను అందిస్తూ సంసారజీవితాన్ని ఆనందమయం చేసుకోవడం కేవలం ఆడవారి చేతిలోనే ఉంది. ప్రతీ పురుషుడి విజయం-వెనక స్త్రీ ప్రధాన పాత్రపోషిస్తుందన్న నానుడి ఊరికే రాలేదు కదా !
మహమ్మారి కరోనా సమయంలో, ప్రపంచ ఆర్థికవ్యవస్థ అతలాకుతలం అయిన తరుణంలో, చాలామంది ఉద్యోగాలు కోల్పోయి, ఉపాధి కొరవడిన తరుణంలోకూడా...ధైర్యం కోల్పోక ఎన్నోకుటుంబాలలో ధైర్యం నింపి, సంసారనౌకను సమర్ధవంతంగా నడిపిన ఎందరో మహిళామణులకు వందనం.

---

(13 వ పేజీ తరువాయి)

# దశమగ్రహం కాదు

సుకొన్న తర్వాత నీ సంబంధం ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవడం ఇష్టం లేకపోయింది.
ఇంకో సంగతి ఏమిటంటే నా కోడళ్ళిద్దరూ చాలా స్వార్థపరులైన మొండిఘటాలు. మీ నాన్నగారికిచ్చిన వాగ్దానం నెరవేర్చడంలో నాకు చాలా ఇబ్బందులెదురౌతాయని తెలుసు. అయినా నందోరాజా భవిష్యతి అనుకొంటూ మీ నాన్న చెప్పిన షరతులకు అంగీకరించేశాను. ఇప్పుడు ఆపద్బాంధవుడిలా నీ మనసులోని మాట చెప్పావు. నీ లాంటి అల్లుడు దొరకడం మా అదృష్టం. అలాగే కానిద్దాం," అన్నాడు ఆప్యాయంగా.
యికపోతే ప్రస్తుతంలో బాగా పేరొందిన కాశీశాస్త్రి చాలా వృద్ధుడైపోయాడు. కుటుంబరావు వెళ్ళి "స్వామీ!మీరు చెప్పినట్టుగా జరగలేదు. వంశం నా కుమారుడితో ఆగిపోవలసిందేనా?" అని అడిగాడు.
"నువ్వు నీ ముత్తాత కర్మఫలం నుంచి తప్పించుకోడానికి ఆంక్షలు పెట్టి తప్పు చేశావు. మదాలస జాతకం చాలా అదృష్టమైనది. అందుకనే మీ యింట అడుగు పెట్టగానే గతవైభవానికి మరిన్ని రెట్లు వైభవలక్ష్మి నీ యింట అడుగు పెట్టింది. అంతేకాదు, ఆమె నిత్యపూజాఫలం నీ ముత్తాత కర్మఫలాన్ని అడ్డుకోగలిగింది. సంతోషించు. అయితే కర్మదేవత అవకాశం కోసం ఎదురుచూస్తోనే ఉంటుంది. అందుకని పేదల అమ్మాయిల పెళ్లిళ్లకు సహాయం చేస్తూ ఉండు! నీకే బెడదా ఉండదు! నీకు వంశోద్ధారకుడు కలగనందుకు చింతించకు. కానీ మీ వంశం పేరు మట్టుకు పది కాలాలబాటు శాశ్వతంగా నిలిచిపోతుంది!" అన్నాడాయన.
కుటుంబరావు ఆయన మాట అక్షరాల పాటించాడు. దౌహిత్రి పెళ్లి చేయిస్తానని మాధవరావు ముందుకొచ్చినా, "అప్పుడేదో మూర్ఖత్వంతో అలా ప్రవర్తించాను. నా మనవరాలి పెళ్లి మీరు చేయించడమేమిటి? నా కొడుకే చేయిస్తాడు. ఏదో పెద్దరికం వహిస్తూ మనం ఓ మూల కూర్చుని ఆశీర్వదించడమే!" అన్నాడు కుటుంబరావు నవ్వుతూ.
ఆ తర్వాత కుటుంబరావు ఎందరో పేదలింటి పెళ్లిళ్లకు ఆసరాగా నిలబడ్డాడు. మదాలసా వంశీలు కొన్ని వివాహాల్లో కన్యాదాతలుగా కూడా వ్యవరించారు.

*****

# నూటపదహార్లు కందాల్లో
# సుందరకాండ



పాలెపు బుచ్చిరాజు

## మనవి

వాల్మీకి రామాయణం మహోత్కృష్టమైన కావ్యం. ఎవరె న్నిసార్లు రాసినా ఇంతకంటే ఎక్కువగా ఏం చెప్పగలరు? యావద్భారత దేశంలో ఎన్నో భాషల్లో ఎందరో మహానుభావులు రచించి, చదివి, విని ధన్యులయ్యారు. ఉత్తర భారత దేశంలో గోస్వామి తులసీదాసు రచించిన "రామచరితమానస్" కి ఉన్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. అఖండ రామాయణ పారాయణం, సుందర కాండ పారాయణం, హనుమాన్ చాలీసా ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర వినిపిస్తూనే ఉంటాయి. తెలుగులో కూడా వెయ్యేళ్ళుగా వేలాది భక్తులు రామాయణాన్ని రాసి, చదివి, విని తరించారు.

రామాయణంలో రాముడి తరవాత విశిష్టమైన పాత్ర హనుమది. స్వామి భక్తికి, కార్య దీక్షకి, బుద్ధికుశలతకి కొలమానంగా చిత్రించాడు వాల్మీకి. అసలు రామాయణంలో సుందర కాండ ప్రత్యేకంగా హనుమ కోసమే సృష్టించ బడింది అనిపిస్తుంది. సీతాన్వేషణలో హనుమ చేసిన అద్భుత కార్యాలకి అబ్బురపడి శ్రీరాముడు "నువ్వు నా తమ్ముడు భరతుని వంటి వాడవ"ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. భక్తి తత్వానికి ఉదాహరణగా రచించ బడింది కనుకనే సుందర కాండ ప్రత్యేకంగా పారాయణకి నోచుకుంది.

నాటి రామదాసు, త్యాగరాజు నుంచి, నేటి ఎం. ఎస్. రామారావుగారి వరకు ఎందరో మహానుభావులు శ్రీరామ హనుమలను కీర్తించడం ద్వారా ధన్యులయ్యారు.

వారిని స్ఫూర్తిగా తీసుకుని 'వంద కందాల్లో సుందర కాండ' రాద్దామనే ప్రయత్నం చేశాను. 'అష్టోత్తర శతం' దాటినా హనుమంతుని తోకలా పెరుగుతూ పోయింది. ఆఖరికి 'నూటపదహార్లు' తో పూర్తి చేయ గలిగాను. చదువరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆఖర్న అనుబంధంగా "పురజన గీత" గా పద్దెనిమిది కందాలు చేర్చాను. పట్టాభిషేకం తరవాత శ్రీరాముడు తమ్ముల్ని, మంత్రుల్ని, సామంతుల్ని, సైన్యాన్ని ఉద్దేశంచి ఎవరెలా మసలుకోవాలో మాట్లాడాక, పుర ప్రజల్ని కూడా పిలిపించి వారికి భక్తి తత్త్వం బోధిస్తాడు. ఆ కారణంగానే దీనికి 'పురజన గీత' అని పేరు. తులసీ రామాయణం ఆధారంగా రాసిన పద్యాలు.

బరోడా

పాలెపు బుచ్చిరాజు

25) అప్పుడు మారుతి చెప్పెను
“గొప్పగ దాటెద జలనిధి కోరిక దీరన్
ఇప్పుడె లంకను జేరెద
గప్పున సాధించి వత్తు కార్యము వినుడీ!”

25) పోయింది. ఎక్కడలేని బలం వచ్చింది “అయితే చూడండి, ఇప్పటికిప్పుడే మీరంతా చూస్తూ ఉండగా ఈ సముద్రాన్ని దాటుతాను. లంకలో సీతాదేవి జాడ తెలుసుకుని వస్తాను.” అని ముందుకుఅదంతా విని ‘నేనంత గొప్పవాడినా’ అని పొంగిపోయారు మారుతి. ఆయన శరీరం పులకించి రికాడు. .

26) తెప్పున కాయము బెంచెను
ఉప్పొంగె కపిజనసంద్రమురకలు వేసెన్
కుప్పించి యెగసె మారుతి
ఉప్పొంగెను ఉప్పు సంద్రముప్విళులూరెన్

ఉన్నట్టుండి హనుమంతుడు తన శరీరాన్ని పెంచాడు. ఒక పెద్ద పర్వతంలా పెంచిన శరీరంతో, వాయువేగ మనో వేగాలతో, గాలిలో కెగిరాడు. అది చూసిన కపిసేన సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయింది. ఆయనలా సముద్రం మీద దక్షిణ దిక్కుగా దూసుకు పోతూ ఉంటే సముద్రం లోంచి అలలు ఉవ్వెత్తున లేచాయి. (ఈ విధంగా అలలు పైకి లేవడం అనే ప్రక్రియ భౌతిక శాస్త్ర ప్రమాణాల ప్రకారంగా కూడా నిరూపించ వచ్చును. బహువిశాలమైన ఒక వస్తువు ఒకటి నీటి మీదుగా అతివేగంగా దూసుకు పోతున్నప్పుడు తాత్కాలికంగా వెనుకవైపున అల్పపీడనం ఏర్పడుతుంది. అప్పుడు ఆ ప్రాంతంలో అలలు పైకి లేస్తాయి. వేల సంవత్సరాలకి పూర్వమే ఈ విషయం మన ఋషులు గుర్తించడం గమనార్హం.)

27) దవ్వుల మారుతి యెగురగ
నవ్వులతో నిండి పోయె నలువురి ముఖముల్
ముప్పురు మూర్తులు మురిసిరి
పువ్వుల వానలు కురిసెను భువిపై నంతన్

27) ఆ విధంగా మారుతి ఎగురుతూ దూర తీరాలకి పోతూ ఉండగా చూసిన వానరులంతా ఆనందంతో ఉప్పొంగి పోయారు. హనుమ తప్పక కార్యం సాధించుకు రాగలడనే విశ్వాసంతో ఉన్నారు. త్రిమూర్తులు, దేవతలు సంతోషంతో పూల వర్షం కురిపించారు.

28) మారుతి దొకటే ధ్యేయము
వేరు తలపు లేమి లేవు వేగమె సీతన్
జేరి శుభవార్త తల్లీ!
శ్రీరాముడు సేమమంచు చెప్పగ వలయున్

28) మారుతి ముందుకు వెళ్ళిన కొద్దీ ఇంకా వేగం పెంచాడు. ఎంత తొందరగా లంక చేరుకుని, సీత ఎలా ఉందో చూసి, శ్రీరామ లక్ష్మణులు క్షేమంగా ఉన్నారని, చెప్పాలా అని తహతహలాడుతున్నాడు. ఆయన మనసు నిండా ఇవే ఊహలు. మరొక ఆలోచనే లేదు.

29) కార్యము దేవుడు రాముని
భార్యది యైనను ఎదురగు బాధలు ధరలో
ఆర్యుల మాటలు నిజములు
ధైర్యము కలిగిన జయంబు తథ్యము కాదే!

29) ఏదైనా ఒక మంచి పని తలపెట్టినపుడు, అది దైవ సమానుడైన రాముడిది అయినాసరే, దారిలో అడ్డంకులు రాక మానవు. అందుకే పెద్దలు అంటారు. ఎన్ని అవరోధాలు వచ్చినా నిరుత్సాహపడక వాటిని దాటుకుంటూ ముందుకు సాగిపోవడం వల్లనే ఎవరైనా విజయం సాధించగలరని.

30) సగమే వెళ్ళెను మారుతి
నగమొకటి ఎదురుగ నిల్చి నాపై హనుమా!
దిగుమొక్కసారి యనియెను
ఎగిరెగిరి అలసితివేమొ యీవడి యేలన్

30) హనుమంతుడు ఇంకా సగం దూరమే వెళ్ళాడు. ఇంతలో సముద్రం మధ్యనుంచి ఒక మహా పర్వతం పైకి లేచి, అడ్డంగా నిలిచింది. "అయ్యా! నా పేరు మైనాకుడు. నేను నీకొక ఉపకారం చేస్తాను. ఇంతదూరం ఎగిరి ఎగిరి అలసిపోయి ఉంటావు. నా శిఖరం మీద కాస్త విశ్రాంతి తీసుకుని మరీ వెళ్ళు. " అంది.

31) ఎగురుట నాకలవాటుయె
నగరాజా! పవన సుతుడ నన్నెరుగవుగా!
తగవే? నాదారి వదలు
మగుడన్వచ్చెద మరువక మైనాక యనెన్

31) అప్పుడు మారుతి " పర్వత రాజా! ఇలా ఎగరడం నాకు అలవాటే. ఎప్పుడూ అలుపన్నది ఎరుగను. నా మంచి కోరిన వాడివి, స్వామి కార్యం మీద వెళ్తున్ననన్ను ఇలా ఆపు చేయడం ఉచితం కాదు. కావాలంటే తిరుగు ప్రయాణంలో నిన్ను కలుస్తాను. ఇప్పుడు నా దారికి అడ్డం రాకు." అని ముందుకు సాగిపోయాడు.

32) సురులందరు యోచించిరి
సురసను బంపిన భయపడి శూరుడు చూడన్
పరమాత్మ కార్యమునకై
అరుదగు విఘ్నము జయించి అరుగునొ లేదో!

32) హనుమ ఇలా వెళ్ళడం దేవతలకి ఇష్టమే! కాని అతని కార్య శీలత ఎంతటిదో పరీక్షించాలని భయంకర రూపిణి అయిన సురసను పంపారు. సాధించలేనిది ఏదీ లేదు. ఇంక ఆలస్యం చేయవద్దు. మన మహారాజు సుగ్రీవుడు ఇచ్చిన గడువు కూడా దాటి పోయింది. నువ్వు తప్ప మా ప్రాణాలు ఎవరు కాపాడగలరు?" అని వేడుకున్నారుసహాయం చేయగలను.

# గ్రీసు దేశపు పురాణ గాథలు



## వేమూరి వేంకటేశ్వరరావు

"Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence."
Aldus Huxley. "Knowledge and Understanding"

## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, "మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి," అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా "ఇరవై నిమిషాల కార్యక్రమం" చూద్దామని వెతకడం ఉపక్రమించేను. "అపస్వరం అనే ఏపిల్ పండు కథ" ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.
పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, "చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను" అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అని-పించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.
ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 7. ట్రోయ్ మహా సంగ్రామం

గ్రీకు పురాణ గాథలలో ప్రసిద్ధికెక్కిన ఈ మహా సంగ్రామానికి, తద్వారా జరిగిన మారణ హోమానికి మూల కారణం ఏరిస్ (Eris) అనే ఒలింపాయన దేవత అని మనం తీర్మానం చెయ్యవచ్చు. (ఏఫ్రొడీటి కొడుకు ఈరోస్ (Eros) మన మన్మధుడికి పోలిక! ఏరిస్ బంగారు ఏపిల్ పండుని పెళ్లి పందిరిలోకి విసిరిన వ్యక్తి.)

ఒక వివాహ సందర్భంలో ఒలింపియన్ దేవతల అధినేత అయిన జూస్ ఒక బ్రహ్మాండమైన విందు చేస్తాడు. కోరుకుని కొరివితో తలగోక్కోవడం ఎందుకని పేచీకోరు ఏరిస్ ని ఆ విందుకి పిలవడు. జరిగిన పరాభవానికి ఆత్మాభిమానం దెబ్బతిన్న ఏరిస్ పిలవని పేరంటంలా విందుకి రానే వచ్చింది. జూస్ ఆజ్ఞానుసారం హెర్మీస్ ఆమెని లోపలికి రాకుండా అటకాయిస్తాడు. ఏరిస్ తక్కువ తిన్నదా? బయట నుండే బంతి భోజనాల మధ్యకి ఒక బంగారు ఏపిల్ పండుని విసరి వెళ్లిపోతుంది. ఆ పండు మీద "మీలో అందమైన ఆడదానికి ఈ బహుమానం" అని రాసి ఉంటుంది.

Eris --->

విందులో ఉన్న ముగ్గురు దేవతలు - హేరా, ఎథీనా, ఏఫ్రొడీటి - "ఆ పండు నా కోసమే" అంటూ ఎగబడి తగువులాడుకుంటారు. తీర్పు చెప్పమని ముగ్గురూ జూస్ ని అడుగుతారు. ఎటు తీర్పు చెప్పినా ఇబ్బందే అని జూస్ ఈ ముగ్గురికీ హెర్మీస్ ని తోడు ఇచ్చి భూలోకంలో ఉన్న పేరిస్ దగ్గరకి పంపుతాడు. ముగ్గురిలోనూ ఏఫ్రొడీటి అందమైనదని పేరిస్ తీర్పు చెబుతాడు. దానికి బహుమానంగా పేరిస్ ని భూలోక సుందరి హెలెన్ - మెనలావూస్ భార్య - వరించేలా వరం ఇస్తుంది.

హెలెన్ కన్నతల్లి స్పార్టాకి రాణి అయిన లేడా (Leda). హంస రూపంలో జూస్ వచ్చి లేడాని అనుభవించగా హెలెన్ పుట్టిందని ఒక




కథనం ఉంది. కనుక హెలెన్ దైవాంశ సంభూతురాలు. స్పార్టాకి రాజైన టిండారియస్ (Tyndareus) హెలెన్ ని తన సొంత కూతురిలాగే చూసుకున్నాడు. హెలెన్ అందాన్ని చూసి ఎంతోమంది రాజులు, ధీరులు ఆమెని చేపట్టటానికి ముందుకి వచ్చేరు. ఒకరి వైపు మొగ్గు చూపితే మరొకరికి కోపం వస్తుందని టిండారియస్ భయపడ్డాడు. చివరికి ఇతకా రాజైన ఒడీసియస్ (Odysseus) తనకి పెనెలొపి (Penelope)ని ఇచ్చి పెళ్లి చేస్తానని వాగ్దానం చేస్తే ఒక పరిష్కార మార్గం సూచిస్తానన్నాడు. ఆ మార్గం ఏమిటంటే హెలెన్ ఎవ్వరిని పెళ్లి చేసుకున్నా సరే మిగిలిన రాజులంతా ఆ వివాహాన్ని సమర్ధించాలి. అంతా ఒప్పుకున్నారు. అప్పుడు టిండారియస్ తన కోరిక మేరకు హెలెన్ ని మెనలావూస్ (Menelaus) కి ఇచ్చి పెళ్లి చేసేడు.

మెనలావూస్ కి హెలెన్ ని ఇవ్వడంలో రాజకీయం లేకపోలేదు. మెనలావూస్ ధనవంతుడు. అతనికి పెద్ద సైన్యం ఉంది. పెద్దల యెడల ఎలా ప్రవర్తించాలో ఎరిగిన వ్యక్తి. పెళ్లి విషయంలో కూడా తనంత తానుగా ఎగబడలే-

దు; తన అన్నగారైన అగమేమ్నాన్ (Agamemnon) ద్వారా వర్తమానం పంపేడు. ఈ అగమేమ్నాన్ మరెవరో కాదు; హెలెన్ కి సాక్షాత్తు మరిది. ఎందుకైనా మంచిదని ఈ పెళ్లి జరిగితే ప్రేమదేవత ఏఫ్రొడీటికి వంద గిత్తలు బలి ఇస్తానని మెనలావూస్ మొక్కుకున్నాడు కూడా. ఆ మొక్కు సంగతి మరచిపోయి ఏఫ్రొడీటి ఆగ్రహానికి గురి అవుతాడు; అది వేరే సంగతి!

ట్రోయ్ నగరపు రాయబారి వర్గంలో ఒక వ్యక్తిగా పేరిస్ చౌరబ్యాటుతో స్పార్టాలో ప్రవేశిస్తాడు. పేరిస్ రాజప్రాసాదం లోకి ప్రవేశించే లోగా ఏఫ్రొడీటి అందాల పోటీలో తాను పేరిస్ కి ఇచ్చిన వరం నెరవేర్చడానికిగాను ఈరోస్ (Eros) సహాయం కోరుతుంది. ఈరోస్ తన పువ్వుల బాణంతో హెలెన్ లో కామాతురతని రెచ్చగొడతాడు. ఏఫ్రొడీటి ఇచ్చిన వరం ప్రకారం పేరిస్ ని చూడగానే హెలెన్ ప్రేమలో పడుతుంది. హెలెన్ ని వెంటపెట్టుకుని పేరిస్ ట్రోయ్ వెళ్ళిపోతాడు.




హెలెన్ అపహరణ అనే పని ఆ రోజుల్లో కొత్తేమీ కాదు. ఇటువంటి “స్త్రీ గ్రహణాలు” ఆ రోజుల్లో తరచుగా జరిగేవి. మైసినే (Mycenae) నుండి లో (Lo) అపహరణ, ఫినీషియా (Phoenicia) నుండి యూరోపా (Europa) అపహరణ కేవలం రెండు ఉదాహరణలు. కొల్చిస్ (Colchis) నుండి మీద్యా (Medea) ని జేసన్ (Jason) అపహరిస్తాడు.




ట్రోయ్ నగరం నుండి హెరాక్లిస్ (హెర్క్యులిస్) రాకుమారి హీషన్ (Hesione)ని అపహరించి ఆమెని టెలామన్ (Telamon) కి కానుకగా ఇస్తాడు. ఈ అపహరణలు జరిగినప్పుడు పర్యవసానంగా అనుకోని విపత్తులు ఏవీ రాకపోవడంతో హెలెన్ ని దొంగిలించడానికి పేరిస్ కి ధైర్యం వచ్చిందని చరిత్రకారుడు హెరొడోటస్ వ్యాఖ్యానిస్తాడు.

హోమర్ చెప్పిన కథనం ప్రకారం మెనలావూస్ తన స్నేహితుడైన ఒడీసియస్ ని వెంటబెట్టుకుని ట్రోయ్ నగరంతో సంప్రదింపులు జరిపి హెలెన్ ని వెనక్కి తెచ్చుకుందామని ప్రయత్నిస్తాడు. ఆ రాయబారం విఫలం అవుతుంది. ఇది సంగ్రామానికి నాంది అవుతుంది.

రాయబారం విఫలం అవడంతో హెలెన్ వివాహాన్ని రక్షిస్తానని మాట ఇచ్చిన ఆగమేమ్నాన్ ని మాట నిలుపుకోమని మెనలావూస్ అడుగుతాడు. అప్పుడు మెసినాయి కి రాజు అయిన ఆగమేమ్నాన్ గ్రీకు యోధులని సమకూర్చుకుని, వెయ్యి పడవల బలగంతో ట్రోయ్ మీదకి దండయాత్ర చేసి, నగరాన్ని ముట్టడించి, నగరాన్ని పదేళ్ళపాటు దిగ్బంధం చేస్తాడు. ఈ

ఘోరమైన యుద్ధంలో అఖిల్లీస్ (Achilles), ఏజాక్స్ (Ajax) వంటి గ్రీకు యోధులు, హెక్టర్ (Hector), పేరిస్ (Paris) వంటి ట్రోయ్ యోధులు వీరస్వర్గం పొందుతారు.

యుద్ధంలో పేరిస్ మరణించిన తరువాత హెలెన్ అతని అన్నదమ్ముడైన డియఫోబస్ ని పెళ్లి చేసుకుంటుంది. ట్రోయ్ నగరం పతనమైపోయిన తరువాత డియఫోబస్ ని వదిలేసి తిరిగి మెనలావూస్ తో కలిసి స్పార్టా వచ్చేసి శేష జీవితం గడుపుతుంది.

యుద్ధం ముగిసిన తరువాత ఒడీసియస్ (యులిసిస్) తిరుగు ప్రయాణం చేసి ఇతకా చేరుకుందికి పదేళ్లు పడుతుంది. ఈ తిరుగు ప్రయాణంలో ఒడీసియస్ ఎదుర్కొన్న సవాళ్ళని హోమర్ తన రెండవ గ్రంథం "ఆడెస్సి" లో వర్ణిస్తాడు.

"ఆడెస్సి" రూఢ్యర్థం మహా ప్రస్థానం.

"ఇలియాడ్" రూఢ్యర్థం కష్టకాలం.

సా .శ. పూ .1 వ శతాబ్దంలో రోమ్ కి చెందిన కవి వర్జిల్ "ఎనియాడ్" (Aeneid) అనే గ్రంథంలో యుద్ధం ముగిసిన తరువాత కొందరు గ్రీకు యోధులు, ఎనియస్ (Aeneas) నేతృత్వంలో సముద్రం దాటుకుని ప్రస్తుతం టునీషియాలో ఉన్న కార్తేజ్ (Carthage) వచ్చి, అక్కడ నుండి ఇటలీ వచ్చి, రోమ్ నగరం స్థాపనకి కారణభూతులు అవుతారని చెబుతాడు. హోమర్ రెండవ గ్రంథం "ఆడెస్సి", వర్జిల్ రాసిన "ఎనియాడ్" సమాంతర గ్రంథాలు; ఆడెస్సి లో ఒడీసియస్ (యులిసిస్) కథానాయకుడు అయితే ఎనియాడ్ లో ఎనియస్ కథానాయకుడు అయినప్పటికీ రెండింటిలో కథలు మాత్రం ఒకటి కాదు.




పాశ్చాత్యులు హోమర్ రాసిన "ఇలియాడ్" (Illiad), "ఆడెస్సి" (Odessy) లతో వ్యాసుడు రాసిన భారతాన్ని పోలుస్తారు. కేవలం ఉపరితలం మీద కొన్ని పోలికలు కనిపించవచ్చేమో కానీ లోతుగా పరిశీలిస్తే రెండిటి మధ్య చాల తేడాలు ఉన్నాయి. భారతం మీద, హిందూ పురాణాల మీద వ్యాఖ్యానాలు చేసిన అనేక పాశ్చాత్యులు (ముఖ్యంగా, మేక్స్ ముల్లర్ ప్రభృతులు) గ్రీకు పురాణ గాథల వల్ల ప్రభావితులై, గ్రీకు పురాణ కాలపు పట్టకం ద్వారా చూస్తూ చేసేరు తప్ప స్వతంత్రమైన దృక్పథంతో చేసినవారు కారెమో అని నా అభిప్రాయం.

భారత యుద్ధానికి మూల కారణం దుర్యోధనుడికి ఉన్న అసహనం, ఈర్ష్య, అసూయ కారణాలు అనుకోవచ్చు. ట్రోయ్ యుద్ధం దేవతల చెలగాటాల వల్ల జరుగుతుంది. ట్రోయ్ యుద్ధంలో మానవులు దేవతల చేతిలో కేవలం పావులు. రెండు యుద్ధాలూ రాయభారాలు విఫలం అయిన తరువాతే జరుగుతాయి. యుద్ధం వద్దని పదేపదే చెప్పిన పెద్దలు రెండు కథలలోను ఉన్నారు. ట్రోయ్ యుద్ధంలో సైనికులు వాడిన ఆయుధాలు మన ఊహకి అందుతాయి. భారతంలో కనబడే అస్త్రాల వెనక ఉన్న సాంకేతిక నైపుణ్యం మనకి ఇప్పటికీ లేదు. రెండు కథలలోను దేవతల అదృశ్య హస్తం కనిపిస్తూనే ఉంటుంది; ట్రోయ్ యుద్ధంలో ప్రత్యక్షంగా కనిపిస్తుంది, భారత యుద్ధంలో పరోక్షంగా ఉంటుంది.

# ప్రేమంటే ఇంతే



(గతసంచికతరువాయి)

ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

రుక్మిణి ప్రక్కనే వున్న కమల, సౌజన్య వీళ్ళిద్దరి మాటలూ విని ముసుముసిగా నవ్వుతున్నారు.

“బావగారు ఇవాళ డిఫరెంట్‌గాను, స్మార్ట్‌గాను కనబడుతున్నారు” అని వేళాకోళంగా అంది కమల .

కమలకి వంత పాడుతూ “అవును బావగారు ఇవాళ చాలా స్మార్ట్‌గా కనబడుతున్నారు, ఐ థింక్ దేర్ మస్ట్ బి సంథింగ్”.

అక్కడికి వచ్చిన మురళి ఆ మాట విని “మా అన్నయ్య ఎప్పుడూ స్మార్ట్ గానే వుంటాడు, వాడికేమి వాడు బిగ్ బాస్” అన్నాడు... కృష్ణమోహన్‌కి కుటుంబసభ్యులు పెట్టిన ముద్దుపేరు అది.

“ఏముందీ! లావణ్య పెళ్ళి అది స్పెషల్ కాదా?” వాళ్ళిద్దరూ అనురాధని ఉద్దేశ్యించి అంటున్నారని అర్ధమయినా, వాళ్ళ నుండి తప్పించుకుందికి అలా అన్నాడు కృష్ణమోహన్.

“అది మన అందరికీ స్పెషల్, కాని మీకు సంబంధించినంత వరకు ఇంకేదైనా వుందా? అది చెప్పండి” అన్నారు కమల, సౌజన్య. ఈ సంభాషణ అంతా నిశ్శబ్దంగా వింటూ కృష్ణమోహన్ వంక చూస్తూ ముసి ముసి నవ్వులు నవ్వుతూ కాఫీ కలపడానికి లోపలికి వెళ్ళింది రుక్మిణి. ఈ చర్చకి ఇక్కడితో ఫుల్ స్టాప్ పెట్టాలి, లేకపోతే వీళ్ళిలాగే ఆట పట్టిస్తూ సరదాగా అన్న ఇచ్చారు.

“మీ ఇద్దరికీ నాతో వేళాకోళం ఆడే హక్కు వుంది, సో డోంట్ వర్రీ, ఫర్‌గెట్ ఇట్ ఎండ్ బి చీర్‌ఫుల్” వాళ్ళిద్దరి మనసు నొచ్చుకోకూడదని అలా అన్నాడు.

రుక్మిణి కాఫీ తీసుకొచ్చి ఇస్తూ “ఏమిటండి! వాళ్ళిద్దరిని అలా బెదరగొట్టేసారు! కమలతో ఈ కాఫీ మీ బావగారికి ఇచ్చిరా అంటే, అయ్యబాబోయ్ బావగారి దగ్గరికి కాస్సేపు పోయేదాకా మేము వెళ్ళం అన్నారు”

కాఫీ నెమ్మదిగా తాగుతూ “అప్పుడే విషయం తమరికి తెలిసిందన్నమాట, నీ వల్లే రాధ విషయం వాళ్ళకి తెలిసి వుంటంది” అని ముద్దుగా రుక్మిణి మీద కోపం చూపించాడు కృష్ణమోహన్.

“నాకు తెలుసు మీరు నన్నే అంటారని కాని వీళ్ళకి సుజాత వదినగారి ద్వారా తెలిసింది. ఆవిడ మీద ఫిర్యాదు చేయడం కాదు గాని, ఆవిడ ఈ విషయం పనిగట్టుకొని ప్రచారం చేస్తున్నాది” అని నిన్న రాత్రి జరిగిన విషయం, నరహరిగారు సుజాతని మందలించడం అన్ని చెప్పింది.

“ఓహ్! అలాగా, ఇంత వ్యవహారం జరిగిందా! సరే అక్కయ్య రానీ, ఒక ఆట ఆడిద్దాము”

“చూడండీ, నిన్న చిన్నమామయ్యగారు నా ముందు, రాధ ముందూ మందలించడం ఆవిడ చాలా అవమానంగా భావించి నామీద, రాధమీద పీకల దాకా కోపంతో వున్నారు. నిన్న రాత్రి నుండే ఆవిడ ప్రచారం మొదలుపెట్టింది, ఇప్పుడు మీరు ఆట ఆడించడం మొదలుపెడితే ఇక ఆవిడ నన్ను, రాధని కబాడీ ఆడుకుంటుంది. మీకేం మీరు మగవాళ్ళు, బయట పనులలో బిజీగా వుంటారు, మేము ఇంట్లోనే వుంటాము అందుకని మా పరిస్థితి కాస్త ఆలోచించి, మా మీద దయ ఉంచి వదినగారిని ఏమీ అనకండి”

“బాబయ్య మందలిస్తే మీ ఇద్దరి మీద కోపం ఎందుకు? మీరేం చేసారు” అమాయకంగా అడిగాడు కృష్ణమోహన్.

“ఏమిటండీ అంతా తెలిసి కూడా అలా అడుగుతారు, ఆవిడకి కారణం వుండాలేమిటి? ఏదోలాగ అవతలి వాళ్ళని పరాభవించటమే ఆవిడ సిద్దాంతం. నిన్న రాత్రి రాధతో మాట్లాడుతూ ఆవిడ రావడం నేను గమనించలేదు, అరగంట తరువాత పలకరించాను అదీ నేను చేసిన తప్పు. రాధ విషయాన్ని ఆయుధంగా చేసుకొని నాకు రాధకి మధ్య

గొడవ పెట్టి వేడుక చూద్దామని అనుకుంటున్నారు ఆవిడ ఇప్పటికైనా అర్ధం అయిందా?" విడమర్చి చెప్పింది రుక్మిణి.

"ఓహ్ గాడ్ ! అదా సంగతి, నువ్వు వర్రీ అవకు అలాంటిదేమి జరగకుండా నేను చూసుకుంటాను"

"ఆహా! ఏమీ అర్ధం కానట్లు ఎంత అమాయకత్వం నటిస్తున్నారు, అంతా నా చేత వాగిద్దామని. కృష్ణమాయ"

"అవును బసంతీ" అన్నాడు కృష్ణమోహన్ రుక్మిణిని ఉడికిస్తూ.

********

తొమ్మిదిన్నర కల్లా అందరూ కాఫీ, ఫలహారాలు పూర్తి చేసి మైన్ హాల్లోకి వచ్చారు. అక్కడ పెళ్ళికూతురిని చేయడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు ఆడవారు సిద్ధం చేసారు. వీడియో, సన్నాయి మేళం వాళ్ళు కూడా వచ్చారు. వచ్చిన అతిథులని పలకరించి సాదరంగా ఆహ్వానిస్తున్నారు వైదేహి, సత్యనారాయణ. చైతన్య, సుధ కారు దిగి వస్తూ "మామయ్యా, అత్తయ్యా బాగున్నారా" అని సత్యనారాయణ దంపతులను పలకరించారు

"బాగున్నాము, మీరెలా వున్నారు, ప్రయాణం బాగా జరిగిందా? రండి ముందు టిఫిన్ పూర్తి చేసేయండి, ముహూర్తానికి ఇంక అరగంటే టైం వుంది" అన్నారు సత్యనారాయణ దంపతులు.

వాళ్ళు టిఫిన్ చేస్తూ వుండగా కృష్ణమోహన్ దంపతులు అక్కడికి వచ్చారు "చైతు, సుధా ఈ అంకుల్ పేరు కృష్ణమోహన్, ఆంటీ పేరు రుక్మిణి. ఈయన వైదేహి అత్తయ్యకి తమ్ముడు, ఈ అంకుల్ నేను మీ మామయ్యలూ, పెద్ద అత్తయ్య అందరం మంచి స్నేహితులము. ఈయన కాకినాడలో చదువుకునేటప్పుడు, ఆ తరువాత హైద్రాబాద్‌లో ఉద్యోగం చేసేటప్పుడు మేమంతా కలసి సరదాగా గడిపే వాళ్ళం" అని పిల్లలకి పరిచయం చేసింది అనూరాధ. వాళ్ళిద్దరూ ఏం చదువుతున్నారో అడిగి వారి గురించి తెలుసుకుని చైతన్య రాధ లాగ, సుధ ప్రకాష్ లాగ వున్నారు అనుకున్నాడు కృష్ణమోహన్.

"అంకుల్ మిమ్మల్ని చూడడం ఇదే మొదటిసారి కాని మీ పేరు వీళ్ళందరి నోటా చాలా సార్లు వినడం వలన మీతో ఎన్నో ఏళ్ళుగా పరిచయం వున్నట్లు అనిపిస్తున్నాది. మీ అనుమతితో ఒక మాట చెప్పాలని వుంది, అదేమిటంటే మీ జోడి మీ పేర్లు లాగానే చాలా క్యూట్‌గా 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' లా వున్నారు" అన్నాడు చైతన్య.

"ఏయ్ చైతు! ఏమిటది పెద్దవాళ్ళలాగ ఆ మాటలేమిటి?" అంది అనూరాధ.

"థాంక్యూ చైతు, ఏయ్ రాధా! ఎందుకు అతనిని మందలిస్తావు, అతను అనకూడని మాటలేమి అనలేదుగా, అతని అభిప్రాయాన్ని అతను నిర్మొహమాటంగా చెప్పాడు నీ పోలికే" అన్నాడు కృష్ణమోహన్.

రాజేశ్వరరావు, సుధ, చైతన్య టిఫిన్ పూర్తి చేసి వాష్ రూంకి వెళ్ళారు, అనూరాధ, కృష్ణమోహన్ మిగిలారు.

"వాడసలే వాగుడు కాయ, నువ్విలా సమర్ధిస్తే వాడు నెత్తికెక్కి నా మాట అసలు వినడు" అంది అనూరాధ.

"అబ్బ ఛా, మరి తమరు మీ నాన్నగారి సపోర్ట్ తీసుకొని..." అని మధ్యలో ఆపేసాడు కృష్ణమోహన్.

"ఏం ఆపేసావేమి, పూర్తి చెయ్యి" అంది అనూరాధ.

"వద్దులే రాధా, అవన్నీ ఇప్పుడు మాట్లాడు కోవడం సబబు కాదు"

"కృష్ణా, కొన్ని విషయాలు ఎప్పటికి మరచిపోలేము. వాటిని మనం పంచుకుంటేనే మనసుకి తృప్తిగా వుంటుంది, మనసు తేలిక పడుతుంది"

"సరేలే, పిల్లలు వస్తున్నారు. సమయం, సందర్భం వచ్చినపుడు తప్పకుండా పంచుకుందాము"

పది గంటల పదహారు నిమిషాలకి లావణ్యని పెళ్ళికూతురిని చేసారు. ఆ కార్యక్రమం పూర్తి అయిన తరువాత కాస్త విశ్రాంతి దొరికింది. ఆ సమయంలో కృష్ణమోహన్ రుక్మిణి అనూరాధని పిలిచి "నీ ప్రోగ్రాం ఏమిటి, నీ తిరుగు ప్రయాణం ఎప్పుడు" అని అడిగారు.

"రేపు పెళ్ళి అయిన తరువాత, ఎల్లుండి మధ్యాహ్నం నాన్నగారు, అమ్మ లావణ్యతో బాటు మగ పెళ్ళివారితో కలిసి కొత్తపేట వెళుతున్నారు. ఇరవైనాల్గవ తేదీన విజయనగరంలో ఒక ఫంక్షన్‌కి పెద్ద అన్నయ్య, వదిన వెళుతున్నారు. నన్నూ రమ్మన్నారు కానీ నేను వెళ్ళను, అందుకని నేను ఇక్కడే వుంటాను, ఆ రోజు రాత్రి అన్నయ్య నన్ను వాళ్ళింటికి

తీసుకు వెళతాడు. ఇరవైఅరున గోదావరిలో మా ప్రయాణం" అని వివరంగా చెప్పింది అనూరాధ.

“మీ పిల్లలు మీతోనే తిరిగి వెళతారా?” అని రుక్మిణి అడిగింది.

“లేదు, ఇరవైమూడు కోణార్క్‌లో వెళతారు” అంది అనూరాధ.

“సరే, నువ్వు పిల్లలికి సెండ్ ఆఫ్ ఇచ్చిన తరువాత మా ఇంటికి వచ్చేయి, ఇరవైనాల్గవ తేదీన మా ఇంట్లో మా ఆతిధ్యాన్ని స్వీకరించి మమ్మానందింపజేయగోరుతున్నాము" అన్నాడు కృష్ణమోహన్.

"వద్దులే, ఈ సారి వచ్చినపుడు తప్పకుండా వస్తాను"మొహమాట పడుతూ అంది అనూరాధ

"అలా అనకండి, మా పెళ్ళయిన ఇన్నేళ్లలో మీరు ఇక్కడికి రావటం మొదటి సారి చూసాను. మళ్ళీ ఎప్పుడు వస్తారో? మీరు మొహమాట పడుతున్నట్లున్నారు, మీ ఇంటికి మీరు వస్తున్నారనుకోండి, తప్పకుండా రండి" అంది రుక్మిణి.

"ఎందుకు అనవసరంగా శ్రమ పడతారు, అసలే మీ ఆరోగ్యం సరిగా లేదని వదిన చెప్పింది" అంది అనూరాధ.

"ముందు ఆ ‘మీరు’ అని సంబోధించడం మానేస్తే అప్పుడు మనిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. ఇదే మీ స్వంత చెల్లెలు ఇంటికైతే ఇలాగే రాకుండా వెళిపోతారా?" చనువుగా అడిగింది రుక్మిణి.

"కృష్ణా రుక్మిణీదేవికి బాగానే తర్ఫీదు ఇచ్చినట్టున్నావు, నీ ప్రభావం కనబడుతున్నాది మాటలతో కట్టి పడేస్తున్నాది" అంది అనూరాధ.

"చూడండి, నేను నారీ నారీ నడుమ మురారీ కాదలుచుకోలేదు, మీరిద్దరూ ఒక మాట మీదకు వస్తే నాకు సంతోషం" అని చమత్కరించాడు కృష్ణమోహన్.

"ఎంతైనా శ్రీ కృష్ణులవారి రాజకీయల దగ్గర మేమెంత" అని కౌంటర్ ఇచ్చింది రుక్మిణి.

"అక్షర సత్యం రుక్మిణిగారు, సారీ రుక్మిణి" అని అంది అనూరాధ.

"మొత్తానికి ఇద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చారు, రాధ మంచి పిల్ల" అన్నాడు కృష్ణమోహన్.

"రుక్మిణి చెడ్డపిల్ల అన్నమాట" అంది రుక్మిణి కృష్ణమోహన్‌ని ఏడిపిస్తూ.

"నాయనా గోకులనందనా, పదహారు వేలమందితో ఎలా నెట్టుకొచ్చావయ్యా?" అని కృష్ణమోహన్ సరదాగా అనగానే ముగ్గురూ నవ్వు కున్నారు.

"సరే ఎల్లుండి రాత్రి పిల్లల్ని బండి ఎక్కించి నిన్ను మా ఇంటికి తీసుకెళతాము" అన్నాడు కృష్ణమోహన్.

"మీ ఇష్టం" అంది అనూరాధ.

"థాంక్యూ" భార్యాభర్తలిద్దరూ ఒకే సారి అన్నారు.

వంశీ వచ్చి "అమ్మా మామ్మగారు నిన్ను పిలుస్తున్నారు" అన్నాడు. రుక్మిణి లోపలికి వెళ్ళింది.

"అయ్యా గోపాలకృష్ణగారు, ఏమిటి నారీ నారీ నడుమ మురారీనా, నీకసలు సిగ్గుందా? మీ ఆవిడ ముందు అలా జోకులేస్తే ఆవిడ ఏమనుకుంటుంది?" అంది అనూరాధ కృష్ణమోహన్‌తో.

"తను అలా అనుకునే మనిషి కాదు, విన్నావుగా తన కౌంటర్. నన్ను అర్థం చేసుకునే మనిషి నా భార్య కావటం నా అదృష్టం రాధా, రుక్మిణి కూడా మంచి పిల్ల" అన్నాడు కృష్ణమోహన్.

"ఇలాగే మంచి పిల్ల అని నన్ను అప్పుడు మాట్లాడనియ్యలేదు, ఇప్పుడు రుక్మిణి మీద కూడా అదే మంత్రం వేసావు నిజంగా నీది కృష్ణ మాయే. కాని ఒక్క విషయం, రుక్మిణి లాంటి ఉత్తమురాలు, సంస్కారవంతురాలు నీకు భార్యగా రావడం నాకు చాలా సంతోషంగా వుంది" అంది అనూరాధ.

"హలో మేడం, మళ్ళీ మునగ చెట్టు ఎక్కిస్తున్నారు"

"ఎంత మాత్రం కాదు, ఇదే మాట నిన్న రుక్మిణితో కూడా అన్నాను, ఈ మాట హృదయం లోంచి వచ్చిన మాట" అని నిన్న రుక్మిణితో జరిగిన సంభాషణ గురించి చెప్పింది.

"మీ పొగడ్తకి ధన్యవాదములు" అన్నాడు కృష్ణమోహన్.

మధ్యాహ్నం భోజనాలు అయిన తరువాత కృష్ణమోహన్, అనూరాధ, రాజేశ్వరరావు, కవిత కూర్చుని ఒక రెండు గంటలు వాళ్ళంతా గత స్మృతులని నెమరు వేసుకుంటూ అడ్డాట ఆడుకున్నారు.

సాయంత్రం సత్యనారాయణ దంపతులు కృష్ణమోహన్ రుక్మిణిలను పిలిచి "మీరిద్దరూ కూడా మా పిన్ని, బాబయ్యలతో బాటు

లావణ్యతో మనుగుడుపులకి కొత్తపేట వెళ్ళాలి" అన్నాడు సత్యనారాయణ.

కృష్ణమోహన్‌కి వాళ్ళతో వెళ్ళడం ఇష్టం లేదు. ఒకప్రక్క తను, రుక్మిణి ముమ్మడివరం వెళ్ళి అత్తగారిని చూసిరావాలి, మరో ప్రక్క రాధని ఇరవైనాల్గవ తేదీన తమ ఇంటికి రమ్మని పిలిచారు. అందుకని ఏం చెయ్యాలా అని కొంచం ఆలోచించి "బావగారూ నేను రిలీవ్ అయే లోపల ముమ్మడివరం వెళ్ళి అత్తగారిని చూసి రావాలి, ఇంకా బొంబాయి వెళ్ళే లోపల చాలా పనులు చక్కబెట్టాలి నాకు సెలవుకి ఇబ్బంది వుంటుంది అందుకని నాకు అవదు, అన్యథా భావించకండి. పెద్ద వాళ్ళు వెళితే బాగుంటుంది అందుకని పిన్ని, బాబయ్యని పంపండి, అపుడు బేలన్స్ అవుతుంది" లౌక్యంగా నవ్వుతూ అన్నాడు.

"అది కాదురా మీరిద్దరు రావాలని లావణ్య పట్టుబడుతున్నాది, మీరు వెళితే దానికి కాస్త సదుపాయంగా వుంటుంది" అంది వైదేహి.

"వదినగారు బహుశా నాకు వీలు పడకపోవచ్చు, నాకు ఆటంకం రోజులు నేను ఇప్పటికే పోస్ట్‌పోన్‌మెంట్ టేబ్లెట్స్ వాడుతున్నాను. పరవాలేదు చిన్న అత్తయ్యగారి దగ్గర లావణ్యకి చనువుంది. మురళి, సౌజన్యలని కూడా పంపుదాము. లావణ్యకి సౌజన్యకి మూడేళ్ళే వయసు తేడా వుండటం వలన వాళ్ళిద్దరూ చాలా సన్నిహితంగా వుంటారు. అవసరం అయితే సౌజన్యతో మనసువిప్పి ఏ విషయాన్నైనా లావణ్య చెప్పగలదని నా ఉద్దేశ్యం. మురళిని పంపితే కుర్రాడు కనుక ఏదైన మార్కెటింగ్ అదీ అవసరమైతే అందుబాటులో వుంటాడు. అందుకని నేను లావణ్యతో మాట్లాడుతాను, నచ్చ చెబుతాను." అంది రుక్మిణి.

"సరే మేము మురళి, సౌజన్యలతో మాట్లాడతాము, మీరిద్దరూ లావణ్యతో మాట్లాడండి" అన్నారు సత్యనారాయణ దంపతులు.

సాయంత్రం కొంచెం వీలు చేసుకొని కృష్ణమోహన్, రుక్మిణి మార్కెట్‌కి వెళ్ళి అనూరాధ కోసం ఒక చక్కటి చీర, జాకెట్‌గుడ్డ కొన్నారు. రాధకి తన గుర్తుగా ఏదైనా మంచి వస్తువు కొని కానుకగా ఇవ్వాలని వుంది కృష్ణమోహన్‌కి, కాని రుక్మిణి ఎలా అర్థం చేసుకుంటుందో అని ఆలోచిస్తున్నాడు. శ్రీవారు ఏదో ఆలోచనలో వున్నారని గ్రహించి "ఏమిటి ఆలోచిస్తున్నారు" అని అడిగింది. చెప్పటానికి మొహమాట పడి "ఏమీ లేదు" అన్నాడు.

"పరవాలేదు చెప్పండి"

"సరే చెబుతాను, ఆ తరువాత నన్ను తప్పుగా అర్థం చేసుకోకు, ఆట పట్టించద్దు" అని తన మనసులో ఉద్దేశ్యాన్ని చెప్పాడు కృష్ణమోహన్.

"రాధని మన ఇంటికి రమ్మని పిలుద్దామని సూచించింది నేను, లాంగ్ డ్రైవ్‌కి అన్నవరం వెళ్ళమని సలహా ఇచ్చింది నేను, అలాంటప్పుడు నేను ఈ విషయంలో తప్పుగా అనుకుంటానని ఎలా అనుకున్నారు? అంటే మీరు నన్ను ఇంకా పూర్తిగా విశ్వాసంలోకి తీసుకోలేదని అనుకోవాలా?"

"అలా అని కాదు రుక్కూ, 'ఎంత భార్య, కొడుకు, తల్లి, తండ్రి, ఆత్మీయులయినా అన్ని విషయాలూ నిర్మొహమాటంగా చెప్పలేము, కొన్ని మొహమాటాలు వుంటాయి'. అదీగాక అప్పుడు అలా సలహా ఇచ్చావని నేను అన్ని విషయాలలోని నా ఇష్టం వచ్చినట్లు నిర్ణయం తీసుకొని నువ్వు ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చెయ్యకూడదు కదా" అన్నాడు కృష్ణమోహన్.

"సరే నాకేమి ప్రెజంట్ ఇస్తారు" అని కొంటెగా అడిగింది రుక్మిణి.

"నీది కానిదేది లేదు నాలో, నిజానికి నేనున్నది నీలో" అని పాట పాడి "నీకు నేనే పెద్ద ప్రెజంట్" అన్నాడు.

"మాటలతో ఎదటి వాళ్ళని మాయ చేస్తారు మీతో గెలవలేము" అంది రుక్మిణి.

షాప్‌లో ఒక అందమైన రాధాకృష్ణుల విగ్రహాన్ని రుక్మిణి సెలెక్ట్ చేసింది, కృష్ణమోహన్‌కి కూడా బాగా నచ్చటం వలన వెంటనే గిఫ్ట్ పేక్ చేయించారు.

********

మగ పెళ్ళివారు మర్నాడు ఉదయం ఆరు గంటలకే వస్తున్నందున సాయంత్రమే అన్ని సామాన్లు కల్యాణమండపాని-

కి చేరవేసారు. రాత్రి భోజనాలు అయిన తరువాత అందరూ అక్కడికే వెళ్ళి బస చేసారు.
ఉదయం ఐదున్నరకల్లా పెళ్ళి-వారందరు తయారయి మగ పెళ్ళివారి రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఆ హడావిడి అంతా చూసి "పెళ్ళంటే ఇంతేగదా పెళ్ళి కొడుకుకి, పెళ్ళి కూతురికి అది ఒక మధురమైన అనుభూతి, మరపురాని రోజు, జీవితమంతా ఆ తీపి గుర్తులు పదిలంగా దాచుకునే ముఖ్యమైన ఘట్టం. మిగతా వాళ్ళందరికి చాలా కాలానికి కలుసుకొని బంధు-మిత్రులు, స్నేహితులు, అస్మదీయులు, తస్మదీయులు అంతా కలిసి సృష్టించే హడావిడి, గందరగోళం, సరదాగా గడపడానికి అది ఒక వేదిక" అనుకున్నాడు కృష్ణమోహన్.
మగ పెళ్ళివారి బస్సు వచ్చింది. ఒక్కసారిగా కోలాహలం మొదలైంది. మగపెళ్ళి వారందరికీ మేళతాళాలతో స్వాగతం పలికారు సత్యనారాయణ, వైదేహి, చంద్రం, కమల. మొదట పెళ్ళి కొడుకుకి, అతని తల్లికి కుంకుమ బొట్టు పెట్టి, హారతి ఇచ్చింది వైదేహి. మిగతా ముత్తైదువులకి రుక్మిణి, కమల, సుజాత బొట్టు పెట్టి స్వాగతం పలికారు.
మగపెళ్ళి వారిలో తొంభై శాతం మంది కోనసీమ వారు కావడంతో అక్కడ ఒక్కసారి కోనసీమ యాస, కోనసీమ వాతావరణం వెల్లివిరిసింది. కృష్ణమోహన్ ఆ హడావిడి చూసి రుక్మిణి ప్రక్క తిరిగి ఓ చిరునవ్వు నవ్వాడు. ఎందుకంటే కృష్ణమోహన్ రుక్మిణిని కోనసీమ హడావిడి గురించి అప్పుడప్పుడు ఆట పట్టిస్తూ వుంటాడు.
...ఒకసారి వాళ్ళ పెళ్ళైన కొత్తలో కృష్ణమోహన్, రుక్మిణి ఇద్దరు అమలాపురం నుండి రాజమండ్రి ఎక్స్‌ప్రెస్ బస్సులో వస్తున్నారు. రావులపాలెంలో ఒక గ్రామీణ యువతిని ఆమె భర్త ఆ బస్సు ఎక్కించాడు. ఆ యువతి బస్సు కండక్టర్‌తో "కండక్టర్‌గోరు కడుపులంకకి ఒక టికట్ ఇవ్వండి" అని అడిగి డబ్బులు ఇచ్చింది. వెంటనే కండక్టర్ టికట్ ఐదు రూపాయలు, ఉంకో మూడు రూపాయలియ్యి అని అడిగాడు. వెంటనే ఆ యువతి బయటకు తొంగి చూసి "మావోయ్! టికట్ ఐదు రూపాయలంట, ఉంకొ మూడు రూపయలియ్యి" అని తన భర్తని అడిగింది. ఆమె భర్త వెంటనే "రెండు రూపాయల బస్సు ఎక్కిస్తాను దిగిపో" అన్నాడు. ఆ అమ్మాయి బస్సు దిగిపోయింది, కండక్టర్ "దిగు, దిగు భలే బేరం" అని విసుక్కు-న్నాడు. ఇదంతా కండక్టర్ వెనక సీటులో కూర్చున్న కృష్ణమోహన్, రుక్మిణికి ఏదో వినోద కార్యక్రమం చూసినట్లుంది. కృష్ణమోహన్‌కి ముందు ఇదేమిటి బస్సుకి సరిపడ డబ్బులివ్వకుండా బస్సు ఎలా ఎక్కించాడు అని చిరాకు కలిగింది.
"కడుపులంకఅనేవూరువుందా?" అని రుక్మిణిని అడిగాడు.
"కడుపులంక కాదు, ఆ వూరి పేరు కడియపులంక" అని రుక్మిణి చెప్పింది.
రాజమండ్రి స్టేషన్ రాగానే "పిల్లోయ్! రాజమంద్రి టేషన్ ఒచ్చేసింది దిగు" సరదాగా అన్నాడు రుక్మిణితో. అప్పటినుండి అప్పుడప్పుడు రుక్మిణిని ఆ యాస లో మాట్లాడి ఆట పట్టిస్తూ వుంటాడు. అందులో రుక్మిణి బంధువులు ఎవరైనా కోనసీమ నుండి వస్తే రుక్మిణికి ఇంక ఈ ప్రపంచంతో సంబంధం వుండదు, అటువంటి సమయంలో ఇలా ఏడిపిస్తూ వుంటాడు.
అంతవరకూ అందరితోనూ మామూలుగా మాట్లాడిన పెళ్ళి-కొడుకు తండ్రి కృష్ణమోహన్‌ని, రుక్మిణిని పరిచయం చేసేసరికి ఒక్కసారి ఆనందంగా "అమ్మా! నేనూ మీనాన్నగారి శిష్యుడినే, మాదీ కోనసీమే, మా వూరు కొత్తపేట. అక్కడ మీ నాన్నగారు పని చేసినపుడు ఆయన దగ్గర చదువుకున్నాను, ఉద్యోగరీత్యా విజయనగరంలో వుంటున్నాను. ఇప్పటికీ అటువెంపు వెళ్ళినపుడు మీ నాన్నగారిని కలుస్తూ వుంటాను. మీరు మా మేష్టారి పోలిక, మిమ్మల్ని చూస్తూవుంటే మా గురువుగారిని చూసినట్లుందమ్మా, మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకు చాలా ఆనందంగా వుంది" అని కృష్ణమోహన్‌తో కరచాలనం చేస్తూ "మీ గురించి చాలా విన్నాను. మీరు, మీ అన్నదమ్ములు మా వియ్యంకులుగారి కుటుంబానికి ఎప్పుడూ వెన్నంటి వుంటారని మా వియ్యంకుడు-

గారు చెప్పారు, చాలా సంతోషం. ఇలాంటి పెద్ద కుటుంబంలోంచి వచ్చిన అమ్మాయి మా కోడలుగా రావటం మాకు చాలా ఆనందంగా వుంది. అందులో ముఖ్యంగా మీరు మా నారాయణమూర్తి మేష్టారి అల్లుడు కావటం నాకు చాలా ఆనందాన్ని ఇస్తున్నాది" అన్నాడు.

ఆయన హడావిడి చూసి కృష్ణమోహన్‌కి కొంచెం మూడ్ వచ్చి "ఆయ్! మీతో పరిచయం అవటం, బంధుత్వం కలవటం మాకు చాలా ఆనందంగా వుందండి. మీరూ, మా బావగారూ ఇద్దరూ మా మామగారి శిష్యులవడం బ్రహ్మాండమైన ఆనందాన్ని ఇస్తున్నాదండి" అని నూటికి నూరుపాళ్ళు కోనసీమ యాసలో అన్నాడు.

కృష్ణమోహన్‌ని నియంత్రించడానికి రుక్మిణి అతనిని వెనకాలనుండి ఒక గిల్లు గిల్లింది. అతను వెనుకకు తిరిగి రుక్మిణి వంక ఏడవలేక నవ్వుతూ చూసాడు. "ఏమిటీ అల్లరి? తిక్క కుదిరిందా" అన్నట్లు కోపంగా ఓ చూపు చూసింది రుక్మిణి.

ఈ గిల్లటం తరువాత కోపంగా చూడటం ఎవరైనా చూసారేమో అని కృష్ణమోహన్ చుట్టుప్రక్కల వాళ్ళని గమనిస్తున్నాడు. అందరూ ఎవరి హడావిడిలో వాళ్ళు వున్నారు. అలా చూస్తూ వుండే సమయంలో అనూరాధ ప్రక్క చూసాడు. అనూరాధ అతని దగ్గరకి వచ్చి "మా కోనసీమని వెటకారం చేస్తావా? తిక్క కుదిరిందా? చాలా, నేనూ ఒకటి ఇవ్వనా?" అని చాలా నెమ్మదిగా అతనికి మాత్రమే వినబడేటట్లు అంది.

పెళ్ళి తంతు అంతా చాలా ఆహ్లాదకరమైన వాతావరణంలో సరదాగా ముగిసింది. మర్నాడు మధ్యహ్నం భోజనాలు చేసి రెండు గంటలకి మగ పెళ్ళివారు బస్సులో కొత్తపేట బయలుదేరారు. మురళి, సౌజన్య కూడా విశ్వనాధం దంపతులు, నరహరి దంపతులతో పాటు పెళ్ళికూతురికి తోడుగా కొత్తపేట వెళ్ళారు. రాత్రంతా మేలుకుని వుండటం వలన, మగపెళ్ళివారు వెళ్ళిన తరువాత ఆడపెళ్ళివారంతా ఒక రెండు గంటల పాటు విశ్రాంతి తీసుకుని మళ్ళీ తమ తమ పనులలో నిమగ్నమయ్యారు.

కల్యాణమండపం, కేటరింగ్ మిగతా వారందరికీ డబ్బులు చెల్లించి రాత్రి భోజనాలు అయ్యాక ఒకరి తరువాత ఒకరు వారి వారి ఇళ్ళకు బయలుదేరారు. సత్యనారాయణ దంపతులు అందరికీ బట్టలు పెట్టి సత్కరించారు.

"అక్కా, రాధ ఇప్పుడు మాతో మా ఇంటికి వస్తుంది, రేపు నేను రాజా వాళ్ళింట్లో దిగబెడతాను" అని వైదేహితో అన్నాడు కృష్ణమోహన్

వీళ్ళిద్దరూ ఇప్పటికే గతం తలచుకొని బాధపడుతున్నారు, ఇప్పుడు ఎమిటి చేస్తారో అని అనుకొని "ఒరేయ్ జాగ్రత్త!" గతం తలచుకుని మీరిద్దరూ కృంగి పోకండి, సరదాగా గడపండి" అంది వైదేహి.

"అలాగే"

రాజేశ్వరరావు, కవిత వైదేహి వద్దకు వచ్చి "వదినా, మేమింక బయలుదేరుతాము, చైతూని, సుధని కోణార్క్ ఎక్కించి అలా ఇంటికి వెళతాము. రేపు విజయనగరం వెళ్ళి సాయంత్రానికి వస్తాము" అన్నాడు రాజేశ్వరరావు.

"సుధా అండ్ చైతూ బెస్ట్ ఆఫ్ లక్ అండ్ హేపీ జర్నీ" అన్నారు రుక్మిణి, కృష్ణమోహన్.

"థాంక్యూ ఆంటీ, అంకుల్. హైదరాబాద్ వచ్చినపుడు మా ఇంటికి తప్పకుండా రావాలి"

"వదినా కృష్ణా వాళ్ళింటికి వెళుతున్నాను" అని అనూరాధ వైదేహితో చెప్పినపుడు, వైదేహి కృష్ణమోహన్‌తో చెప్పినట్లే జాగ్రత్త చెప్పి "రుక్మిణి చాలా ఉత్తమురాలు, తనకి మీ విషయాలు అన్నీ తెలుసు, నువ్వు తనతో నీ తోబుట్టువుతో వున్నంత చనువుతో వుండచ్చు" అని చెప్పింది.

"అలాగే వదినా, గతంలో నువ్వు రుక్మిణిని పొగుడుతూవుంటే ఏమో అనుకున్నాను, గత రెండు, మూడు రోజులనుండి ఆమెని దగ్గరనుండి చూసాను, నువ్వు చెప్పింది నూరు శాతం నిజం, ఆమె చాలా ఉత్తమురాలు. నువ్వు కంగారు పడకు, రెండు రోజులనుండి మీ అందరితో వుండటం వల్ల నా వేదన కొంత తగ్గింది" అంది అనూరాధ.

"వెళ్ళొస్తాము" అని చెప్పి కృష్ణమోహన్, మిగతా వారంతా బయలుదేరారు.

(ఇంకా వుంది)

# సనాతన (హైందవ) ధర్మంలో మహిళ



మత్స్యరాజ హరగోపాల్

'మాతృదేవోభవ' - వేదోక్తి, సనాతనహైందవ ధర్మంలో 'మహిళ' స్థానం మహోన్నతమైంది. మాతృగర్భం నుండి జననమొందిన మానవుడు, మరణంవరకు ఆయా ఆశ్రమాలలో మహిళలపై ఆధారపడుతూనే ఉంటాడు. సనాతన ధర్మంలో స్త్రీ మూర్తి లేని దేవుడు లేడు. ఉమామహేశ్వర, సీతారామ, రాధాకృష్ణ, లక్ష్మీనారాయణ, మొదలైనవి కొన్ని దృష్టాంతాలు మాత్రమే.... ప్రథమ దైవం తల్లి - ఇది మన ధర్మం. వేదకాలం నుండి నేటివరకు అనేకానేక రంగాలలో మహిళలు పురోగమిస్తూనే ఉన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక 'స్త్రీ' ఉంటుందనేది నిర్వివాదాంశం.

శ్రీమద్ వాల్మికి రామాయణంలో సీతాపహరణంతో ప్రారంభమైన సీతారాముల విరహవేదన, ఒకరిపై మరొకరికి ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు బహురమ్యంగా వర్ణిస్తాడు మహర్షి వాల్మీకి అరణ్యకాండంలో. అక్కడితో ప్రారంభమై, సుందరకాండలో లంకలోని అశోకవనంలోని సీతా- హనుమత్ సంవాదం వారి అన్యోన్య దాంపత్యానికి దర్పణమ్ పడుతుంది. 'ఒకే బాణం... ఒకే పత్ని' - ఏకపత్నీవ్రతుడు శ్రీరాముడు - మర్యాద పురుషోత్తముడు... శ్రీమద్రామాయణం మనకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తుంది.

ఇక శ్రీమద్భాగవతంలో రాధాకృష్ణులు, శ్రీకృష్ణ, రుక్మిణీ సత్యభామల ఉదంతాలలో (రాసలీల, పారిజాతాపహరణం లాంటివి) రసవంతమైన ఘట్టాలు.

- '**యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః**' (మనుస్మృతి)

ఏక్కడైతే 'మహిళ' గౌరవింపబడుతుందో అక్కడ దేవతలు విహరిస్తారు. ఆ ఇల్లు కళకళలాడుతుంది. అక్కడే లక్ష్మీ - సరస్వతులు నడయాడుతారు. అది మన హైందవ ధర్మ భావన.

'**ముదితల్ నేర్వని విద్య యిటువలదే ముద్దార నేర్పింపగన్**' (పోతన భాగవతం) అంటాడు పోతనామాత్యుడు భాగవతంలో. ఇది వారి కుశాగ్రబుద్ధికి నిదర్శనమే.

బ్రహ్మచర్యంలో తల్లిపై ఆధారపడతాం. కని, పెంచి, పోషించి మనల్ని జ్ఞానవంతుల్ని చేస్తుంది తల్లి (మహిళ).

'**కుపుత్రో జాయతే క్వచిదపి కుమాతా న భవతి**' అందుకే మాతృప్రేమ మహోన్నతమైంది.

గృహస్థాశ్రమంలో అర్థాంగి, సహధర్మచారిణి, జీవన సహచరి మహిళ, భార్యగా మన జీవితంలో ప్రవేశిస్తుంది. సుఖదుఃఖాల్లో, ధర్మ, అర్థ, కామ, మోక్ష (చతుర్విధ పురుషార్థాల్లో) సాధనలో భాగస్వామి.

మన పిల్లలకు తల్లియై, కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తూ, సర్వవేళలా మనల్ని కనురెప్పలా కాపాడుతుంది మహిళ (భార్య) ఆ ఇల్లే బృందావనం. స్వర్గప్రేమ, అందుకే '**గృహిణీ గృహముచ్యతే**' - అన్నారు.

వివాహ వ్యవస్థ -

'**మాంగల్యం తంతునానేన మమజీవన హేతున**
**కంఠే భద్రాణి శుభదే తంజీవ శరదాంశ్శతమ్**'

**ధర్మేచ, అర్థేచ, కామేచ నాతి చరామి / నాతి చరితవ్యమ్**

ఇది సనాతన ధర్మం బోధించే సంస్కారయుతమైన జీవనము. అందుకే చతురాశ్రమాలలో గృహస్థాశ్రమం గొప్పదని పెద్దలు చెబుతారు. సంసార జీవనంలో భార్యా భర్తలిద్దరూ రెండు చక్రాల్లాంటివారు. ఏ చక్రం పనిచేయకపోయినా సంసారంలో కలతలు... జీవనయానంలో నవరసాలుండాలి.

'**శృంగార హాస్య కరుణా వీర రౌద్ర భయానకః**
**భీభత్స అద్భుత శాంతస్య నవ నాట్యే రసాస్మృతాః**'

అయితే అన్నీ సమపాళ్ళలో ఉండరాదు. కేవలం 'శృంగార-

హాస్య- కరుణ - శాంత అద్భుత' రసాలు సాత్విక రసాలు. మిగతావి రాజస తామసాలు. కాబట్టి సాత్వికరసాలు మాత్రమే గృహస్థ జీవనాన్ని నందనవనంలా, ఆహ్లాదకరంగా నిలబెడుతాయి.

**'పుత్రపౌత్ర వధూభాభ్యై రాకీర్ణ మసి సర్వతాః**
**భార్యా హీన గృహస్థస్య శూన్యమైన గృహం భవేత్**

పుత్ర పౌత్రాదులు, కోడళ్లు, కూతుళ్లు ఎందరున్నా గృహస్థ జీవనాలో భార్యతో సమానం కాదు. కాజాలదు. భార్య రహిత గృహం, ఇల్లు కాదు... ముఖ్యంగా గృహస్థాశ్రమంలో అర్థ-కామాలు 'పిల్లల పెంపకం తదితర బాధ్యతలతో తలమునకలై ఉన్న మనిషికి, వానప్రస్థంలో భార్యాభర్తలు ఒకరికొకరు జీవిస్తారు. జీవించాలి. జీవిత చరమాంకంలో ఒకరికొకరు తోడుగా నిలబడాలి. జీవన మధురస్మృతులు, కష్టసుఖాలు పంచుకుంటూ ఒకరికొరకు జీవించే, గడిపే వానప్రస్థాశ్రమం. మానవ జీవితంలో మధురం... ఇది ప్రకృతి మనకు ప్రసాదించిన వరం.

ఇటీవల కాలంలోని యువతీయువకుల్లో రాజస తామస రసాలు హెచ్చు స్థాయిలో ఉన్నందువల్లనేమో, గృహస్థ జీవనం మూణ్ణాళ్ళ ముచ్చటగా మారి, పెళ్ళిళ్ళు పెటాకులుగా మారుతున్నాయి - 'కామం' - శృంగారానికి పర్యాయపదంగా మారుతున్న సమాజంలో 'మహిళా' కేవలం భోగ్య వస్తువుగా మాత్రమే చూడబడడం.

**'కామాతురాణామ్- న భయం న లజ్జా'** అనే రీతిలో 'మనుష్య రూపేణ మృగాశ్చరంతి' అనేది నిత్య సత్యంగా మారడం చూస్తూనే ఉన్నాం. మనుష్య రూపంలో నున్న మానవ మృగాలవల్ల ఎందరో మహిళలు బలకావడం దురదృష్టకరం..... ఏనాడైతో స్వతంత్య భారతదేశంలో 'మహిళ' నడి రాత్రిలో కూడా ఒంటరిగా, నిర్భయంగా ఉండగలదో ఆనాడే నిజమైన స్వాతంత్ర్యం లభించినట్లు అంటారు మహాత్మాగాంధీ.

నేటి సమాజంలో మహిళలపై జరిగే అకృత్యాలు, మానభంగాలు, ఆమ్లదాడులు సభ్య సమాజం ఏనాడు హర్షించదు. ఇందుకు మన విద్యా వ్యవస్థలో మార్పు రావాలి. మానవీయ విలువలు, నీతివంతమైన ధార్మిక జీవన ఆవశ్యకత, మహిళలను గౌరవించడం లాంటి విషయాలు పాఠ్య ప్రణాళికలో భాగం కావాలి. ఇందుకు తల్లిదండ్రులు, అధ్యాపకులు, పాలకులు, సమాజంలోని అన్ని వర్గాలు తమ తమ పరిధిలో కృషిచేయాలి. ఆనాడే సనాతన ధర్మంలోని బోధనలను (మహిళాభ్యుదయం, మహిళా శ్రేయస్సు, సాధికారత గౌరవమైన స్థానంలాంటివి) మనం దర్శింపగల్గుతాము.


**'మాతృవత్ పరదారేషు - పరద్రవ్యేణ లోష్టవత్'** అన్న మహోన్నత బోధనలు నిజమవుతాయి.

**'ధర్మోహంలో యత్‌హంతి ధర్మోరక్షిత రక్షితా'**

ధర్మాన్ని రక్షిస్తే అది మనలను రక్షిస్తుంది.

ధర్మానికి హాని కల్గిస్తే అది సమాజానికి హాని చేస్తుంది. కాబట్టి సమాజంలో, సంసార జీవనంలో, నిత్యజీవనంలో మహిళలకు సముచిత స్థానం కల్పించడం. వారిని గౌరవించడం, ఆదరించడం సమాజ ధర్మం. బాధ్యత.

**'ఆనోభద్రః ఋతరో యంతు విశ్వతః'** (ఋగ్వేదం) అన్నట్లుగా అన్ని వైపుల నుంచి సద్భావనాలు మనలో ప్రసరాముగాక.... సనాతన ధర్మం వర్ధిల్లుగాక.


రచయితలకు
విజ్ఞప్తి

రచనలు పంపేవారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంపవలెను. అనువాదాలు స్వీకరించబడవు. ప్రచురణకు ఎన్నికకాని రచనలు తిరిగి పంపబడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వబడును.

- సంపాదకులు

# నవవిధ భక్తులు

ఆదూరి హైమవతి



## పాదసేవనం

నవవిధ భక్తిమార్గాలు-నాల్గవది

బామ్మచెప్పసాగింది."నవ విధ భక్తి మార్గాల్లో నాల్గవది పాదసేవ: దేవుని పాదములను పూజ చేస్తూ ఎంతో మంది మన పురాణాల్లో తరించారు తల్లీ!ముఖ్యంగా క్రియాశక్తి స్వరూపిణి, ధనానికి రూపమైన లక్ష్మీమాత నిరంతరం నారాయణుని పాదాలు వత్తుతూ ఎంత వారైనా ఎంత గొప్ప ధనికులైనా, విద్యావంతులైనా గొప్ప పదవుల్లో ఉన్నా వినయంగా భగవంతుని పాదాలను నమ్ముకుని ఉండాలని చెప్పటానికా అన్నట్లు లక్ష్మీమాత పాదసేవనం చేస్తుంటుంది.

అంతేకాదు తల్లీ గురువులకూ పాదసేవ చేయాలి, వారి అనుగ్రహం సంపాదించాలి. ఆది శంకరాచార్యుల శిష్యు డైన తోటకాచార్యులు, పద్మపాదుడు గురుసేవ వలన జ్ఞానసిద్ధి పొందారు. కనుక గురువును సేవించడం మన భారతీయ సంస్కృతిలో ఉందమ్మా! గురువే దైవంగా భావించాలి. దీనికి ఒక కథ చెప్తాను విను.

అనపర్తి అనే గ్రామంలో అనసూయమ్మ అనే ఒక పేద రాలు ఉండేది.ఆమెకు సోము అనే ఒక ఐదారేళ్ల కొడుకు ఉండేవాడు. ఆమెకు వాడిని బాగా చదివించి గొప్పవాడిని చేయాలనే అకోరిక ఉండేది.ఐతే ఆమె కడుపేదరాలు. తనకోరికను భగవంతుడే తీర్చాలని నిత్యం ప్రార్థించేది.

ఆమె అడవిలో మఱ్ఱి చెట్టునుండి ఆకులుకోసి తెచ్చుకుని విస్తళ్ళుకుట్టుకుని వాటిని చక్కగా కట్టలుకట్టి పక్కనే ఉన్న నగరంలో అమ్ముకుని ఆ సొమ్ముతో నూకలు కొని వాటితో తామిరువురి కడుపులూ నింపేది.

ఆమె అడవికి వెళ్ళేప్పుడూ, నగరానికి విస్తళ్ళు అమ్ముకు రాను వెళ్ళే ప్పుడూ, ఇంచుమించు రోజూ తన కొడుకును తీసుకెళ్లలేక



ఆఊర్లో చదువుచెప్పే పంతులు పరమేశ్వరయ్య ఇంటివద్దవాడిని కూర్చోబెట్టి "అయ్యా! కాస్త మావోడ్ని సూడండి బాబూ!ఊరికే వద్దు ఏదైన అచిన్న పనూ సేత్తాదయ్యా!" అనిచెప్పి వెళ్లేది.

దానికి బదులుగా ఆమె వారికి ఒక విస్తళ్ళ కట్ట ఇచ్చేది. ఊర్లో పంతులు గారి వద్ద చదువు నేర్చే వారంతా పంతులు గారికి ఏదో ఒకటి తెచ్చి ఇచ్చేవారు. పప్పులో, కూరలో, ధాన్యమో, వాటితో ఆయనా ఆయన భార్యా బతికేవారు. అందుకే అనసూయమ్మ ఆయనకు విస్తళ్ళ కట్ట ఇచ్చేది.

పంతులు గారు ఊర్లో వాళ్ళకు చెప్పే పాఠాలు, కథ లు, పద్యాలూ, శ్లోకాలూ వింటూ మంచి తెలివైన వాడైన సోము బాగా నేర్చుకోసాగాడు. రాత్రులు తల్లికి మంచి కంఠంతో పాడి పద్యాలూ పాటలూ వినిపించేవాడు. తల్లి వాడికి "సోమూ పంతులయ్య పాదాలొత్తయ్యా! పంతులు దేవు-

డు"అని చెప్పేది.

కొడుకు పాడే పాటలూ, పద్యాలూ నేర్పినందుకు అనసూయ-మ్మ పంతులు గారిపాదాలకు మొక్కేది. తల్లి పంతులు గారి పాదాలకు మొక్కడం చూసిన సోమూ తానూ పంతులు పాఠాలు చెప్తున్నంత సేపూ ఆయన పాదాలు ఒత్తుతూ, వింటూ ఉండేవాడు. వాడికి ఆరేళ్ళు నిండగానే పంతులు తన వద్ద ఉన్న ఒక పాత పలక ఇచ్చి వ్రాయడం, పాత పుస్తకాలు ఇచ్చి చదవడం నేర్ప సాగాడు.

సోము ఆయన భోజనం అయ్యాక మంచం మీద నడుం వాలిస్తే కాళ్ళ దగ్గరచేరి పాదాలు వత్తుతూ ఆయన నిద్రించేవరకూ పాద సేవ చేసేవాడు. పంతులు-గారి శ్రీమతి సరోజనమ్మ వాడు చేసే పనిచూసి ముచ్చటపడి సోముకు కడుపునిండా అన్నం పెట్టేది.

అలా వాడు పంతులుగా-రింటి బిడ్డగా మారిపోయాడు. పంతులు గారికి సంతానం లేదు. అందుకే వాడికి మిగతావారిలా కాక ఎక్కువ సమయం పాఠాలు బోధించే వారు. అలా వాడు గొప్ప పాండిత్యం సంపాదిం-చాడు. చూస్తుండగానే రోజులు, వారాలుగా నెలలుగా సంవత్స రాలుగా మారిపోయాయి.

పంతులుగారు సోము చదువు-మీద శ్రద్ధ ప్రతిభా చూసి వాడిని వెంట బెట్టుకెళ్ళి పట్నంలో వేద పాఠశాలలో చేర్పించారు. అక్కడ సోమూ వేదాలు నేర్పే పెద్ద పంతులు గారి పాదసేవ-చేస్తూ, ఆయన వద్దన్నా వినక పాదసేవలో ప్రేమను ప్రతిఫలం-గా పొంది, ప్రత్యేకంగా రాత్రులు సైతం సంస్కృతం, వేదాలూ నే-ర్చుకుని కాలం గడిచేకొద్దీ, గొప్ప వేద పండితునిగా ఘనాపాటిగా రూపొందాడు.

ఎవరినైనా వేదపాండిత్యంలో ఇట్టే గెలిచే సామర్థ్యం సంపా-దించాక, పెద్ద పంతులు పంపగా అక్కడి సంస్కృత కళాశాలలో అధ్యాపకునిగా నియమించ బడ్డాడు.

ఆరోజు అనపర్తి గ్రామంలో జాతర జరుగుతున్నది. ఎక్కడెక్కడి-వారో వచ్చారు. మూడురోజులు గంగమ్మ జాతర ప్రతి ఏడాదీ ఆ గ్రామానికి అంతా వచ్చే మూడు రోజులు వేడుకానూ.

గ్రామమంతా కళకళ లాడి పోతుంటుంది. ఒక పెద్ద పండితుడు గంగమ్మ జాతరలో ఒక రోజు ఉపన్యాసకుడి గా వచ్చాడు. అంతా బహు భక్తితో వింటూ ఉండగా ఆదిశంకరా-చార్యుల వారి గురించీ మాట్లా-డుతూ 'ఆ గొప్ప ఆచార్యుల వారి వద్ద ఉండే నలుగురు శిష్యులలో తోటకాచార్యులు అనే 'గిరి' అనే ఏమీ చదువురాని వాడి లాంటి వాడిని నేను, నాగురువైన ఈ ఊరి పంతులు పరమేశ్వరయ్యా-గారే నా గురువు నాపాలిటి శంక-రాచార్యుల వంటివారు" అంటూ ఉపన్యాసం ఆపి బల్ల దిగివచ్చి ముందు కూర్చునున్న పరమే-శ్వరయ్య గారి పాదాలకు మొక్కి "పంతులుగారూ ! నేనండీ మీ సోమును. సోమేశ్వరాచార్యగా పి-లువబడే నేనే.

మీ పాద సేవచేసుకుంటూ, అమ్మపెట్టిన బువ్వతింటూ మీ ఇరువురి ప్రేమతో పెరిగి ఇంత-వాడినయ్యాను " అంటూ వెనక్కు నడిచి పాత చీర కట్టుకుని ఉన్న తన తల్లి 'విస్తర్ల అనసూయమ్మ' గా పిలువబడే తల్లిని నడిపిస్తూ తెచ్చి అందరిముందూ నిలిపి "ఈ విస్తళ్ళ అనసూయమ్మే నా-మాతృమూర్తి, ఆమె ఆశీర్వచ-నం, ఆలోచన, పట్టుదల, ప్రో-త్సాహాలతో ఈరోజు ఇలా ఎదిగా నంటే అది పెద్దల పాదసేవనం వలన మాత్రమే" అని కంటినీరు తుడుచుకుంటూ,

"నేనూ అనుకున్నది, మాతల్లి కోరికా తీర్చే వరకూ తిరిగి ఈ ఊరు రాకూడదనే పట్టుదలతో ఈరోజున సోమేశ్వరాచార్యులు-గా పెద్దల ఆశీస్సులతో ఎదిగి మీ ముందుకొచ్చాను. నాతల్లినీ, సంతానం లేని పంతులు గారి దంపతులనూ నాతో నగరానికి తీసుకెళ్ళను వచ్చాను" అని చె-ప్పుండగా అంతా కరతాళ ధ్వనులు చేశారు."ఇదమ్మా! పాదసేవనం వలన లభించే ప్రతి ఫలం"అని ముగించింది బామ్మ.

# మా ఊరి నందుల ఆత్మీయ కథ



## నందుల ప్రభాకర శాస్త్రి

(గత సంచిక తరువాయి)

### రాజకీయ నాయకులు

రాజకీయ నాయకుడనగానే ఆ రోజుల్లో గుర్తొచ్చే సామెత 'ముసిలోడైనా బసిరెడ్డి మేలు' అని.

ఈయన జిల్లా పరిషత్ అధ్యక్షునిగా పనిచేసి చాలా మంచి పేరు తెచ్చుకున్నాడు. తరువాత కాలంలో ఈయన క్రింద పనిచేసినవారు చాలా ఎత్తుకు ఎదిగిపోయారు. ఈయన కుటుంబంతో మా పెద్ద నాన్నకున్న అనుబంధం ఇంతకు ముందే వివరించటం జరిగింది.

ఆ తరువాత చెప్పుకోతగ్గవాడు మా సమితి ప్రెసిడెంటు. మా పోరుమామిళ్ల సమితికి ముగ్గురు పోటీపడేవాళ్లు. ఈ సమితి ప్రెసిడెంటును గ్రామ పంచాయితీ ప్రెసిడెంట్లు ఎన్నుకుంటారు. ముగ్గురిలో ఇద్దరికీ దగ్గర దగ్గర 26 ఒకరికీ, 27 ఒకరికీ పంచాయితీ ప్రెసిడెంట్లు ఉంటారు. మూడవ ఆయన బొమ్ము రామారెడ్డి. ఈయనకు అయిదు లేదా ఆరు మంది పంచాయితీ ప్రెసిడెంట్లు ఉంటారు. మిగతా ఇద్దరూ బద్ధ శత్రువులు. తాము సమితి ప్రెసిడెంటు కాకపోయినా తమ ప్రత్యర్థి కావాలని కోరుకోరు. అందుకే ఇరవై ఆరు మంది మద్దతు వున్న అభ్యర్థి ఐదారు మంది మద్దతు వున్న అభ్యర్థి బొమ్ము రామారెడ్డిని సమితి ప్రెసిడెంటును చేస్తాడు. చాలాసార్లు ఇలానే జరిగింది.

పల్లెల్లో ఈయన పేరు 'బొంగు' రామారెడ్డిగా ప్రచారంలో వుండేది. ఎవరైనా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందితే వీడు 'బొంగు రామారెడ్డి' అనేవారు.

ఇక మా పలుగురాళ్ళపల్లె పంచాయితీ రాజకీయాలకు వస్తే, బసవయ్యగారికి, వీరారెడ్డిగారికి పోటాపోటీగా వుండేది. పలుగురాళ్ళపల్లె పెద్ద ఊరు కావటం, ఓట్ల శాతం ఎక్కువ అక్కడే ఉండటం, మిగతా నాలుగైదు చిన్న పల్లెలు కావటంతో, ఎప్పుడూ బసవయ్యగారే ప్రెసిడెంటుగా అయ్యేవారు. వీరారెడ్డిగారిది ఔకుపల్లె.

ఈయన 'రెడ్డి పని' కూడా చేసేవారు. ఆరడుగుల ఆజానుబాహుడు. స్ఫూరద్రూపి. జమాబందికని బద్వేలు వెళితే.... డబుల్ కప్పుల షర్ట్, బంగారు గుండీలు, కిర్రు చెప్పులు వేసుకుని బద్వేలు వీధుల్లో నడుస్తుంటే.... ఆడవాళ్లు తలుపుల చాటునుంచి తొంగి చూసేవాళ్ళని చెప్పేవారు. నాన్నకు, పెద్దనాన్నకు మంచి స్నేహితుడు. పలుగురాళ్ళపల్లెలో రెండవ సంసారం ఉండేది. ఆమెకు పెద్ద సంతానమే వుండేది. అందరినీ గౌరవంగా పోషించేవాడు. మా అమ్మ చేసిన కాఫీ అంటే చాలా ఇష్టం.

అప్పుడప్పుడు వచ్చి అడిగి కాఫీ తాగిపోయేవాడు. చనిపోటానికి ముందురోజు కూడా కాఫీ తాగి, ఆ కాఫీ గ్లాసు బోర్లించాడు మొదటిసారి. అమ్మ దాన్ని రాబోయే విపత్తుకు శకునంగా భావించి నాన్నకు చెప్తే, ఆయన పట్టించుకోలేదు. మరుసటి రోజు రాత్రే ఆయన పరమపదించారు.

జాతీయ స్థాయి నాయకులు ఇద్దరు వచ్చేవారు. వారిలో 'ఎద్దుల ఈశ్వరరెడ్డి' ఒకరు. ఈయన కమ్యూనిస్ట్ పార్టీ లీడరు. అయిదేళ్లకొకసారి వచ్చే ఎన్నికలైనా



ఈయన అప్పుడప్పుడు నియోజకవర్గంలో అన్ని పల్లెలు తిరిగేవాడు. నిరాడంబర జీవి. జీవితాన్ని ప్రజాసేవకు, పార్టీ సేవకు అంకితం చేసిన మనిషి. పార్టీ సిద్ధాంతం కమ్యూనిజమైనా

ఆయన జీవన విధానం గాంధేయ మార్గం. కేవలం రెండు జతల బట్టలు గుడ్డల సంచీలో పెట్టుకుని ఊరూరా తిరిగేవాడు. ఎవరింట్లో ఆతిథ్యమిస్తే వాళ్ళింట్లో ఉండేవాడు. ఏవిధమైన 'ఎచ్చులు' చూపేవాడు కాదు. 'ఈశ్వ రెడ్డన్న' వచ్చినాడంటే జనం పలకరించి, పులకరించిపోయేవారు.

ఎన్నికలకు ముందు మాత్రం ప్రజానాట్య మండలివారు ప్రతి గ్రామ పంచాయితీలో నాటకం వేసేవాళ్ళు. పాలకుల దోపిడీ, దొరతనం, అభాగ్యుల ఆర్తనాదాలు, అబలల బలిదానాలు, చిన్నారుల ఆకలికేకలు, ధనవంతుల దౌర్భాగ్యపు పనులు, ఈ నాటకంలోని పాటల ద్వారా, నటన ద్వారా అట్టడుగు ప్రజానీకానికి చేరవేసేవారు. ఆయా ఊర్లో ఉండే ప్రముఖులు, ప్రజారంజకుల పేర్లు చేర్చి పాటల ద్వారా ఓట్లు అడిగేవాళ్ళు.

మా పంచాయితీలో నాటకం వేసినప్పుడు, 'ఏమయ్యా... సుబ్బరామయ్యా.. నీ ఓటెవరికి వేస్తావయా' అనే పాట చాలా జనాదరణ పొందేది. ఎన్నికలయిన ఆరునెలల తరువాత కూడా ఈ పాట పిల్లా పెద్ద నోట పలుకుతూ వుండేది. ఈశ్వరెడ్డన్న మాత్రం ఊరికి వచ్చి పార్టీకి ఓటెయ్యమని, ఓటు గుర్తు గుర్తుపెట్టుకోమని చెప్పేవాడేగానీ, నాకు ఓటు వెయ్యమని అడిగేవాడు కాదు. ఆది ఆనాటి నాయకుల లక్ష్యం,. లక్షణం.

మరో గొప్ప జాతీయనాయకుడు వడ్లమాను చిదానందమయ్య. వేల ఎకరాల ఆస్తిపాస్తులను, ధనధాన్య వస్తు సంపత్తిని ప్రజాసేవకు, రాజకీయాలకు అంకితం చేసిన మనిషి. స్వతంత్ర పార్టీ పెట్టినప్పుడు, ఆ పార్టీలో ప్రప్రథమ నాయకుడిగా ప్రచారం పొందాడు.

ఆరోజుల్లో అప్పుడప్పుడు గుఱ్ఱం మీద కూడా వచ్చేవాడు. ఆయన వచ్చాడంటే ఊళ్ళో ఊర్లో అందరికీ ఆనందం. ఊర్లో వుండే అంగళ్ళన్నిటిలో బీడీ కట్టలు అయిపోయేవి. నిమిషానికి ఒక బీడీ కాల్చి రెండు పీల్పులు పీల్చి పడేసేవాడు. ఊర్లో తుంట బీడీలు ఏరుకుని తాగే అల్లరి పిల్లలందరికీ ... ఓ నెల రోజులపాటు తుంట బీడీలు దొరికేవి.

ఎన్నికల ప్రచారం హోరాహోరీగా జరిగే రోజుల్లో ఓసారి వాళ్ళ ఊరినుండి మనిషి వచ్చారట. విషయమేమిటంటే, చిదానందమయ్య వారి గడ్డివామిని అమ్మారు. కొన్నవాళ్ళు లారీలతో వరిగడ్డిని వారం రోజులు తరలించారు.

(ఇంకా వుంది)



# భాగవతులతో అనుబంధం

శ్రీవేంకటాచార్యులు

(గత సంచిక తరువాయి)



ఆ విధంగా సోమశర్మ బ్రహ్మ రాక్షసునిగా మారి ఒక అడవిలో బ్రతుకుతున్నాడు. సోమశర్మ పూర్వజన్మ సుకృతం వల్ల కౌశికుని దర్శనం లభించింది.

వీరి దర్శనంతో రాక్షసరూపంలో ఉన్న రామశర్మ అజ్ఞానం తొలగి తన పూర్వ స్మృతి జ్ఞాపకం వచ్చి వారి రాకకు ఎదురుచూస్తున్నాడు. కౌశికుడు తిరుక్కురుంగుడి క్షేత్రానికి వెళ్లి తన వీణాగానంతో స్వామిని మేలుగొలిపి స్వామినుండి శెలవు తీసుకుని అన్నమాట ప్రకారం బ్రహ్మరాక్షసుని చెంతకు వచ్చి 'నన్ను భుజించి నీ ఆకలి తీర్చుకోమని కోరగా బ్రహ్మరాక్షసుడు దుఃఖిస్తూ, 'నా పాపాలే నన్ను బ్రహ్మరాక్షసునిగా మార్చాయి. వాటిని తొలగించే శక్తి మీచెంత ఉంది' అంటూ కౌశికునికి సాష్టాంగ నమస్కారం చెయ్యాలని ప్రయత్నిస్తుంటే కౌశికుడు 'నేను ఛండాలకులంలో పుట్టినవాడను. మీరు నాకు నమస్కరించరాదు' అంటూ దూరంగా జరుగుతుంటే, రాక్షస రూపంలో ఉన్న సోమశర్మ 'శ్వపచోపి మహీపాల విష్ణుభక్తో ద్విజోధికః విష్ణుభక్తి విహీనస్తు యతిశ్చ శ్వపచాధమః' - ' ఛండాలుడైనా విష్ణుభక్తి ఉంటే బ్రాహ్మణునికన్నా గొప్పవాడు. విష్ణుభక్తి లేని సన్యాసి చండాలునికన్నా తక్కువవాడు. గాన నేను మీకు సాష్టాంగ నమస్కారం చేయవచ్చు' అంటూ నమస్కరించి, 'కనీసం నీ గాన ప్రభావం చేతనైనా నా దుఃఖం తొలగే విధంగా నా రాక్షస స్వరూపాన్ని మరియు నా పాపరాశిని తొలగింపు'మని ప్రార్థింపగా, ఆ భాగవతోత్తముడు 'యన్మయా పశ్చిమం గీతం స్వరం కైశిక ముత్తమమ్' - తాను ఆరోజు స్వామి చెంత చివరిగా పాడిన కైశికమునే రాగఫలాన్ని ఆ బ్రహ్మరాక్షసునకు ధారపోయగా రాక్షసరూపం తొలగి బ్రాహ్మణరూపంతో పాటు భగవద్భక్తునిగా ఉజ్జీవించే ఫలం లభించింది. మరో వృత్తాంతముగా:

శ్రీరంగమునకు నైఋతి దిక్కున కావేరీ తీరమున నిచుళాపురం-(ఉరయూర్) అను గ్రామము కలదు. ఈ గ్రామమునందు మాలదాసరి ఇంట తిరుప్పాణాళ్వారు పెరిగి జ్ఞాన భక్తి వైరాగ్యములతో ప్రకాశిస్తూ ఉండేవాడు. వారి కుటుంబములో స్వామిని కీర్తిస్తూ జీవన విధానాన్ని కొనసాగించటం ఆచారం. వీరు ప్రతి రోజూ బ్రహ్మీ ముహూర్తానికి ముందే లేచి, వీణను చేత ధరించి రంగనాథుని ఆలయానికి దూరంగానే నిలబడి తన వేదం గానంతో రంగనాథుని మేలుకొలిపి భగవంతుని తీర్థ బిందె వంటి కార్యక్రమాలకు తన కార్యక్రమము అడ్డు లేకుండా చూసుకుంటూ తదుపతి నగర సంకీర్తన జరిపి, వారు పెట్టే భిక్షతో జీవిస్తూ ఉండేవాడు.

(ఇంకా వుంది)

# గడి - నుడి

చాగంటి కృష్ణకుమారి

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | ■ | 3 | 4 | 5 |
| 6 | | ■ | 7 | ■ | 8 | |
| | ■ | 9 | | 10 | ■ | |
| ■ | 11 | | ■ | 12 | | ■ |
| 13 | ■ | 14 | 15 | | ■ | 16 |
| 17 | 18 | ■ | | ■ | 19 | |
| | | 20 | ■ | 21 | | |

## సూచనలు: నిలువు:

1. మూడు భుజములు కలది(3)

2. కొక్కొరో కో (2)

4. కోడి పందాలలో కోడి పుంజు కాలికి కడతారు (2) కిందనుండి పైకి. కొంతమంది తెలుగు వారి ఇంటి పేరు కూడా

5. ఆయుర్వేద వైద్యంలో వాడే వృక్ష సంబంధమైనది(3)

7.నీరు.(2)

9. తనదైన స్వభావము , స్వాభావికము ( 3) కిందనుండి పైకి

10. భారతీయ బౌతిక శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్ గారి పేరును ఈ కణానానికి కణ బౌతికశాస్త్రవేత్తలు పెట్టారు(3)

13. తరంగ కణ స్వభావములు రెంటిని కలిగిన కాంతి కణము(3)

15. దుడ్డు కర్ర (2)

16 .ప్రవచనాలను ఉపదేశించే పండితుడు (3)

18. జహంగీర్ రతన్‌జీ దాదాభాయి టాటా గారు ప్రవేశపెట్టిన వాణిజ్య సంస్థలకు ఏపేరున పిలుస్తారు? (2)

19 అసలుకంటే ముద్దొచ్చేది పైకి పోతున్నది (2)

## సూచనలు: అడ్డము:

1. మూడు కోణములు కలది (3)

3. శిలలు శిథిలమవగా ఏర్పడే పదార్థాము (3)

6. ఋజ్జాయి నడకలు

8. ప్రస్థుతము నడుస్తున్న యుగము (2)

9. నైవేద్యము (3) అటునుంచి ఇటుగా

11. తనదైన (2)

12. ఈ పురుగు శాస్త్రీయ నామము Araneae(2)

14.పాలి అమైడ్ లని పిలువబడే కొన్ని రకాల ప్లాస్టిక్ పదార్థాల కు చెందిన రసాయనము దీనితో బట్టలు తయారవుతాయి. (3)

17. వీడ్కోలు చెప్పేటప్పుడు ఈ దీర్ఘా క్షరాన్ని రెండు సార్లు పలుకుతూ ఇక వుంటాను శలవు అంటావు (2)

19. అటునుంచి ఇటు తిరిగిన వెంకటాచలపతి ఈ కాసుల వాడు (2)

20. పరమాణు కేంద్రకంలో వుండే దీనికి ధనావేశముంటుంది(3) అటునుంచిటు

21. విడదీయబడిన (3)

# పదమూడేళ్ల వయస్సులోనే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన పూర్ణమాలావత్



"ముదితల్ నేర్వగ రాని విద్యగలదే ముద్దార నేర్పించినన్ "చిలకమర్తి వారి పై పద్యపాదంలోక ప్రసిద్ధమైనది.పూర్తి పద్యం చూడండి.

చిలకమర్తివారి "ప్రసన్నయాదవం"నుండి --

చం. చదవన్నేర్తురు పూరుషుల్పలెనె శాస్త్రంబుల్ పఠింపించుచో
నదమన్నేర్తురు శత్రుసేనల ధనుర్వ్యా పారముల్ నేర్చుచో
నుదితోత్సాహము తోడ నేలగలరీ యుర్విన్ బ్రతిష్ఠించుచో
ముదితల్ నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్.

పై పద్యంలోని నిరూపించడమ నారీమణులు ఎందరో ఉన్నా వారిలో మాలావత్ పూర్ణ మాత్రం ప్రత్యేకం.ఒక ఇందిరా గాంధీ ప్రధాన మంత్రి అయ్యిందంటేఆమె ఒక ప్రధాన మంత్రి కూతురు.ఒక జయలలిత ముఖ్య మంత్రి అయిందంటే ఆమెపేరుగాంచిన సినిమాతార.మనకు పురాణాల్లో సత్యభామ,చరిత్రలో రాణీ రుద్రమ,ఝాన్సీలక్ష్మీబాయి లాంటి వారు తారసిల్లుతారు.కాని వారికి పటిష్టమైన గృహనేపథ్యాలున్నాయి. అంతేగాక పైవారందరికీ తగిన వయస్సు,విద్య,అనుభవాలు,ఉన్నత కుటుంబవారసత్వం అన్నీ ఉన్నాయి.

కాని పూర్ణ మాలావత్ కు పైవేవీ లేవు.ఆ అమ్మాయి నిజామాబాదు జిల్లా సిరికొండమండలం,పాకాల గ్రామం లో ప్రకృతి ఒడిలో జీవనం గడిపే దళిత దంపతులు దేవీదాస్, లక్ష్మి గారల కుమార్తె. పదమూడేళ్ల వయస్సులోనే ఈ దళితబాలిక ఎవరెస్టుశిఖరాన్నధిరోహించి మహిళా పురోగతికొక మంచి తార్కాణమై నిలచింది. అతి చిన్నవయసులో అట్టడుగు వర్గానికి చెందిన అమ్మాయి ప్రపంచలోనే అత్యంత ఉన్నతశిఖరమైన ఎవరెస్టు నధిరోహించి ప్రపంచ రికార్డు సాధించటం మామూలు విషయంకాదు.

అంత చిన్న వయసులో అపరిచితులతో,వెళితే తిరిగివస్తామన్న భరోసాలేనివాతావరణ పరిస్థితులకు సంసిద్ధమై అనుకున్న పనిని సాధించి అటు తల్లి-






దండ్రులకు ఇటు ప్రోత్సహించిన గురుకులపాఠశాలల కమీషనర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ గారికీ పేరు తెచ్చిన పూర్ణ ఒక సంపూర్ణవిజేత.

రాష్ట్రపతి,ప్రధానమంత్రి,ముఖ్యమంత్రి వంటి ప్రముఖుల ప్రశంసలు పొందడమే గాకపాతిక లక్షల పారితోషికం గృహ నిర్మాణానికి లభించటం వెనుక కొంత నేపథ్యం ఉంది.

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే పూర్ణ ఆటలలో తనప్రతిభను నిరూపించుకోవడం తో ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ గారు తమ సంస్థలోచదువుకునే వెనెనుకబడిన విద్యార్థుల కోసం తలపెట్టిన పర్వతారోహణ శిక్షణాకార్యక్రమానికి ఎంపికైంది. మొదట భువనగిరి గుట్టమీద ,ఆ తరువాత డార్జిలింగ్, లఢక్లో శిక్షణ ఇప్పించారు. పూర్ణకు మౌంటెనీరింగ్ లో సుశిక్షితులైన శేఖర్ బాబుగార కోచ్ గాఉన్నారు.శిక్షణలో భాగంగా యోగాభ్యాసం,విపరీత మైన చలికి ఎలా తట్టుకోవాలి,ఆకలిదప్పులు ఎలా ఓరిచుకోవాలి ,ఏయే పరిస్థితుల్లో ఎలాంటివన్నీ తర్ఫీదు ఇచ్చిన తరువాతేమౌంట్ ఎవరెస్ట్ ఎక్కేందుకు నిర్ణయం జరిగింది. అన్ని పరీక్షల్లో పట్టుదలతో ప్రథమస్థాయిలో నెగ్గి తన ప్రతిభతో అవకాశం చేజిక్కుం చుకుంది




పూర్ణ.52 రోజుల పాటు జరిగిన-సుదీర్ఘ పర్వతారోహణ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని-,మాతృదేశానికి,మహిళాజాతికి-,విద్యార్థులకు,దళితవర్గానికి,తెలంగాణల రాష్ట్రానికి అన్నిటికంటే ముఖ్యంగ స్వేరోనిర్మాత ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కన్న కలలు నిజం చేసిన పూర్ణా మాలావత్అభినందనీయ.

25 మే2014 ఉషోదయవేళ 6.30 గంటలకు సముద్రమట్టానికి 8,849 మీటర్ల ఎత్తున ఉన్నఎవరెస్ట్ పర్వత శిఖరాగ్రం మీద పాదం మోపినపుడు తన అనుభూతిని వ్యక్తం చేస్తూ 'ఎంతో గర్వంగా అనుభూతి చెందాను-,నా తెంపలమీదఆనందాశ్రువులు జారటం గమనించాను ' అక్కడ అప్పుడే పడుతున్న సూర్యకిరణాల అందం చూసి పరవశించాను.అలాగే ముందుగా తన రాకెట్ లోనుండి తెలంగాణ పతాకాన్ని తీసిఅక్కడ పాతటం తనకు ఆనందం కలిగించిన విషయంగా చెప్పింది పూర్ణ.

అవకాశం లభిస్తే అమ్మాయిలు ఏ పనైనా సాధిస్తారు అని నిరూపించిన పూర్ణ మాలావత్ ఆ తరువాత ప్రభుత్వ సహకారంతో విదేశాలలో ఉన్న పలు ఎత్తైనపర్వతాగ్రాలను ఎక్కాలని,సివిల్స్ పరీక్షలు రాసి ఉన్నతోద్యోగి సంపాదించాలనే ఆశయంతోముందుకు సాగుతున్నది.మహిళా దినోత్సవ సందర్భంగా ఆ అమ్మాయికి అభినందనలు.

# ఆడవాళ్లు ఆనందంగా ఉంటే అద్భుతాలే



చైతన్యం పాఠకులకు నమస్కారములు. ఈ నెల 8 వ తారీఖున ప్రపంచ మహిళా దినోత్సవం. ఈ సందర్భంగా మహిళలందరికీ ధన్యవాదాలు. ఈ సంచికలో మనం మహిళల గురించే మాట్లాడుకుందాం. ఈ కరోనా లాక్ డౌన్ పరిస్థితులలో గత సంవత్సరం నుండి అందరూ చాలా రకాల ఒత్తిడులకు గురి అవుతూనేవున్నారు. ఆడవాళ్లు ఈ ఒత్తిడిని మరింత ఎదుర్కొంటున్నారనే చెప్పాలి. ఉద్యోగం చేసే ఆడవాళ్ళైతే ఇంటినుండే పనిచెయ్యటం, ఇంట్లో అందరికీ అన్నీ అమర్చిపెట్టి ఆఫీసు పని చూసుకోవడం, ఇంట్లో అందరి ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని కూరగాయలు కడగడం దగ్గరనుండి, కషాయాలు కార్చడం, ఆవిర్లు పట్టించడం, బలవర్ధకమైన ఆహారాన్ని అందించడం ఇలా శారీరకంగా, మానసికంగా, ఉద్యోగాలు పోయినా లేక జీతాలు తగ్గించేసినా ఇళ్లల్లో ఆర్థిక ఇబ్బందులు కూడా ఎదుర్కొంటున్నారు.

ఈ ప్రస్తుత పరిస్థితి అందర్నీ కుదిపేస్తున్నా - ఆడవాళ్ళ మీద దీని ప్రభావం చాలా కనిపిస్తున్నది. పెళ్ళిళ్ళు పేరంటాలకు వెళ్లడం తగ్గిపోయింది. కిట్టీ పార్టీలు, షాపింగులు లేవు... నిరంతరం ఇంట్లో పని చేస్తూ ఉంటే ఇక ఎప్పటికీ ఇలాగే ఉండిపోతామా అన్న దిగులు, నిరాశ తలెత్తు-



తున్నాయి. ఈ మానసిక, శారీరక ఒత్తిడిని ఎవరూ తగ్గించలేరు. మనకు మనమే దీనికి ఏమైనా ఉపశాంతి ఉందేమో ఆలోచించుకోవాలి. మనకంటూ రోజులో ఓ గంట, గంట కుదరకపోతే కనీసం ఓ నలభై నిముషాలు మనకిష్టమైన పనిని చేస్తూ మనం ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

కొందరు పాటలు వింటూ రిలాక్స్ అయిపోతారు. కొందరికి ఫోన్లో మాట్లాడడం చాలా రిలీఫ్ గా అనిపిస్తుంది. ఇంకొందరికి తోట పని, ఇలా మనకు ఏపని చేస్తే ఉత్సాహం ఆనందం కలుగుతుందో ఆలోచించుకుని ఆ పనికి రోజుకు కనీసం నలభై నిముషాలు కేటాయించుకుని, ఆ పని చేస్తూ మనతో మనం మమైక్యం అవడంవల్ల కొత్త శక్తి వచ్చినట్లు అవుతుంది. మీకు పూజలు ఇష్టమైతే ... సప్తాకం లేదా మండల దీక్షలు అనుకుని హనుమాన్ చాలీసానో, సుందరకాండో, విష్ణుసహస్రమో, లేదా బాబా చరిత్రో ఇలా రోజూ ఒక సమయంలో అది పారాయణ చేసుకుంటే ఇంట్లోవాళ్ళు మీ గంటని మీకు వదిలేస్తారు. వాళ్ళకీ అర్థమవుతుంది. ఇప్పుడు ఆన్ లైన్ లో బోలెడు పెయింటింగ్ కిట్స్ దొరుకుతున్నాయి. వాటిని

ఆర్డర్ చేసి చీరలపై, దుప్పట్లపై టీవీ కవర్లపై, సెంటర్ టేబుల్ పై మన సృజనాత్మకకు మెరుగులు దిద్దుకోవచ్చు. అలాగే చిన్న మట్టి కుండీలలో మెంతులు, ఆకుకూర విత్తనాలు చల్లి, ఇప్పుడు నీటితోనే మంచి మంచి ఆకుకూరలు పండిస్తున్నారు. మంచి మంచి పుస్తకాలు చదువుకోవచ్చు. లేదా మెడిటేషన్ చేసుకోవచ్చు. లేదా శరీర పోషణ మొహానికి గంధం రాసుకోవడం, కాళ్ళు గోరువెచ్చని నీళ్లలో పెట్టుకుని రిలాక్స్ అవడం, ఇలా మన శరీర సౌందర్య పోషణ చేసుకోవడం, పాత సినిమాలు చూడడం, వాకింగ్ కి వెళ్లడం, ఏదో ఒకటి మన కోసం మనకిష్టమైన పనికి ఓ అరగంట కేటాయించుకోవడం పెద్ద కష్టమైన పనేం కాదు. దీనివల్ల మిగతా గంటల పనితీరులో ఉత్సాహం, మనకి మానసిక ఉల్లాసం రెండూ ఉంటాయి. ఆరోగ్యమే మహాభాగ్యం ... మనస్సు కూడా ఆనందంగా ఉంటే ఇంట్లో వాళ్ళని కూడా మీరు సంతోషంగా ఉంచగలుగుతారు. మహిళలు అన్నింటా ప్రత్యేకతను ప్రదర్శిస్తూ ముందుకు దూసుకుపోతున్న ఈ సమయంలో మనతో మనం కొంత సమయాన్ని గడపడం మాత్రం మరచిపోవద్దు. మరోసారి మహిళా దినోత్సవ శుభాకాంక్షలతో ...



మీ.... భారతి, సైనిక్ పురి

ఫిబ్రవరి నెల గడి- నుడి సమాధానాలు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | కేం | ద్ర | క | శ | క్తి | |
| ప | | వం | | శి | | వ |
| త్ర | పా | | అ | | అ | క్క |
| హ | ల | ము | | వ్య | ర్ధ | ము |
| రి | నా | | ల | | ము | క్క |
| తం | | ఒ | | యు | | లు |
| | సౌ | ర | శ | క్తి | ని | |


400 వికెట్ల మైలురాయిని
అధిగమించిన అశ్విన్


శివరాత్రి శుభాకాంక్షలు

RNI No. APTEL/2011/39497 MARCH 2021 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication: 1st March Date of Posting: 8th March




Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.